సాక్షి 24|7

సంగారెడ్డి

శనివారం 6-1-2018

వాహనంలో రక్షణ లేకుండా ఖైదీలను తీసుకెళ్తున్న దృశ్యం



ఇదేనా రక్షణ?

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణం నుంచి కంది జిల్లా జైలు వైపు ఖైదీలను ఎలాంటి రక్షణ లేకుండా చిన్న ఆటో ట్రాలీలో ఇలా తీసుకెళ్లారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. ఎలాంటి రక్షణ లేకుండా వాహనంలో ఖైదీలను తరలించడంపై స్థానికంగా చర్చించుకోవడం కనిపించింది.

పటాన్‌చెరులో నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ సర్వీస్ రిజర్వాయర్



- జీహెచ్‌ఎంసీ పరిధిలో గోదావరి నీటి సరఫరాకు సన్నద్ధం
- రూ.398 కోట్లతో తరలింపు పనులు
- పటాన్‌చెరు, ఆర్సీపురంలో రిజర్వాయర్లు
- చురుగ్గా సాగుతున్న 'మిషన్ భగీరథ' పనులు
- కనుమరుగు కానున్న 'మంజీరా'

ఇక గోదావరి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంతర్భాగంగా ఉన్న పటాన్‌చెరు, రామచంద్రాపురం వాసులు త్వరలో గోదావరి జలాలతో దప్పిక తీర్చుకోనున్నారు. మిషన్ భగీరథలో భాగంగా గోదావరి జలాలను ఈ రెండు పట్టణాలకు తరలించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ నాటికి పనులు పూర్తయితే మంజీరా నీటికి బదులు గోదావరి జలాలను స్థానికంగా సరఫరా చేస్తారు. మరో వైపు జీహెచ్‌ఎంసీకి సరఫరా నిలిపి వేయడం ద్వారా మిగులుతున్న మంజీరా నీటిని సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తారు.

-సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

గోదావరి ఉపనది మంజీరాపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టు నుంచి దశాబ్దాల తరబడి హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నిర్మించిన ఒకటి, రెండో దశల ద్వారా 2.96 టీఎంసీలు, దిగువన ఉన్న మంజీరా జలాశయం (కల్పగూరు) ద్వారా 4 టీఎంసీల చొప్పున సరఫరా చేస్తూ వస్తున్నారు. మంజీరా నుంచి తరలిస్తున్న తాగునీటిని జీహెచ్‌ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురంతో పాటు శేరిలింగంపల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైదర్‌నగర్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. మంజీరా నీటితో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో కృష్ణా, గోదావరి నదీ జలాలను కూడా సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గోదావరి జలాలను పటాన్‌చెరు ప్రాంతానికి తరలించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి మిషన్ భగీరథ పనులు పూర్తయితే.. జీహెచ్‌ఎంసీకి మంజీరా జలాల తరలింపును నిలిపివేయాలని

- మిగతా 2లో▸

చీపిరి.. బతుకు ఊపిరి

- స్థానికంగా చేసేందుకు పనులు కరువు
- కడుపు నింపని 'ఉపాధి హామీ'
- అడవి, గట్టు ప్రదేశాల్లోకి పరుగులు
- చీపురు కట్టలతో స్వయం ఉపాధి
- మహిళా కూలీల జీవన పోరాటం



వివరాలు 8-9లో ▸

అయ్యా.. ఎమ్మెల్యే గారు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ 1,8 వార్డుల్లో సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా తాగునీటి.. డ్రైనేజీ సమస్య పట్టి పీడిస్తోంది. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గ్రామానికి వస్తున్నారని తెలుసుకుని "మా సమస్యలు పట్టించుకోండి ఎమ్మెల్యే గారూ" అంటూ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఇలా వినూత్నంగా బ్యానర్లు ఏర్పాటు చేశారు.





అధిక దిగుబడిని ఇచ్చే కో 9520 రకం చెరుకు

రైతన్నకు దన్ను

- న్యాల్‌కల్ పరిధిలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం
- పంట దిగుబడులు పెంచేందుకు కృషి
- నూతన వంగడాలను అందుబాటులోకి తెచ్చిన శాస్త్రవేత్తలు
- ఆధునిక వ్యవసాయంపై అన్నదాతలకు తరచూ శిక్షణ
- జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రైతులకు సైతం తరగతులు
- పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు ఒకప్పుడు పాత పద్ధతులు అవలంబించి వ్యవసాయం చేస్తూ ఆశించిన దిగుబడి రాక నష్టాల పాలయ్యేవారు. లాభాలమాట దేవుడెరుకు కనీసం పెట్టిన పెట్టుబడి వచ్చినా చాలనుకునేవారు. ఈ క్రమంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు ప్రభుత్వం వ్యవసాయ పరిశోధనా స్థానాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గం వెనుబడిన ప్రాంతం కావడంతో వ్యవసాయం అభివృద్ధి చెందడం లేదని, ఇక్కడ అధిక శాతం వాణిజ్య పంట చెరుకును పండిస్తారని, వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ అప్పట్లో స్థానిక శాసనసభ్యుడు సురేష్‌కుమార్ శెట్కార్ ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసింది. దిగుబడులు పెంచడం, వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ పనిముట్లను రైతులకు అందించేందుకు 2007లో న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్-మామడ్గి శివారులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంతో పాటు యాంత్రీకరణ విధానాన్ని రైతులకు అందించేందుకు కృషి

- మిగతా 2లో▸

సమాచారం

14,15 తేదీల్లో వాలీబాల్ టోర్నీ

రాయికోడ్(అందోల్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పీపడ్‌పల్లిలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు భవాని యువజన సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14,15 తేదీల్లో పోటీలు ఉంటాయన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు ఈ నెల 12లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టోర్నీలో పాల్గొనే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విన్నర్ జట్టుకు రూ.15,000, రన్నర్ జట్టుకు రూ.8,000, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3,051లతో పాటు మెమెంటోలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94905 22569, 79952 41554, 95811 15222 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి కోసం శిక్షణ

జహీరాబాద్: మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధిని పొందేందుకు పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని స్పైస్ సంస్థ సభ్యులు తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ మైనార్టీ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'సీఖో ఔర్ కమావో' పథకంలో భాగంగా స్థానిక స్పైస్ టెక్నాలజీలో కంప్యూటర్, హార్డ్‌వేర్, డీటీపీ, టాలీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణానంతరం అభ్యర్థులకు విద్యార్హతను బట్టి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. శిక్షణ కోరే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలతో పట్టణంలోని డైమాండ్ టెక్స్‌టైల్ భవనం రెండో అంతస్తులోని స్పైస్ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 89195 15761 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు దశాబ్ది ఉత్సవాలు

సంగారెడ్డి జోన్: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 7న (ఆదివారం) దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యకుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట పేపర్ పరిశ్రమలోని ఉద్యోగులను కలిసి శుక్రవారం సంఘం విధులు, బాధ్యతలను వివరించారు. హైదరాబాద్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సావాలు ప్రారంభవుతయన్నారు. భారీ సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

9న బస్‌భవన్ ఎదుట ధర్నా

సంగారెడ్డి క్రైం: ఆర్టీసీ కార్మికులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించడంతో పాటు బలవంతపు డ్యూటీలను రద్దు చేయాలని టీఎంఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలాన డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం రీజినల్ కార్యదర్శి అక్తర్‌అలీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ.. ఈనెల 9న హైదరాబాద్‌లోని బస్‌భవన్ ఎదుట రాష్ట్ర సమస్యలపై ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. సకల జనుల సమ్మెను స్పెషల్ క్యాజువల్‌గా పరిగణించి జీతం చెల్లించాలని, వైద్య సదుపాయాలను మెరుగుపర్చడంతో పాటు నెలకు మూడు రోజులు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హమీద్, డిపో అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి ఎం.డి.రహీం పాల్గొన్నారు.

రేపు నాలుగో తరగతి ఉద్యోగుల ఎన్నికలు

సంగారెడ్డి జోన్: నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం కార్యావర్గ ఎన్నికలు ఈనెల 7న (ఆదివారం) సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా సభ్యుడు యాదవరెడ్డి తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేంద్ర సంఘం అధ్యక్షుడు గంగాధర్ పర్యవేక్షణలో ఎన్నికలు ఉంటాయన్నారు. అనంతరం 4 గంటలకు ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

రైతన్నకు దన్ను



బసంత్‌పూర్‌లోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం

▶మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై వారిలో అవగాహన కల్పించి దిగుబడులు పెంచేందుకు ఇక్కడి శాస్త్రవేత్తలు పాటు పడుతున్నారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నాయి.



పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్ (ఫైల్)

చెరుకులో కొత్త వంగడాలు..

న్యాల్‌కల్‌తో పాటు చుట్టుపక్కల మండలాల్లో చాలా ఏళ్లుగా రైతులు చెరుకు పంటను అధికంగా సాగు చేస్తూ వస్తున్నారు. వ్యవసాయంలో పాత పద్ధతులు పాటించడంతో పంట దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారు. పంట ఉత్పత్తులు పెంచేందుకు నూతన వంగడాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెచ్చారు. చెరుకు పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పంటపై పరిశోధనలు జరిపి ఇక్కడి నీటి ఎద్దడిని తట్టుకొని, మంచి దిగుబడిని ఇచ్చే ఈప్రాంతానికి అనువైన రకాలను కనుగొన్నారు. కో 9520, కోటీఎల్ 575 రకాలను అందుబాటులోకి తెచ్చారు. కో 9520 రకంతో నీటి ఎద్దడిని తట్టుకొని ఎకరాకు 65 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కోటీఎల్ 575 రకంతో ఎకరాకు 69 టన్నుల వరకు దిగుబడి వస్తుం ది. ఈ రెండు రకాలు నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా వీటిలో చెక్కర శాతం కూ డా అధికంగా ఉంటుందని శాస్త్రవేత్త విజ య్‌కుమార్ తెలి పారు. చెరుకులో అంతర పంటగా అల్లం, పెసర, మి ను ము తది తర పంటలు పండించి మం చి లాభాలు గడించేలా వీరు కృషి చేస్తున్నారు.

చీడపీడలు, దిగుబడులపై అవగాహన..

ప్రస్తుతం కూలీల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నివారించేందుకు యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. పంట వేసే దగ్గర నుంచి కోత కోసే వరకు అవసరమైన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక వ్యవసాయంపై ఏటా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పంట దిగుబడులు, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులు సాగు చేసుకున్న పొలాలను పరిశీలించి పంట దిగుబడులు పెంచేందుకు అవసరమైన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తలు అందిస్తున్నారు. జిల్లాలోని రైతులతో పాటు కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన రైతులు, ఆయా చక్కెర కర్మాగారాల ప్రతినిధులకు కూడా ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహించి పంట దిగుబడులు పెంచుకోవడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడి పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఫలితంగా మంచి దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

ఇక గోదావరి నీళ్లు

▶మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం యోచిస్తోంది. మంజీరా జలాలకు బదులు గోదావరి నీటిని తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తారు. ఇప్పటికే కల్పగూరు జలాశయం నుంచి 3,4 దశల ద్వారా జీహెచ్ఎంసీకి మంజీర జలాల తరలింపును నిలిపివేశారు. ప్రస్తుతం సింగూరు జలాశయం నుంచి ఒకటి రెండు దశల ద్వారా రోజుకు 30 క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. గతంలో నాలుగు దశల ద్వారా 121 క్యూసెక్కుల మేర మంజీర జలాల సరఫరా జరిగేది.

సింగూరు నుంచి నీటి కేటాయింపులు (టీఎంసీల్లో)

	గతంలో	ఇకపై
1,2 దశల ద్వారా జీహెచ్ఎంసీకి	2.96	–
3,4 దశల ద్వారా జీహెచ్ఎంసీకి	4.00	–
ఘణపూర్ ఆయకట్టుకు	4.06	4.13
నిజాంసాగర్ ప్రాజెక్టుకు	8.35	8.35
మిషన్ భగీరథ (జీహెచ్ఎంసీ మినహా)	–	5.43
సింగూరు ఆయకట్టు	–	2.00
ఆవిరి, పూడిక, ఇతర నిల్వ	10.00	10.00
ప్రాజెక్టు సామర్థ్యం	29.91	29.91

చురుగ్గా 'మిషన్ భగీరథ'..

మేడ్చల్ జిల్లా ఘణపూర్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పటాన్‌చెరు వరకు మెయిన్ ట్రంక్ (ప్రధాన పైపులైన్) పనులు 44.5 కిలోమీటర్ల మేర చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా పరిధిలో ఔటర్ రింగు రోడ్డు వెంట బొల్లారం, సుల్తాన్‌పూర్ ప్రాంతాల్లో శరవేగంగా పైపులైన్లు వేస్తున్నారు. ఈ పైపులైన్‌ను పటాన్‌చెరు, రామచంద్రాపురంలో నిర్మిస్తున్న సర్వీసు రిజర్వాయర్లతో అనుసంధానం చేస్తారు. రూ.398 కోట్లతో గోదావరి జలాల తరలింపు పనులు చురుగ్గా సాగుతున్నట్లు మెట్రోపాలిటన్ వాటర్ సప్లై సీవరేజీ బోర్డు వర్గాలు తెలిపాయి. ఈ పనులు పూర్తయితే రోజుకు 78 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తారు. పటాన్‌చెరు, ఆర్‌సీపురం సర్వీసు రిజర్వాయర్లకు గోదావరి జలాలను తరలిస్తే.. 6.96 టీఎంసీల మంజీరా నీటిని ఇతర అవసరాలకు ఉపయోగించే వీలుంటుంది. ఇదిలా ఉంటే గత ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మిషన్ భగీరథ పథకానికి 5.50 టీఎంసీ మంజీరా జలాలను కేటాయించింది. ఈ నీటిని సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు.



బొల్లారం ఔటర్ రింగు రోడ్డు వెంట గోదావరి జలాల తరలింపు కోసం చేపట్టిన తవ్వకం పనులు

'గాలికుంటు' నివారణ టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామారావు రాథోడ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామారావు రాథోడ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని వెంకటాపూర్, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం మండల పశువైద్యాధికారి కళ్యాణితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులంతా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, వెంకట్రామ్ రెడ్డి, ఖాదిర్, మహ్మద్, వెంకట నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామారావు రాథోడ్

విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తన

ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జహీరాబాద్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న శ్రీనివాస రావు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కెమిస్ట్రీ లెక్చరర్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, దీంతో వెంటనే ప్రిన్సిపాల్ సుమలతకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ సదరు లెక్చరర్‌ను తన చాంబర్‌కి పిలిపిం చుకుని విచారించినట్టు చెప్పారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు, విద్యారినుల తల్లిదండ్రులు లెక్చరర్‌పై చేయిచేసుకున్నారు. ప్రిన్సిపాల్ సుమలత ఫిర్యాదు మేరకు లెక్చరర్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.



లెక్చరర్‌ను విచారిస్తున్న ప్రిన్సిపాల్

ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

- 15 మంది విద్యార్థులకు గాయాలు
- ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టడంతో ప్రమాదం
- కల్హేర్ మండలం బాచేపల్లి సమీపంలో చోటుచేసుకున్న ఘటన


గాయపడిన విద్యార్థులు





ప్రమాదానికి గురైన బస్సు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రయివేట్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురై 15 మంది విద్యార్థులకు గాయాలైన ఘటన మండలంలోని దేవునిపల్లి క్రాస్ రోడ్డు సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాసాన్‌పల్లి, ఖానాపూర్(బి), కామారెడ్డి జిల్లా ఆరేడ్, ఆరేపల్లి, తదితర గ్రామాల నుంచి 30 మంది విద్యార్థులు బాచేపల్లిలోని 'డాన్‌బాస్కో' ప్రయివేట్‌స్కూల్‌లో చదువుతున్నారు. రోజులాగే పిల్లలను ఎక్కించుకొని వెళ్తున్న స్కూల్‌బస్సు దేవునిపల్లి క్రాస్ రోడ్డు వద్ద మూలమలుపులో ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. రాంరెడ్డిపేటకు చెందిన డ్రైవర్ కృష్ణ బస్సును నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదంలో పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ మాసాన్‌పల్లికి చెందిన గౌతమి, విద్యార్థులు ఆశ్రీత, రాంచరణ్, సంధ్యారాణి, అరుణ్, అజయ్, జగదీశ్వర్, తదితరులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ కృష్ణ అక్కడి నుంచి పారిపోగా, అక్కడే ఉన్న స్థానికులు పిల్లలను బయటికి తీసి నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పలువురు

ఘటనా స్థలాన్ని ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్, మాజీ ఆత్మ చైర్మన్ భాస్కర్‌సేట్, కల్హేర్ ఎంఈఓ శంకర్ పరిశీలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ఈ ఘటన జరిగినట్టు ఆరోపించారు. వెంటనే స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్హేర్ ఎస్ఐ ఏడుకొండలు, ఎఎస్ఐ లక్ష్మణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన కూలి మృతి


మృతిచెందిన ప్రేమ్‌దాస్

మనూరు (నారాయణఖేడ్): విద్యుద్ఘాతంతో గిరిజన కూలి మృతి చెందిన ఘటన ఘటన మండల పరిధిలోని తోర్నాల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు , ఎఎస్ఐ రఫియోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్(30) మాగీ ఫ్యాక్టరీకి సంబంధించిన చెరుకు తోటలో పనిచేస్తున్నాడు. ఫ్యాక్టరీకి సంబంధించిన రేకుల షెడ్డు నుంచి చెరుకు తీసుకెళ్తుండగా కరెంట్ షాక్ కొట్టి పడిపోయాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఖేడ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రేమ్‌దాస్ కుటుంబాన్ని సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సంబంధిత కలెక్టర్ మాణిక్‌రాజ్ కణ్ణన్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల నష్ట పరిహారం అందించాలని కోరారు. ఆయన వెంట బంజారా సేవా లాల్‌సంఘం నాయకులు రాందాస్, సర్దార్, ధన్‌సింగ్, పుండ్లిక్, పూల్‌సింగ్ ఉన్నారు.

కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెల వద్ద విలపిస్తున్న బాధితుడు

మిరుదొడ్డి(దుబ్బాక): ఊరకుక్కలు దాడిలో 13 గొర్రెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మృతి చెందిన వాటిలో చక్రి మహంకాళికి చెందిన 7 గొర్రెలు, కొమురయ్యకు చెందిన 3, దుర్గయ్యకు చెందిన మరో 3 గొర్రెలు ఉన్నట్టు తెలిపారు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ. 60 వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

ఆగివున్న వ్యాన్‌ను ఢీకొన్న గొర్రెల లారీ

- రెండు గొర్రెలు మృతి
- తప్పిన పెను ప్రమాదం


చనిపోయిన గొర్రెల దృశ్యం

జోగిపేట(అందోల్): గొర్రెల లారీ అదుపుతప్పి వ్యాన్‌ను ఢీ కొన్న ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్ వైపు నుంచి జోగిపేట వైపు వెళ్తున్న గొర్రెల లారీ అందోలు సమీపంలోని మూల మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న మరో వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రెండు వాహనాలు ముందుకు వెళ్లి హేర్ సెలూన్ దుకాణాన్ని ఢీకొట్టాయి. ఇంకా ఆ షాపు తెరచుకోకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సబ్సిడీ గొర్రెలు హైద్రాబాద్ వైపు నుంచి అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామానికి తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్టు తెలిపారు. ఇందులో రెండు గొర్రెలు మృతిచెందగా, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అప్పుల బెంగతో రైతు మృతి


రైతు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబికులు

మనూరు(నారాయణఖేడ్): అప్పుల బెంగతో రైతు గుండెపోటుకు గురై మృతిచెందిన ఘటన మండల పరిధిలోని బెల్లాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..బెల్లాపూర్ గ్రామానికి చెందిన బక్క పట్లోళ్ల మోహన్‌రెడ్డి(35) రెండెడ్లుగా కౌలు భూమి చేస్తున్నాడు. పంట తీవ్ర నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. ఈ బెంగతో గుండెపోటుకు గురై చనిపోయాడు. మృతిచెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

హవేళిఘణపూర్(మెదక్): తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శమ్నాపూర్ గ్రామానికి చెందిన సిద్దయ్య, యాదమ్మల కుమార్తె గీతను తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

గంజాయి పట్టివేత

ఆటో, రెండు బైకులు సీజ్

నారాయణఖేడ్: గంజాయి తరలిస్తుండగా ఆటో, రెండు బైక్‌లను సీజ్‌చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ సూర్యప్రకాష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...కద్లూల్ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎస్ 15 వీసీ 4260 నెంబరు గల ఆటోలో 62కి లోల గంజాయి పట్టుకున్నాం. నాగన్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ దోపల్లి అశోక్‌రావుపై కేసునమోదు చేసి ఆటోను సీజ్‌చేశాం. అలాగే ఏపీ 23 ఏజే 6746 నెంబరు గల బైక్‌పై గరిడెగాం గ్రామానికి చెందిన గజ్జాడ గంగొండ గంజాయి బస్తాను తీసుకెళ్తుండగా , అలాగే రేగోడ్ మండలం తాట్‌పల్లికి చెందిన పెద్ద గొల్ల యాదయ్య మరో బైక్‌పై గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నాం. నిందితులపై కేసు నమోదు వాహనాలను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

భార్యపై దాడిచేసి కొట్టిన భర్తపై కేసు

రామాయంపేట(మెదక్): తరచూ భార్యను కొడుతున్న భర్తపై శుక్రవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసుల థనం ప్రకారం...వెల్దుర్తి మండలానికి చెందిన కిచ్చన్నగారి శివశంకర్, అరుణ దంపతులు కొంతకాలంగా రామాయంపేటలో నివాసం ఉంటున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న శివశంకర్ భార్యను తరుచూ కొడుతుండటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నర్సాపూర్‌రూరల్: చికిత్స పొందుతు వివాహిత మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటరాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం .. సందిలా మమత అలియాస్ కవిత (19) గతనెల 25న కూరగాయల పంటకు సోకిన చీడపీడల నివారణ కోసం ఆమె భర్త భిక్షపతి క్రిమి సంహారక మందులు పిచికారి చేశాడు. మరుసటి రోజు అదే పంటలో మమత కలుపు తీసి మధ్యాహ్నం సమయంలో చేతులు సరిగ్గా కడుక్కోకుండా భోజనం చేసింది. దీంతో ఆమె తీసుకున్న ఆహారం పాయిజనై వాంతులు చేసుకోగా, కుటుంబ సభ్యులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా గురువారం రాత్రి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు.

వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

- అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించండి
- నగర పంచాయతీ పరిధి సంగాపూర్‌లో కార్డన్ సెర్చ్
- 24 బైక్‌లు స్వాధీనం.. గజ్వేల్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు


కార్డన్‌సెర్చ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గజ్వేల్: వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండాలని స్థానిక సీఐ ప్రసాద్ సూచించారు. సిద్ధిపేట కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారు జామున స్థానిక ప్రజ్ఞాపూర్ నగరపంచాయతీ పరిధిలోని సంగాపూర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎలాంటి పరిచయం లేని వ్యక్తులకు తమ ఇండ్లను అద్దెకు ఇవ్వకూడదన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్డన్ సెర్చ్‌లో సరైన ధృవపత్రాలు లేని 24 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు కమలాకర్, ప్రసాద్, శ్రీశైలం, వీరన్నతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి | శనివారం | జనవరి | 6 | 2018 సాక్షి

వాతావరణం

రానున్న 24 గంటల్లో పంజాబ్ నుంచి పశ్చిమబెంగాల్ మధ్య ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. కేరళలో చెదురుమదురు వాన పడే అవకాశం ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో చల్లని ఈదురు గాలు వీసే అవకాశం ఉంది.

సంగారెడ్డి వాతావరణం

గరిష్టం కనిష్టం

29.0°/15.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.1	07.2
కోల్‌కతా	22.3	11.1
బెంగళూరు	27.2	15.5
ముంబై	29.6	16.8
చెన్నై	29.5	20.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
ఒంగోలు	31.3/20.1	తిరుపతి	29.9/14.2
కర్నూలు	31.2/18.1	విజయవాడ	29.7/17.0
మహబూబ్‌నగర్	31.2/16.6	ఏలూరు	29.6/19.0
కడప	31.1/15.5	రాజమండ్రి	29.6/19.0
ఖమ్మం	31.0/10.4	తాడేపల్లిగూడెం	29.6/19.0
ఆదిలాబాద్	31.0/06.0	నల్లగొండ	29.6/15.2
అనంతపురం	30.7/16.2	కరీంనగర్	29.6/10.7
నెల్లూరు	30.6/20.8	హైదరాబాద్	29.4/13.3
నిజామాబాద్	30.5/15.5	రంగారెడ్డి	29.4/13.3
మెదక్	30.5/11.0	కాకినాడ	29.0/18.4
వరంగల్	30.2/14.0	విశాఖపట్నం	28.2/19.2
గుంటూరు	30.0/16.2	శ్రీకాకుళం	27.7/15.5
చిత్తూరు	29.9/14.2	విజయనగరం	27.7/15.5

బుల్లితెర


W

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.00 న్యూస్ ఫీచర్
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 న్యూస్ ఫీచర్
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.12.00 మూవీ మ్యాటర్స్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.08.00 సాక్షి న్యూస్
రా.08.30 బతుకు చిత్రం
రా.09.00 న్యూస్ 360
రా.09.30 జ్యాక్ బాక్స్
రా.10.30 మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం



మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2




హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మథుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఘీ
రా.11.44 ఖేల్ పవర్ కా

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు



కొమురవెల్లి ఆలయ సమాచారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధరణంగా ఉంది. భక్తులు మల్లికార్జునస్వామిని ఆలయ ముఖ మండపం నుంచి అర్ధ మండపం ద్వారా దర్శించుకున్నారు.

నిత్య పూజలు:
ఆలయంలో తెల్లవారుజామున 4 నుంచి 4:30 వరకు స్వామి వారి మేలుకొలుపు (ఒగ్గ ప్రార్థన). 4:30 నుంచి 5 వరకు సుప్రభాతం. ఉ.5 నుంచి 6 వరకు స్వామివారికి తీర్థపు బిందె తెచ్చుట (రుద్రాభిషేకం). మ.12కు మహానివేదన (ద్వార బంధనం). ఉ.6 నుంచి రాత్రి 7 వరకు దైవ దర్శనం. రాత్రి 7:30 నిత్యాభిషేకం. రాత్రి 8:30 నిమిషాలకు ద్వార బంధనం.

ఆర్జిత సేవలు:
ఉ.6 నుంచి ఉ.10 వరకు అభిషేకాలు, ఉ.9 నుంచి సా.6 వరకు వాహనాల పూజలు, ఉ.10:30 నుంచి స్వామి వారి నిత్య కల్యాణం, రాత్రి 8 గంటలకు ఒగ్గు ప్రార్థన (పవళింపు సేవ).

ఆలయంలో శనివారం గదుల సమాచారం:
రూ.300 గదులు 75 ఖాళీగా ఉన్నాయి,
రూ.600 గదులు 32ఖాళీగా ఉన్నాయి.
ఆలయ ఈఓ రామకృష్ణారావు ఫోన్: 9491000652.
గదుల విచారణ ఇన్‌చార్జి అధికారి
ఎం.పోచయ్య ఫోన్: 9553783488.





Padi-Panta

సాగుకు 'సేంద్రియ' ఊతం

- రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- సేంద్రియంతో ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తులు
- గజ్వేల్ వ్యవసాయాధికారి ప్రవీణ్ సలహాలు, సూచనలు



కంపోస్టు ఎరువుల తయారీ

గజ్వేల్: రసాయనిక ఎరువులు విచక్షణా రహితంగా వాడటం వల్ల భూముల్లో సారం తగ్గిపోయి పంటల దిగుబడి కూడా పడిపోతున్నది. రసాయనిక ఎరువుల వాడకం కారణంగా వాతావరణ కాలుష్యం తలెత్తి రసాయనిక ప్రమేయమున్న పంటల ఉత్పత్తి జరుగుతున్నది. ఈ దుస్థితికి అడ్డుకట్ట వేయడానికి రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ అంశంపై గజ్వేల్ వ్యవసాయాధికారి ప్రవీణ్ (సెల్ ఫోన్: 7288894470) అందించిన సలహాలు, సూచనలు ఇవి...



వ్యవసాయాధికారి ప్రవీణ్, గజ్వేల్

1. పంటకు కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సేంద్రియ ఎరువుల ద్వారా అందించవచ్చు.
2. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నపుడు సేంద్రియ ఎరువులు... భూమి పొరల్లో ఉండే నీటిని మొక్కలకు అందేవిధంగా చేస్తాయి.
3. సేంద్రియ ఎరువులు భౌతిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తిని పెంపొందించడానికి దోహదపడతాయి. ఫలితంగా మొక్కలు పరిస్థితులకు తట్టుకొని పెరగడానికి వీలవుతుంది.
4. వివిధ రకాల ఎరువుల వల్ల కలిగే సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పరిష్కరించుకోవచ్చు.
5. నేలల్లో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ సూక్ష్మజీవుల వృద్ధికి సేంద్రియ ఎరువులు ఆహారంగా ఉపయోగపడతాయి.

సేంద్రియ ఎరువుల లభ్యత...


1. పశువుల పెంటను, పేడను కంపోస్ట్ అనే పద్ధతి ద్వారా నిల్వ చేయడం ద్వారా పోషక పదార్థాలు నష్టం కాకుండా కాపాడుకోవచ్చు.
2. కోళ్ల ఎరువును, బాతుల ఎరువును, పందుల పేడను, గొర్రెల పెంటను పోగుచేసి కుళ్లిపోయేలా చేసి ఉపయోగించవచ్చు.
3. గృహ సంబంధమైన వ్యర్థ పదార్థాలలో, కొయ్య బొమ్మల తయారీలో లభించే వ్యర్థ పదార్థాలు, తినడానికి ఉపయోగించిన ఆకులు, ఆయిల్‌కేక్ మొదలగునవి.

సేంద్రియ ఎరువుల రకాలు

కంపోస్ట్ ఎరువులు: సాధారణంగా గ్రామాల్లో వివిధ పంటల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలతో కంపోస్ట్‌ను తయారు చేస్తారు. కలుపు మొక్కలు, తాలు, చెరుకు ఆకులు, వేరుశనగ పొట్టు, పేడ మొదలైనవి కంపోస్ట్ తయారీకి ఉపయోగపడతాయి. కంపోస్ట్ తయారీకి ముందుగా ఆరు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, ఒక మీటరు లోతుగల గుంతలను తవ్వాలి. ఈ గుంతలలో పంటల అవశేషాలను 30 సెంటీమీటర్ల మందం పొరలుపొరలుగా నింపాలి. నేల మట్టం నుంచి 4.5 అడుగుల ఎత్తు వరకు నింపి ఆపై మట్టిపొరతో గుంతను పూడ్చాలి. మూడు నెలల్లో గుంతలోని ఎరువు పంటలకు ఉపయోగపడేవిధంగా మారుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు: పచ్చి రొట్ట ఎరువులు సస్యజాతికి చెందిన జనుము, పిల్లిపిసర, జీలుగ వంటి పంటలను పొలంలో వేసి పూత సమయంలో కోసి కలియదున్నడం, పచ్చి ఆకు లభించని చోట రైతులు పచ్చి రొట్టలు పెంచి కలియదున్నుతారు. పచ్చిరొట్ట ఎరువు వరుసగా ఐదు సంవత్సరాలు చౌడు భూముల్లో వాడితే చౌడు ప్రభావం తగ్గి పంటల దిగుబడి పెరుగుతుంది.

బయో ఫర్టిలైజర్స్: పప్పుజాతికి చెందిన మొక్కలలో వేరు బుడిపెలు ఉంటాయి. వీటిలో రైజోబియం అనే బ్యాక్టీరియా గాలిలోని నత్రజని తీసుకొని మొక్కలకు అందించడానికి ఉపయోగపడుతుంది.



చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	180	210

భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.



మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు



కొండాపూర్(సంగారెడ్డి):మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాలువల నుంచి తీసిన మురుగును రోడ్డుపైనే ఉంచారు. దీంతో సాయంత్రం వేళ దోమల బెడద ఎక్కువ కావడంతో పాటు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది.అధికారులు స్పందించి కాలువల నుంచి తీసిన మురుగును రోడ్ల పై నుండి తొలగించాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 8501925249

‘ఇండోర్’ ఏర్పాటు చేయరూ..

- స్టేడియం నిర్మిస్తే దశ తిరగనున్న పాత పట్టణం

సంగారెడ్డి టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న ట్లు ప్రకటించింది. దీంతో పట్టణవాసులు పాత పట్టణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరు తున్నారు. ఇండోర్ ఏర్పాటు చేస్తే పాత పట్టణం అభివృద్ధి చెందుతుందంటున్నారు.జిల్లా కేంద్రంలోని పాత పట్టణం ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఓల్డ్‌టౌన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు కొత్త బస్టాండ్ వైపే ఏర్పాటు అవుతున్నారు. దీంతో ఇటు వైపు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా సంగారెడ్డి పట్టణం పాత బస్టాండ్ పరిధిలోని పాత జైలు క్వార్టర్స్ స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉంది. దీంతో జిల్లా కేంద్రంలోని నూతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వెనుక గల స్థలంతో పాటు జిల్లా జైలు క్వార్టర్స్ స్థలం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్థానిక



ఖాళీగా ఉన్న జైలు క్వార్టర్స్ ఆవరణ

ప్రజలు పాత బస్టాండ్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే పాత పట్టణం అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఇండోర్ స్టేడియం పోతిరెడ్డిపల్లి పరిధిలోకి వెళ్లితే పాత పట్టణం అభివృద్ధి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందంటున్నారు. ప్రభుత్వ భవనాలు తదితర అభివృద్ధి కారకాలైన భవనాల నిర్మాణం పాత బస్టాండ్‌లో జరగవని దీంతో ప్రస్తుతం జరిగిన అభివృద్ధి స్థిరంగా నిలిచిపోయే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం పాత పట్టణం పరిధిలోనే ఉండటంతో క్రీడకారులు సైతం పాతబస్టాండ్ పరిధిలోనే ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే బాగుంటుందంటున్నారు. మార్కెట్ రోజు తప్ప పాత బస్టాండ్ వైభవం కనిపించడం లేదు. పాత పట్టణం పూర్వ వైభవం కోసం పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సంస్థల ఏర్పాటుతో పట్టణం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగించుకొని పట్టణాభివృద్ధికి దోహదపడాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ స్థలంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలచే వ్యవసాయం చేయించే వారు. మిగతా భూమిలో స్టాఫ్ క్వార్టర్స్ ఉండేవి. కంది గ్రామ పరిధిలోకి జైలును తరలించడంతో ఈ స్థలం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పట్టణాభివృద్ధికి దోహదపడే నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంతో అభివృద్ధి



పాత పట్టణం అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి. ఇండోర్ స్టేడియం ఏర్పాటు పాత పట్టణ పరిధిలో గల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుంది. అంబేడ్కర్ స్టేడియం దగ్గరగా ఉండటం వల్ల క్రీడాకారులు మరింత నైపుణ్యం పెంచుకునే అవకాశాలు ఉంటాయి. దీంతోపాటు పాత పట్టణం అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– బుస్స భాస్కర్, క్రీడాకారుడు

న్యూస్ బాక్స్

బస్సు సౌకర్యం కల్పించాలి

సంగారెడ్డి క్రైం :కంది మండలంలోని చిమ్నాపూర్ మదిర గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ సంగారెడ్డి డిపో మేనేజర్ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కంది బస్టాండ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉన్నందున విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామస్తులు దుర్గయ్య, భిక్షపతి, నవీన్, శశికళ, సుశీల , నర్సమ్మ, కనుకమ్మ, శమంత, సిందూరెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

కొండాపూర్(సంగారెడ్డి): మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం వివిధ పాఠశాలలకు చెందిన 6, 7వ తరగతి విద్యార్థులకు తెలుగులో చేతిరాత పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మారేపల్లి పాఠశాలకు చెందిన ప్రణతి,తొగర్‌పల్లికి చెందిన సాయిప్రియ, గంగారం విద్యార్థి వకీల్, కొండాపూర్ విద్యార్థి నేహ ఎంపికైనట్లు మండల ఇన్‌చార్జి భీంసింగ్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 8న సంగారెడ్డిలో జరిగే డివిజన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆయుత ధర్మదీక్షకు మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి):సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 7న గజ్వేల్‌లో నిర్వహించనున్న అయుత ధర్మదీక్షకు టీఎస్‌టీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని రాష్ట్ల అధ్యక్షుడు మాణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.టీఎస్‌టీఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గజ్వేల్‌కు తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని, పట్టణ ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్నం విజయ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 7 వార్డుల్లోని మహిళా సంఘాల స్లమ్ సమాఖ్య ప్రతినిధులకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2018 లక్ష్య సాధనకు ప్రజలందరు పూర్తిగా సహకరించాలన్నారు. స్లమ్ సమాఖ్య ప్రతినిధులందరూ వార్డుల్లోని సమాఖ్య మహిళలకు స్వచ్ఛ సర్వేక్షన్ గురించి వివరించి ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి మహిళలకు తెలియజేసి చైతన్యపరచాలన్నారు. చెత్తను ఎక్కడపడిత అక్కడ పడవేయకుండ మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు. ఇంటి ముందుకు వచ్చే ఆటోలకు తడిపొడి–చెత్తను వేరు చేసి సహకరించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి జోన్: పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ పాలకవర్గం పూర్తిగా విఫలమైందని టీమాస్ పట్టణ చైర్మెన్ మల్లయ్య, కన్వీనర్ మహబూబ్ ఖాన్ ఆరోపించారు. శుక్రవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, 23వ వార్డు బాలాజీ నగర్ , కల్వకుంటలో సర్వే నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన సమస్యలు క్రోడీకరించి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మినారాయణకు వినతిపత్రం అందజేశారు. పర్యటించిన వారిలో టీ మాస్ సభ్యులు మల్లేశ్వరీ, యాదవరెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

కులబ్‌గూర్‌లో..

మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామంలో టీమాస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్వీమ్ వర్కర్లు, కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచకపోయిన సీఎం తన వేతనాన్ని నెలకు నాలుగున్నర లక్షలకు పెంచుకున్నారని ఆయన ఆరోపించారు. కులబ్‌గూర్ మదిర గ్రామమైన సదాశివనగర్‌లో దళిత బస్తిలో నేటికి సీసీ రోడ్లు, అర్హులకు ఆసరా పెన్షన్లు, వీధి లైట్లు లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు శ్రీనివాస్, కృష్ణ, సత్యనందం, వెంకయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న టీ మాస్ సభ్యులు

లోకల్ వాయిస్

సదుపాయాలు కల్పించాలి



సంగారెడ్డి జోన్ :కులబ్‌గూర్ గ్రామ పరిధిలోని సదాశివనగర్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తి అయినా మౌలిక సదుపాయాలు లేవు. అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేయాలి. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సదుపాయాలు కల్పించడంలో పాలకులు దృష్టి సారించడం లేదు.

–సుధాకర్, స్థానికుడు

డిగ్రీ కళాశాల విద్యార్థుల ధర్నా, రాస్తారోకో



రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయిస్తున్న లెక్చరర్

- ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ ఆందోళన
- భవనంపై నుంచి దూకేందుకు విద్యార్థి యత్నం

నారాయణఖేడ్: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు రీయింబర్స్ మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్) చెల్లించాలని ప్రిన్సిపాల్‌ను కోరగా ఓ విద్యార్థిపై ప్రిన్సిపాల్ చేసుకున్న వైఖరికి నిరసనగా శుక్రవారం విద్యార్థులు శుక్రవారం నారాయణఖేడ్– హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఆర్‌టీఎఫ్ నిధులు ఆగస్టులో ప్రభుత్వం కళాశాలకు చెల్లించినట్టు తెలిపారు. ఈ నిధులను సంబంధిత విద్యార్థుల ఖాతాల్లో జమ చేయాలని పలుమార్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డిని అడగ్గా రేపు, మాపు అంటూ దాటవేస్తున్నాడని ఆరోపించారు. నాలుగు నెలల కిందట కళాశాలకు వచ్చిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దృష్టికి సైతం ఈ నిధులు చెల్లింపుపై తీసుకెళ్లినా ప్రిన్సిపాల్ చెల్లించడం లేదన్నారు. గాంధీ అనే విద్యార్థితో పాటు ఇతర విద్యార్థులు కలిసి ప్రిన్సిపాల్‌ను అడడ్గి విద్యార్థిపై చేయిచేసుకుని గెంటేసినట్టు తెలిపారు. దీంతో అవమానం భరించలేక గాంధీ అనే విద్యార్థి కళాశాలపై దూకేందుకు ప్రయత్నించగా తోటి విద్యార్థులు దింపినట్టు తెలిపారు. ఈ ధర్నాకు ఏబీవీపీ భాగ్ కన్వీనర్ దశరథ్, మండల కన్వీనర్ శ్రీశైలంలు మద్దతు తెలిపారు. విద్యార్థుల రాస్తారోకోతో రహదారిపై ట్రాఫిక్ నిల్చిపోవడంతో ఎస్‌ఐ నరేందర్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. విద్యార్థులతో ప్రిన్సిపాల్‌తో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి శైలజ

హత్నూర(సంగారెడ్డి) : రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని పన్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని బండంపేట గ్రామశివారులో రైతు బుచ్చిరెడ్డి కంది పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సేంద్రీయ సాగుపై రైతులు దృష్టి పెట్టి రసాయన ఎరువులను తగ్గించాలని సూచించారు. రసాయన ఎరువుల వల్ల భూసారం దెబ్బతిని దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. సేంద్రీయ ఎరువులతో పోషకాలు పెరిగి ఉత్పత్తులు పెరుగుతాయన్నారు. రైతులు ప్రస్తుత యాసంగిలో జనవరి 10 వరకు వరినాట్లు పూర్తి చేస్తే ఏప్రిల్ మాసం నాటికి వరిపంట చేతికి వస్తుందన్నారు. కంది పంట బీఎస్సీ ఎంఆర్ కంది రకం దిగుబడులు ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్లు దిగుబడి వస్తాయన్నారు. రసాయన ఎరువులను పూర్తిగా తగ్గించి కేంద్రీయ విధానంతో సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శిక్షణ కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్, ఏఈఓలు నర్సింలు , ప్రతాప్, భవానీ, సర్పంచ్ బుచ్చిరెడ్డి రైతులు పాల్గొన్నారు.



బండంపేటలో కంది పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

అభ్యసనాభివృద్ధి పెంచాలి

- ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి
- పాఠశాలల రాష్ట్ర పరిశీలకుడు శ్రీధరాచార్యులు

మునిపల్లి(అందోల్): విద్యార్థులలో అభ్యసానాభివృద్ధి పెంపొందించాలని పాఠశాలల రాష్ట్ర పరిశీలకుడు శ్రీధరాచార్యులు కేజీవీబీ పాఠశాల ప్రిన్సిపాల్ కవితకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి కేజీవీబీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమగ్ర మూల్యంకనం పాఠశాలలో ఏవిధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించడానికి తాటిపల్లి కేజీవీబీ పాఠశాలకు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అర్ట్స్, రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ , గుణకారం, భాగారంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వారంలో మొదటి మూడు రోజులు భాషలకు సంబంధించిన పాఠాలను విద్యార్థులకు భోధించేలా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించడానికే ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు సంఖ్య, మధ్యాహ్న భోజనం సరిగా పెడుతున్నారా లేదా.. పలు అంశాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నోడల్ అధికారి లింబోజి, సెక్టోరియల్ (ఆర్‌వీఎం) అధికారి శ్రీకాంత్‌తో పాటు కేజీవీబీ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన స్టేట్ మానిటరింగ్ టీం

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి మోడల్ స్కూల్‌ను ఎస్‌సీఆర్‌టీ(స్టేకౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రిచర్చ్‌అండ్ ట్రేనింగ్)బోర్డు మెంబర్ రవీందర్‌రెడ్డి,ఎంఈఓ నాగారం శ్రీనివాస్, సీఆర్‌పీ రాజులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్న విద్యావిధానాన్ని పరిశీలించారు. అనంతరం తరగతుల వారిగా మధ్యాహ్నభోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌ఈపీ మెథడ్ ద్వారా నిర్వహిస్తున్న బోధన అంశాలను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



నాగల్‌గిద్ద మోడల్ పాఠశాలను సందర్శించిన అధికారులు

టోల్ చెల్లించకుండా దూసుకుపోయిన కంటైనర్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ముత్తంగి రింగ్ రోడ్డు వద్ద శుక్రవారం చత్తీస్‌ఘర్‌కి చెందిన కంటైనర్ టోల్‌గేట్ రుసువు చెల్లించకుండా దూసుకుపోయింది. దీంతో బైక్ పై వెంబడించిన టోల్‌గేట్ సిబ్బంది పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ వద్ద బైక్‌ను కంటైనర్‌కు అడ్డుగా పెట్టారు. అయినా వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోవడంతో బైక్ నుజ్జునుజ్జు అయింది.దీంతో టోల్ సిబ్బంది పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇవ్వాగా, వాళ్లు దగ్గరలోని సంగారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వాళ్లు కంటైనర్,డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆదుపులోకి తీసుకున్నారు.



కంటైనర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డిక్రైం: రాష్ట్ర రోడ్డురవాణ సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ టీఎంయూ రిజనల్ చైర్మన్ పీయస్ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా మోటార్ వెహికిల్ యాక్ట్‌ను సవరించి రాజ్యసభలో బిల్లు ప్రవేశ పెట్టడం దారుణం అన్నారు. కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు సవరణ కోసం మాత్రం మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో దీర్ఘకాలిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ నాయకులు నవాజ్, కృష్ణారెడ్డి, అంజయ్య, మహ్మద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నిర్దిష్ట విధానం కావాలి

ఉపాధి వేటలో ఎడారి దేశాల బాటపడుతున్న నిరుద్యోగ యువత కొందరు నకిలీ ఏజంట్ల చేతుల్లో మోసపోయి నష్టపోతుంటే.. మరికొందరు జీతాలు సరిగా రాక.. అప్పులు తీరక.. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. ఇక్కడి నుంచి వెళ్లేవారికి స్కిల్ డెవలప్‌మెంట్ లేకపోవడంతో ఎక్కువ శాతం కూలీ పనులే చేస్తున్నారని అన్నారు. గల్ఫ్ బాధితుల పక్షాన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కేంద్రంగా పోరాటాలు చేస్తున్న నర్సింహనాయుడు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- కొండవీటి సురేష్‌కుమార్, ఆర్మూర్

- శిక్షణ లేక కూలీలుగా వెళ్తున్న యువత
- సరైన ఉపాధి దొరకక అఘాయిత్యాలు
- కేరళ తరహా విధానం రూపొందించాలి
- వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు

గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్తాన్, ఇజ్రాయిల్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తెలంగాణ నుంచి యువత ఉపాధి కోసం వెళ్తున్నారు. కానీ నిరక్షరాస్యులు, శిక్షణ లేనివారు కావడంతో 90 శాతం మంది కూలీలుగానే వెళ్తున్నారు. కేరళ రాష్ట్రీయులు మాత్రం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు పూర్తి చేసుకొని గల్ఫ్ దేశాలకు వెళ్లడంతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మనవారికి సరైన శిక్షణ లేక పనులు సరిగా దొరకడం లేదు. దీంతో చేసిన అప్పులు తీరక స్వదేశానికి వచ్చిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని మృతదేహాలను స్వదేశాలకు తరలించడానికి నెలల తరబడి ఎదురు చూసే దయనీయ స్థితిని చూశాము. 2013లో వలసదారుల సంక్షేమ, హక్కుల వేదికను ఏర్పాటు చేసి కొన్ని గల్ఫ్ బాధితుల కుటుంబాలకు ప్రతి నెల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశాము. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారాన్ని అందజేసేవారు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచు తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదు. అంతే కాదు.. గత


కోటపాటి నర్సింహనాయుడు

ప్రభుత్వాలు ఇచ్చిన తరహాలో లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2 జూన్ 2014 నుంచి 2 అక్టోబర్ 2017 నాటికి 431 మంది తెలంగాణ ప్రజలు గల్ఫ్‌లో మృత్యువాత పడ్డట్లు రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ధ్రువీకరించింది. వీరిలో ఒక్క కుటుంబానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయమూ అందజేయలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కలగజేసుకొని మృతదేహాలను వెంటనే స్వగ్రామాలకు చేర్చుతున్నప్పటికీ వారి కుటుంబాలకు భరోసా కల్పించడంలో విఫలమవుతుతోంది.

కేరళ, పంజాబ్ తరహాలో..

గల్ఫ్ దేశాల్లో సంక్షోభం గురించి తెలియక ఉపాధి వేటలో ఏడారి దేశాలకు వెళ్లి కష్టాలపాలవుతున్న రాష్ట్ర నిరుద్యోగులను ఆదుకోవడానికి ఒక ప్రత్యేక విధానమంటూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల తరహాలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, గల్ఫ్ బాధితులను ఆదుకోవడం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం, ప్రతి ఏటా వంద కోట్ల రూపాయల నిధిని కేటాయించడం లాంటి చర్యలు తీసుకోవాలి. నకిలీ ఏజంట్లను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రత్యేక వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే విదేశాల్లో ఉద్యోగావకాశాలను తెలియపరచాలి. యువతకు అందుకు తగ్గ శిక్షణ ఇచ్చి ఉపాధి కోసం విదేశాలకు పంపే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గల్ఫ్ దేశాల్లో అనారోగ్యం, ఉద్యోగపరంగా సమస్యలతో నష్టపోయి తిరిగి స్వదేశానికి వచ్చిన వారికి పావలా వడ్డీతో రుణాలు అందజేసి స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించి వారి జీవితాలకు భరోసా కల్పించాలి. గల్ఫ్ దేశాలలో సంపాదించి తెలంగాణ రాష్ట్రానికి మన వాళ్లు ప్రతీ నెల పంపిస్తున్న డబ్బుపై పన్నుల రూపంలో వందల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితుల సంక్షేమం గురించి కూడా ఆలోచించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పింఛన్‌ను అందజేయాలి.

గల్ఫ్‌లో 87,64,829 మంది భారతీయులు

గల్ఫ్ దేశాల సహకారమండలిలోని (గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ –జీసీసీ) ఆరు దేశాలలో ప్రవాస భారతీయుల జనాభా 87 లక్షల 64 వేల 829కు చేరిందని లోక్ సభలో జితేంద్ర చౌదరి అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ డిసెంబరు 27న లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సౌదీ అరేబియాలో 32,53,901 మంది, యూఏఈలో 28 లక్షలు, కువైట్‌లో 9,17,970, ఒమన్‌లో 7,83,040, ఖతార్‌లో 6.97 లక్షలు, బహరేన్‌లో 3,12,918 మంది ప్రవాస భారతీయులు ఉన్నారని తెలిపారు. ఆరు గల్ఫ్ దేశాలలో 11,774 మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్టు చెప్పారు. ప్రపంచంలోని 208 దేశాలలో ఎన్నారైలు, పీఐఓలు కలిపి 3 కోట్ల 12 లక్షల 33 వేల 234 మంది భారత ప్రవాసులున్నారని ప్రకటించారు. ఇందులో కోటి 33 లక్షల 27 వేల 438 మంది ప్రవాస భారతీయులు, కోటి 79లక్షల 5వేల 796 మంది భారత సంతతి ప్రజలు ఉన్నారని వివరించారు.

ప్రవాసీ భారతీయ దివస్‌కు భారత సంతతి పార్లమెంటేరియన్లు

జనవరి 9న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రవాసీ భారతీయ దివస్‌కు ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న భారత సంతతికి చెందిన 285 మంది పార్లమెంటేరియన్లను భారత ప్రభుత్వం ఆహ్వానించింది. ఇప్పటివరకు 125 మంది పార్లమెంటేరియన్లు తమ సమ్మతిని తెలియజేశారని విదేశాంగ శాఖలోని ప్రవాసీ భారతీయ వ్యవహారాల శాఖ కార్యదర్శి జ్ఞానేశ్వర్ మూలే తెలిపారు. భారత ప్రభుత్వం దౌత్యాన్ని ప్రజాపక్షం చేసిందని, భారత సంతతితో పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడం, మాతృభూమితో వారి బంధాన్ని దృఢపరచడం తమ లక్ష్యమని అయన అన్నారు. విదేశాల్లోని భారతీయుల కోసం తక్షణం స్పందించే ఆన్‌లైన్ వ్యవస్థ 'మదద్' (కాన్సులర్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా 26 వేల ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 21 వేలు పరిష్కరించామని వివరించారు.

ఖతార్‌లో ఎన్నారైలకు దౌత్య సేవలు

ఖతార్ దేశ రాజధాని దోహాలోని ఇండియన్ ఎంబసీ (భారత దౌత్య కార్యాలయం) అధికారులు ఈనెల 12న శుక్రవారం అల్ బనూష్ క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాన్సులర్ క్యాంపు (దౌత్య సేవల శిబిరం) నిర్వహిస్తారు. ఎన్నారైలు వారి పాస్‌పోర్ట్, దౌత్య సంబంధ సేవలు గురించి, వేతనాలు తదితర సమస్యల గురించి అధికారులకు దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్ **+97455808254** ఇ–మెయిల్: labour.doha@mea.gov.inకు సంప్రదించవచ్చు.

సౌదీలో 'ప్రవాసీ ప్రజావాణి'

సౌదీ అరేబియాలోని జిద్దా ఇండియన్ కాన్సులేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న శుక్రవారం 'కాన్సులేట్ ఎట్ యువర్ డోర్' (మీ ముంగిట్లోకి దౌత్య కార్యాలయం) కార్యక్రమాన్ని భారత దౌత్య అధికారులు నిర్వహిస్తున్నారు. అభాలోని ఖమీస్ ముషాయిత్‌లో 054 6722909, మక్కాలోని ఇండియన్ హజ్ మిషన్‌లో 012 5603580, నజరాన్‌లో 017 5221949 నంబర్లలో సంప్రదించవచ్చు.

సేకరణ: మంద భీంరెడ్డి, అధ్యక్షులు, ప్రవాసీ మిత్ర

వైద్యం అందని దైన్యం

- దుబాయ్‌లో గాయపడిన సిరిసిల్లవాసి
- అచేతనంగా స్వగ్రామానికి
- ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

పాలమాకుల శేఖర్, సిరిసిల్లటౌన్:

నా పేరు చిలుముల చంద్రశేఖర్. మాది సిరిసిల్ల పట్టణం బీవైనగర్. స్వర్ణకారుడిగా పనిచేస్తూ నా భార్య అరుణ, కొడుకులు సాయికుమార్, తేజలను పోషించుకునే వాడిని. పదేళ్ల క్రితం కులవృత్తికి పనులు తక్కువయ్యాయి. పిల్లల భవిష్యత్తు కోసం దుబాయ్ పోయి సంపాదించాలనుకున్న. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన ఓ ఏజెంటు రూ.1.30లక్షలను తీసుకుని దుబాయ్‌కి పంపిండు. అక్కడ ఆంధ్రాకు చెందిన అన్‌లైసెన్స్‌డ్ ఏజెంటు నన్ను మూడు నెలలు ఏ పనీ లేకుండా తిప్పిండు. చేతిల డబ్బుల్లేకుండా అక్కడ చాలా రోజులు పస్తులుంటూ.. తెలుగు వారి వద్ద తలదాచు కునేటోన్ని. ఆ తర్వాత ఏమైందో గానీ అతని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎక్కడికో పారిపోయిండు. అక్కడ మనవాళ్లు నా పరిస్థితి తెలుసుకుని ఎక్కడైనా పని ఉంటే చెప్పేటోళ్లు. లేకుంటే రూములోనే ఉండేటోన్ని. కొద్ది రోజులకు మన తెలుగోళ్ల సాయంతో ఓ కంపెనీలో చేరాను. మూడున్నర సంవత్సరాలు కార్పెంటర్ పనిచేసిన. యజమానులు జీతం సరిగా ఇవ్వక పోయేటోళ్లు. కంపెనీలో చేరేటప్పుడు నెలకు రూ.1200 దర్‌హమ్‌లు ఇస్తానన్నరు. కానీ నాలుగు నెల్లకోసారి కూడా జీతం ఇచ్చేటోళ్లు కాదు. తర్వాత ఖల్లవెళ్లి వీసాతో కార్పెంటర్ పనులే చేసేటోన్ని. నన్ను అక్కడ పనిలో పెట్టిన సబ్‌కాంట్రాక్టర్ నాకు డబ్బులు సరిగా ఇచ్చేటోడు కాదు. కచ్చితంగా జీతం

> ఉన్న ఊర్లో పనుల్లేక పొట్ట చేతబట్టుకుని పోయిన బడుగు జీవి అక్కడ పనికోసం ఎన్నో అవస్థలు పడ్డాడు. ఏదో ఒక పనిలో కుదిరిన ఆయనను విధి వెంటాడింది. నిచ్చెన జారి కిందపడిపోయాడు. ఆ ప్రమాదంలో కాలు విరిగితే పనిలో పెట్టుకున్న కంపెనీ కనీసం వైద్యం కూడా చేయించలేదు. దూర దేశంలో పడిన కష్టాలు ఆయన మాటల్లోనే..

ఇవ్వాలని నిలదీస్తే.. జైలుకు పంపుతానని బెదిరించిండు. ఇట్లా నేను అక్కడ ఏజెంట్ల వద్ద రూ.23వేల దర్‌హమ్స్ మునిగాను. డిసెంబర్ 5న ఓ భవనంలో సీలింగ్ పనులు చేస్తూ నిచ్చెన జారీ కిందపడి పోయాను. సబ్‌కాంట్రాక్టర్ ఆసుపత్రికి తీసుకుపోయిండు. కేవలం మందులు మాత్రమే ఇప్పించిండు. కాలి ఎముక మూడుముక్కలైందని అక్కడి డాక్టర్లు చెప్పగా.. రూ.10 వేల దర్‌హమ్స్ ఖర్చయితాయన్నరు. చేసేది లేక నా పరిస్థితిని ఇంటివాళ్లకు చెప్పుకున్నా. పొత్తూరుకు చెందిన రవీందర్‌రెడ్డికి మావాళ్లు చెబితే.. ఆయన గల్ఫ్ కార్మిక నాయకుడు అడవి పదిరకు చెందిన మహేందర్‌రెడ్డి, షార్జాలో ఉన్న ముస్తాబాద్‌కు చెందిన జనగామ శ్రీనివాస్, ఢిల్లీకి చెందిన గిరీష్‌పంత్‌కు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో ఎంబసీకి పోయి నా పరిస్థితిని వివరించగా.. ఎంబసీ వారు మానవతా దృక్పథంతో ఉచిత విమాన ప్రయాణ టికెట్ ఇచ్చి పంపారు. కాలికి ఆపరేషన్ చేయించుకోవాలంటే చేతిలో చిల్లిగవ్వలేదు. మంచం పట్టిన నాకు భార్య, పిల్లలు సేవలు చేస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్లా నడిచి వారిని సాదుకోవాలి. కరీంనగర్ ఆసుపత్రికి పోతే ఆరోగ్యశ్రీ ఈ ఆపరేషన్‌కు వర్తించదన్నారు. రూ.80వేలు ఖర్చవుతుందట. ప్రభుత్వం ఆదుకోవాలి.


దుబాయ్‌లో చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న జనగామ శ్రీనివాస్, గిరీష్‌పంత్

ఆగమైపోయే..!

అదో చిన్న పల్లెటూరు. వంద కుటుంబాలు.. ఐదొందల జనాభా. దాదాపుగా అన్నీ రైతు కుటుంబాలే. ఒక్కసారిగా ఆ ఊరు కుదుపునకు గురైంది. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు సొరంగ మార్గం పంటపొలాలను ఛిద్రం చేస్తే.. ఇటీవల మంజూరైన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌తో భూములతో పాటు నివాస గృహాలను ఊడ్చేస్తుంది. ఊరి నడిబొడ్డు నుంచి రైల్వేలైన్ వెళ్తుండడంతో ఆ పల్లె ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. దౌల్తాబాద్ మండలం అప్పాయపల్లి గ్రామ స్థితిపై ప్రత్యేక కథనం..

- నాడు 'ప్రాణహిత–చేవెళ్ల', నేడు 'కొత్తపల్లి–మనోహరాబాద్'
- అప్పాయపల్లిని కబళిస్తున్న అభివృద్ధి పనులు
- ఇళ్లతో పాటు పొలాలు కోల్పోతున్న రైతులు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలంలోని అప్పాయపల్లి గ్రామం బేగంపేట పంచాయతీ పరిధిలోనిది. ఇక్కడ సుమారు వంద కుటుంబాలు నివాసముంటున్నాయి. 564 మంది జనాభా ఉంది. అప్పాయపల్లి రెవెన్యూ గ్రామంలో ఉన్న 300 ఎకరాలతో పాటు బేగంపేట రెవెన్యూ శివారులోని పొలాలను ఇక్కడి రైతులు సాగుచేస్తుంటారు. పూర్తిగా వ్యవసాయ కుటుంబాలుండే అప్పాయపల్లిలో వర్షాధార పంటలకు తోడు బోరుబావుల కింద కూరగాయ పంటలు, వరి తదితర పంటలు సాగుచేస్తుంటారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు పయనిస్తున్న గ్రామం ఒక్కసారిగా కుదుపునకు గురైంది.

ప్రాజెక్టు సొరంగంతో..

గత ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనులు చేపట్టింది. గజ్వేల్ మండలం గిరిపల్లి నుంచి ప్రాజెక్టు సొరంగం ద్వారా కాలువ పనులు చేపట్టారు. ఆ సొరంగం అప్పాయపల్లి శివారులో పైకి తీశారు. అప్పాయపల్లిలోని సొరంగం నుంచి తీసిన మట్టి డంప్ చేయడంతో పాటు కాలువ కోసం 50 ఎకరాల వరకు భూమి సేకరించారు. దీంతో పంటలు వేసుకునే పొలాలు సొరంగంగా మారిపోయాయి.

కూల్చివేయనున్న 44 నివాసాలు..

సాగునీటి ప్రాజెక్టుతో గ్రామంలోని రైతులు వ్యవసాయ భూములు కోల్పోతే.. మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ ఊరినే కబళిస్తోంది. గ్రామం నడిబొడ్డు నుంచి రైల్వేలైన్ వెళ్తుండడంతో 44 ఇళ్లు కూల్చేయనున్నారు. వీటితో పాటు అప్పాయపల్లి రైతులకు చెందిన 100 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు రైల్వేలైన్‌లో సదరు శాఖ సేకరించింది. ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అప్పాయపల్లితో పాటు బేగంపేట శివారులోని వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం.. రైల్వేలైన్ నిర్మాణం ప్రారంభించింది. అప్పాయపల్లి, బేగంపేట శివార్లలో సుమారు 5 కి.మీ.ల మేరకు రైల్వేలైన్ వెళ్లనుంది. దీంతో పాటు ఇటీవల ఉరుము లేని పిడుగులా మరో వార్త ఇక్కడి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అప్పాయపల్లి గ్రామం ఉన్న చోట రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే చేశారని గ్రామస్తులు వెల్లడించారు. అదే జరిగితే ఊరంతా ఖాళీ చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

చాలీచాలని పరిహారం

ప్రాణహిత–చేవెళ్ల సొరంగం, రైల్వే లైన్‌లో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నామమాత్రపు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంది. సాగునీటి ప్రాజెక్టు భూసేకరణకు పట్టాభూమికి రూ.4 లక్షల చొప్పున, అసైన్డ్ భూమి రూ.3 లక్షల చొప్పున మాత్రమే పరిహారం చెల్లించారు. అలాగే రైల్వేలైన్‌లో భూబాధితులకు పట్టా భూమికి రూ.4.5 లక్షల చొప్పున చెల్లించారు. ఇక ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్అండ్‌బీ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం గరిష్టంగా రూ.6 లక్షల వరకు మాత్రమే పరిహారం చెల్లించారు. ఊరికి రెండువైపుల నుంచి రైల్వేలైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక ఇళ్లు కూల్చడమే తరువాయి. ఫలితంగా పలువురి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వ్యవసాయ భూమితో పాటు ఇళ్లు కూడా కోల్పోవాల్సి వస్తోంది.


అప్పాయపల్లిలో తీసిన సొరంగం


నిర్మాణంలో రైల్వే మార్గం


రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

ఉన్నదాంట్లో సాగుచేసుకుంటున్నం



మాకు నాలుగెకరాల భూమి ఉండేది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కాల్వ కోసమని ఎకరన్నర భూమిని ఐదేళ్ల కిందట అధికారులు స్వాధీనం చేసుకున్నరు. రెండేళ్ల కింద రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. ఉన్న భూమిలోనే సాగుచేసుకోవాల్సి వస్తుంది. ఇక్కడి నుంచి మరో కాల్వ వస్తుంది. ఉన్న భూమి కూడా పోతదంటున్నరు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. అప్పటికే భూమి పోయిందన్న బెంగతో నా భర్త చనిపోయిండు.

– సంటోల్ల లక్ష్మి, రైతు, అప్పాయపల్లి.

ఇళ్లు, పొలం పోయింది

మేము ముగ్గురం అన్నదమ్ములం. ఏడెకరాల భూమిని సాగుచేసుకుని బతుకు సాగించినం. చిన్నప్పటి నుంచి పూరిగుడిసెల్లో నివాసముండేటోళ్లం. ఐదారేళ్ల కిందటే ఎంతో కష్టపడి ఇళ్లు నిర్మించుకున్నం. ఇప్పుడు రైల్వేలైన్ వచ్చింది. మా కుటుంబాలను ఆగం చేసింది. మా వ్యవసాయ భూమి నుంచి 600 మీటర్ల పొడవుతో రైల్వేలైన్ వెళ్తుంది. మా భూమి ముక్కలైంది. లైన్‌కు రెండువైపులా ముక్కలుగా మిగిలిపోయిం ది. మా ముగ్గురి ఇళ్లు కోల్పోతున్నాం. ఊరిలో రైతులుగా ఉన్న మా కుటుంబం ఇప్పుడు కూలీలుగా మారిపోయిం ది. నామమాత్రంగా ఇచ్చిన పరిహారం ఎందుకు పనికిరాకుండా పోయింది.

– రామన్నగారి ఎల్లయ్య, రైతు, అప్పాయపల్లి.

ప్రభుత్వం ఆదుకోవాలి



మా పంచాయతీ పరిధిలోని అప్పాయపల్లి అప్పుడు అవస్థలో పడిపోయింది. రైల్వేలైన్‌తో పాటు సాగునీటి ప్రాజెక్టులో గ్రామంలోని సగానికి పైగా భూములు రైతులు కోల్పోయారు. అలాగే సగం వరకు ఊరు ఖాళీ అయిపోతుంది. భూసేకరణకు ప్రభుత్వం పరిహారం చాలా తక్కువ మొత్తంలో ఇచ్చింది. మరింత పరిహారం ఇచ్చిన ఆదుకోవాలి. ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే రామలింగారెడ్డి హామీ ఇచ్చి.. మంజూరు చేయించారు.

– లచ్చయ్య, సర్పంచ్, బేగంపేట.

విజయానికి తొమ్మిది సూత్రాలు

- భయం వీడితే పరీక్షల్లో మంచి ఫలితాలు
- ప్రణాళికాబద్ధంగా చదవడమే అత్యంత ముఖ్యం
- సమయం, ఆహారపు అలవాట్లు కూడా కీలకమే
- పది, ఇంటర్ విద్యార్థులకు నిపుణుల సూచనలు

టేక్మాల్ (మెదక్): ఓటమి బాధపెడితే.. విజయం ఉత్సాహం ఇస్తుంది. లోటుపాట్లను సరిదిద్దుకుంటే విజేతలుగా నిలవడం కష్టమేమీ కాదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఈనేపథ్యంలో చాలామంది విద్యార్థుల్లో ఏదో తెలియదని భయం ఉంటోందని.. ప్రణాళికాబద్ధంగా చదివితే ఆ భయం పోతోందంటున్నారు మానసిక నిపుణులు. మార్కుల కోసం విద్యాసంస్థలు, తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదని వారు సూచిస్తున్నారు. పరీక్షా సమయంలో డాక్టర్ ఇర్షద్ అందిస్తున్న తొమ్మిది సూత్రాలు..

ఆలోచన ధోరణి

పరీక్షలంటే అనవసరపు భయాలకు గురికాకుండా 'నేను విజయం సాధించగలను. మంచిమార్కులు తెచ్చుకుంటాను.' అనే నమ్మకంతో చదవాలి. ఏదైనా సాదించగలననే పట్టుదల విద్యార్థుల్లో ఉండాలి. పరీక్షలు బాగా రాయగలవని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. కానీ, మార్కులు రావడం లేదని, చదవడం లేదని పిల్లలను వేధించకూడదు.

ప్రణాళిక

ఏ సబ్జెక్ట్ ఎప్పుడు చదవాలి, ఎంత సమయం కేటాయించాలి, ఏ టాపిక్‌పై దృష్టిపెట్టాలి, వారంలో ఏం చదవాలి అనే ప్లానింగ్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే సబ్జెక్టుపై పట్టు పెరుగుతుంది. దీంతో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరగడంతో పాటు చదివింది అర్థమవుతుంది. ప్లాన్ లేకుండా చదివితే ఒత్తిడికి గురికావాల్సిందే.

సమయపాలన:

రోజుకు 24 గంటల 86 వేల 400 సెకండ్ల సమయం ఉంటుంది. చదవడానికి సమయం లేదనుకోవడం పొరపాటు. నిద్ర, చదువుకోవడం, సేద తీరడం, స్నేహితులతో సరదాగా గడపడం.. అనేది టైం ప్రకారం ఉండాలి. సమయం పాటించే విద్యార్థిపై ఒత్తిడి ఉండదు. మనసు ఉల్లాసంగా ఉండి సులువుగా చదువుకునే అలవాటు ఏర్పడుతుంది.

స్టడీ స్కిల్స్:

పరీక్షల్లో విజయం సాధించేందుకు స్టడీ స్కిల్స్ ముఖ్యం. చదువుకోవడానికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి. పుస్తకాలన్నీ చిందరవందరగా పెట్టుకోకూడదు. గంటసేపు చదివితే 15 నిమిషాల పాటు రెస్ట్ తీసుకోవాలి. అంతేకాదు గ్రూప్ స్టడీ వల్ల అనేక విషయాలు తెలుసుకోవచ్చు.


తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు


చదువుకుంటున్న విద్యార్థులు

పునశ్చరణ:

రోజు తరగతి గదిలో చెప్పిందేమిటో ఇంటికి వచ్చి చూసుకోవాలి. వారానికోసారి రివిజన్ చేసుకోవాలి. అర్ధరాత్రి దాటే వరకు చదవడం కంటే తెల్లవారుజామున 4 గంటల నుంచి 9 గంటల వరకు చదివితే మంచిది. ఆ సమయంలో మనస్సు ప్రశాంతంగా ఉండి.. చదివిన విషయాలు గుర్తుండిపోతాయి.

మంచి నిద్ర:

విద్యార్థులకు పరీక్షల సమయంలో నిద్ర చాలా అవసరం. రోజుకు 6 గంటలు తగ్గకుండా నిద్రపోవాలి. మంచి నిద్రతో జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నిద్ర రాకుంటే టీ, కాఫీ తాగడం మంచి పద్ధతి కాదు. అలా అని రాత్రి 11 గంటల తర్వాత చదవడం కూడా మంచిది కాదు. ఇలా చేస్తే ఆరోగ్య సమస్యలతో పాటు చదివింది గుర్తుండదు.

పౌష్టికాహారం తప్పనిసరి



విద్యార్థులు సమయపాలనతో పాటు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి. పౌష్టికాహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూడాలి. అధిక నిద్ర మంచిది కాదు. టైం టేబుల్ ప్రకారం పనులు చేసుకోవాలి. పరీక్షలంటే ఆందోళన ఉండకూడదు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రోత్సహించాలి.

– డాక్టర్ ఇర్షద్, టేక్మాల్

నిపుణులతో చర్చలు:

స్నేహితులతో కొన్ని విషయాలు, అర్థం కాని పాఠ్యాంశాలు చర్చించుకోవాలి. అలా చేయడం ద్వారా ఇతరుల నుంచి విషయాలు తెలుసుకోవడంతో పాటు వారికి వివరించవచ్చు. సందేహాలు నివృతి అవుతాయి. పాత మోడల్ పేపర్లు చదవడం ఉత్తమం.

ప్రశాంతత:

విద్యార్థులు రిలాక్స్ కోసం వ్యాయామం, మెడిటేషన్, యోగా చేస్తే మంచిది. ఇంట్లో వారితో, స్నేహితులతో సంతోషంగా మాట్లాడుతూ.. టీవీ చూడడం, పేపర్లు చదవడం కోసం కొద్దిపాటి సమయాన్ని కేటాయించాలి. వీటితో మానసిక ప్రశాంతత పెరుగుతుంది. ఫేస్‌బుక్, ఇంటర్నెట్‌కు కొద్ది రోజులు స్వస్తి పలకడం అన్నింటికంటే ఉత్తమం.

మంచి ఆహారం:

పిల్లలకు అందించే ఆహారం విషయంలో తల్లిదండ్రులు జాగ్రతలు పాటించారు. పరీక్షల సమయంలో ఇది చాలా ముఖ్యం. పిల్లలను ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి. పిజాలు, బర్గలు తినిపించకూడదు. వీటి వల్ల అనారోగ్యంతో పాటు పరీక్ష సమయంలో నీరసించిపోతారు. తేలికగా జీర్ణమయ్యే ఆహారం ఎక్కువగా అందించాలి. పండ్లు, పాలు తీసుకోవడం ఉత్తమం.

చీపురే ఆధారం

- కొయ్యల కోసం అడవుల్లో సంచారం
- 'ఉపాధి' పనులు లేక గ్రామస్తుల అవస్థలు
- డివిజన్‌లో 500 కుటుంబాలకు ఇదే జీవనాధారం

కల్హేర్ (నారాయణఖేడ్): చీపుర్ల తయారీనే వారికి జీవనాధారం. తెల్లవారింది మొదలు అడవులు, గుట్టల్లోకి కాలినడక వెళ్తూ చీపురు కొయ్యలు కోసుకొచ్చి.. చీపుర్లు తయారుచేస్తుంటారు. నారాయణఖేడ్ డివిజన్‌లోని కల్హేర్, సిర్గాపూర్, నారాయణఖేడ్, మనూరు, కంగ్టి మండలాల్లో పనులు దొరకక చాలామంది వీటినే ఆధారంగా చేసుకున్నారు. సంజీవన్‌రావుపేట, హన్మంత్‌రావుపేట, కల్హేర్, బాచేపల్లి, మాసాన్‌పల్లి, నాగధర్, సిర్గాపూర్, కడ్పల్ తదితర గ్రామాల్లో కూలీలు చీపురు కట్టలు తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో చాలామంది నాగధర్, కృష్ణపూర్, కడ్పల్ తదితర అటవీప్రాంతాలకు వెళ్లి చీపురు కొయ్యాలు తీసుకొస్తుంటారు. ఇలా దాదాపు 500 మంది కూలీలు ఈ పనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, శ్రమకు తగ్గ డబ్బులు రావడం లేదని.. ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాచేపల్లిలో 25 కుటుంబాలు

మండలంలోని బాచేపల్లిలో దాదాపు 25 కుటుంబాలు చీపురు కట్టలు తయారు చేసే వృత్తిని కొనసాగిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో ఎక్కడ చూసినా మహిళలు ఇళ్ల ముందు చీపురు కట్టలు తయారు చేస్తుంటారు. ముందుగా కొయ్యాలు తీసుకొచ్చి ఇళ్ల ముందు ఎండబెడుతుంటారు. ఆపై తయారుచేసి.. నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో జరిగే వారంతపు సంతలో విక్రయిస్తుంటారు. సంతలు లేని రోజు ఉరురా తిరుగుతూ అమ్ముకుంటారు. రూ.10కి ఒక కట్ట విక్రయిస్తుండటంతో శ్రమకు తగ్గ ఫలితం లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు. కొయ్యాలు తెచ్చేందుకు అడవులకు వెళ్తుండటంతో పందులు తమపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు భయం కూడా ఉంటుందని.. అయినా తప్పని పరిస్థితుల్లో అడవులకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు.


బాచేపల్లిలో చీపురు కట్టలు తయారు చేస్తున్న కూలీలు


చీపురు కట్టలు


ఇళ్ల ముందు ఎండబెట్టిన కొయ్యలు

అడవి పందులతో భయం



చీపురు కొయ్యల కోసం అడవులకు వెళ్తే ఒక్కోసారి పందులు తరుముతుంటాయి. వాటికి చిక్కితే ఇక అంతే. భయంగా ఉన్నా ఉన్న ఊళ్లో పనులు లేక ఈ వ్యాపారం చేయాల్సి వస్తోంది. అమ్మకాలతో కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. సర్కార్ నుంచి మాకు సాయం అందితే బాగుంటుంది. – పోచయ్య, బాచేపల్లి

గట్టుకు పోతాం



చీపురు కట్టలు చేసేందుకు కొయ్యలు దగ్గర దొరకవు. చాలా దూరం గట్టు మీద తిరుగుతాం. చీపురు కొయ్యలు చేతికి గుచ్చుకుంటాయి. పనులు ఉంటే అడవిలో ఎందుకు తిరుగుతాం. ఉపాధి హామీ పనులు బంద్ ఉన్నాయి. మాలాంటోళ్లను సర్కారోళ్లు పట్టించుకుంటలేరు. – సాయమ్మ, బాచేపల్లి


ఊరూరా తిరుగుతాం



ఊరూరా తిరిగి చీపురు కట్టలు అమ్ముతుంటాం. రూ.10కి ఒక కట్ట అమ్మడం వల్ల లాభం ఉండటం లేదు. సరైన సంపాదన లేక కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ప్రతి మంగళవారం నారాయణఖేడ్ సంతలో చీపుర్లు అమ్మేందుకు పోతాం. ఉపాధి హామీ పనులు కలిపిస్తే బాగుంటది. – లక్ష్మి, బాచేపల్లి


చీపురు కొయ్యలు తెస్తున్న కూలీ

పత్తి పంట పరిశీలన



ముప్పారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అల్లాదుర్గం(మెదక్): 'కొంప ముంచిన నకిలీ విత్తనాలు' అనే శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో వ్యవసాయాధికారులు స్పందించారు. ముప్పారం గ్రామంలో రైతులు నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన విషయం 'సాక్షి' ద్వారా వెలుగులోకి రావడంతో అల్లాదుర్గం వ్యవసాయాధికారి నాగమణి ముప్పారంలో పంటలు పరిశీలించారు. విత్తనాలు, మందులు ఎక్కడ కొనుగోలు చేశారో రైతులను అడిగి తెలుసుకున్నారు. పత్తి కాయలు కాసినా పూత రాలేదని ఏఓ నాగమణి తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు. నకిలీ విత్తనాలుగా తేలితే సంబంధిత వ్యాపారులపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

వ్యవసాయ క్షేత్రం పరిశీలన



చేనును పరిశీలిస్తున్న శ్రీలత

రామాయంపేట(మెదక్): 'కొంప ముంచిన విత్తనాలు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వచ్చిన వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈమేరకు నిజాంపేట మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత శుక్రవారం చల్మెడ గ్రామంలో బాధిత రైతు బురాని నారాగౌడ్‌కు చెందిన మొలకెత్తని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని విస్తరణ అధికారి శ్రీలత స్పష్టం చేశారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం శివ్వంపేట మండలంలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదన్నారు. వేతనం నుంచి కాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులు స్వామి, నర్సింలు, రాజు తదితరులున్నారు.

ప్రజల గుండెల్లో 'మహానేత' పథకాలు

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటి తరలింపు అన్యాయం
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సంజీవరావు



పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పుతున్న శ్రీధర్‌రెడ్డి, సంజీవరావు

జోగిపేట(అందోల్): ప్రజల గుండెల్లో మహానేత వైఎస్ఆర్ ప్రారంభించిన పథకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని సంగారెడ్డి, మెదక్ జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గౌరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బి.సంజీవరావు అన్నారు. శుక్రవారం 60 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం తాము కూడా పోరాడామని, తమ పార్టీని ఎవరు విమర్శించినా సహించబోమన్నారు. కార్యకర్తల కోసం అర్ధరాత్రి కూడా అందుబాటులో ఉంటామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆయన కుటుంబం మాత్రమే లాభపడుతోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో అందోలు నియోజకవర్గంలో స్థానిక నినాదంతో సీటు దక్కించుకునే అవకాశాలున్నాయని చెప్పారు. మాసాయిపేట ఘటనలో అందరికన్నా ముందు బాధితులను పరామర్శించింది తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు.

స్థానికేతరుల వల్లే వెనుకంజ

అందోలు నియోజకవర్గంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నందునే అభివృద్ధిలో వెనుకంజలో ఉందని సంజీవరావు అన్నారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి డిపో ఏర్పాటు చేయాల్సి ఉన్నా విస్మరించారన్నారు. ఎలాంటి జీఓ లేకున్నా 15 టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్‌కు తరలించుకుపోయారని చెప్పారు. అందోలు, పుల్కల్ మండలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అనంతరం పటాన్‌చెరువు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందులున్నా నాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంరెడ్డి, పరిపూర్ణ, ప్రవీణ్‌కుమార్, సంగన్న, అందోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.శంకర్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి పవన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 60 మంది

జోగిపేట పట్టణానికి చెందిన ఎ.రాకేష్, జి.వినోద్, ఎ.దయాకర్, జి.శ్రీశైలంతో పాటు 60 మంది యువకులు నియోజకవర్గ ఇన్‌చార్జి బి.సంజీవరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గౌరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన యువకులను రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మండల శాఖ అధ్యక్షుడు శంకర్ అభినందించారు.

మూగజీవాలకు టీకాలు తప్పనిసరి

- జిల్లా పశువైద్యాధికారి అశోక్‌కుమార్
- కాద్లూర్‌లో నట్టల నివారణ మందుల పంపిణీ



పశువుకు టీకా ఇస్తున్న జిల్లా పశువైద్యాధికారి

టేక్మాల్(మెదక్): పశువులను కాపాడుకోవాలంటే తప్పనిసరిగా నట్టల నివారణ టీకాలు ఇవ్వాలని జిల్లా పశువైద్యాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టేక్మాల్ మండలంలోని కాద్లూర్ గ్రామంలో కొనసాగుతున్న శిబిరానికి ఆయన హాజరై పశువులకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నట్టల వ్యాధి వస్తే పాల దిగుబడి తగ్గడంతో పాటు పశువుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. డిసెంబర్ 29వ తేద నుంచి జనవరి 30 వరకు జిల్లాలో 33 బృందాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 2.29 లక్షల టార్గెట్ ఉండగా 46 శాతం పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో 10,142 గొర్రెల యూనిట్ల టార్గెట్ ఉండగా.. 4,803 యూనిట్లు అందించామని చెప్పారు. మిగితా గొర్రెల యూనిట్లను మార్చి చివరిలోపు అందజేస్తామన్నారు. గొర్రెల యూనిట్లలో ఇప్పటి వరకు 15 వేల పిల్లల ఉత్పత్తి జరిగినట్లు తెలిపారు. 1,904 గొర్రెలు చనిపోయినట్లు గుర్తించామని.. బాధితులకు ఇన్సురెన్సు ద్వారా మళ్లీ గొర్రెలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టేక్మాల్ పశువైద్యాధికారి బెంజిమన్, జూనియర్ పశువైద్యాధికారులు హన్మంతు, సతీష్, సిబ్బంది శ్రీనివాస్, కృష్ణ తదితరులున్నారు.

'ధర్మదీక్ష'ను అడ్డుకునేందుకు కుట్రలు



మాట్లాడుతున్న యాదవరెడ్డి, నవీన్ రత్నాకర్

రామాయంపేట(మెదక్): పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 7న గజ్వేల్‌లో నిర్వహించనున్న అయుత ధర్మ దీక్షను అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం రాష్ట్రశాఖ అసోసియేట్ అధ్యక్షుడు బోరెడ్డి యాదవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నవీన్ రత్నాకర్ సందేహం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. మొదట్లో ప్రభుత్వం సమావేశానికి అనుమతి ఇవ్వగా, గురువారం సాయంత్రం పోలీసు ఉన్నతాధికారులు ఏకపక్షంగా రద్దు చేశారని ఆరోపించారు. రాత్రికి రాత్రే గజ్వేల్ చేరుకున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా.. సభ నిర్వహణకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఈనేపథ్యంలో ధర్మదీక్షకు అడ్డంకులు కల్పిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

గొల్లకురుమల సంక్షేమానికి చర్యలు

ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న బాపు మల్‌శెట్టి

పెద్దశంకరంపేట(మెదక్): గొల్లకుర్మల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ బాలు మల్‌శెట్టి అన్నారు. శుక్రవారం పేటలోని ఎల్లమ్మ దేవాలయంలో మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 19,150 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు అందజేశామని గుర్తుచేశారు. గొల్లకుర్మల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కులస్థులంతా రుణపడి ఉన్నారన్నారు. గొల్లకురుమలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షల బీమా వస్తుందని తెలిపారు. అయితే, కొందరు ప్రభుత్వం అందించిన గొర్రెలను అమ్ముకుంటున్నారని, వీటి విక్రయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత పారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్ విగ్రాం రామాగౌడ్, మెదక్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కోర మల్లయ్య, జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు గోరుగంటి గంగారం, ఖేడ్ అధ్యక్షుడు ప్రకాష్, బాధ్యులు మల్లికార్జున్, శేఖర్ తదితరులున్నారు.

దయనీయ స్థితిలో రైతన్నలు

టీజేఏసీ జిల్లా చైర్మన్ యాదగిరి



కొర్విపల్లిలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని టీజేఏసీ జిల్లా చైర్మన్ సడిమెల యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం, భాగీర్తిపల్లి, కొర్విపల్లి గ్రామాల్లో జేఏసీ సభ్యులు రైతుల సమస్యలపై ఆరా తీశారు. వర్షకాలం పంట దిగుబడి రాక నష్టపోయామని, యాసంగికి అవసరమైన నీరు లేని పరిస్థితి వచ్చిందని రైతులు ఈ సందర్భంగా సభ్యులకు తెలియజేశారు. అంతేకాకుండా గతంలో బ్యాంకులో చేసిన అప్పునకు రుణమాఫీ వడ్డీ చెల్లించకపోవడంతో తిరిగి అప్పులు పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరి వెంట టీజేఏసీ జిల్లా నాయకులు దూడ యాదేశ్వర్, శ్రీమాన్‌రెడ్డి, భిక్షపతి, నర్సింలు ఉన్నారు.

అవగాహన కరువు

- 'బీమా యోజన'పై మహిళల ఆందోళన
- పథకానికి బ్యాంకు ఖాతా లింక్‌తో అవస్థలు
- స్వశక్తి సంఘాల మహిళలకు అందని సమాచారం



స్వశక్తి మహిళల సమావేశం (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆమ్‌ఆద్మీ బీమా యోజన పథకాన్ని మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా ఈ పథకంలో భాగస్వాములైన మహిళలకు, వారి కుటుంబాలకు భద్రత కరువైంది. ఇదిలాఉండగా, నూతనంగా ప్రవేశపెట్టిన అటల్‌బీమా యోజన పథకానికి దీనికి తేడా ఉండటంతో స్వశక్తి సంఘాల్లోని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

'పాలసీ' ముఖ్య ఉద్దేశం

ఈ పాలసీలో భాగంగా స్వశక్తి సంఘంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మహిళలు రూ.12 చెల్లిస్తే సరిపోయేది. కుటుంబంలో భర్త లేక భార్య మరణిస్తే ఆర్థిక సహాయం అందేది. సాధారణ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదశాస్తు మరణిస్తే రూ.75 వేలు అందేవి. బ్యాంకు ఖాతాలతో సంబంధం లేకుండా పథకం వర్తించేది. కానీ, నూతనంగా వచ్చిన పాలసీకి తప్పనిసరిగా బ్యాంకు ఖాతా తీయాల్సిందే.

కొత్తగా అటల్‌జీ బీమాయోజన ఆమ్‌ఆద్మీ బీమా స్థానంలో కేంద్ర ప్రభుత్వం అటల్‌జీ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక్క స్వశక్తి సంఘాల్లోని మహిళలకే కాకుండా ప్రతి ఒక్కరికి ఈ పథకం వర్తింపజేస్తూ నిబంధనలు జారీ చేశారు. బ్యాంకుల్లో ఖాతాలుండి ఏడాదికి రూ.12 చెల్లించిన వారికి ఇది వర్తిస్తుంది.

ప్రమాదవశాస్తు మృతి చెందినా, అనారోగ్యంతో మృతి చెందినా.. బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు అందిస్తారు. ఇప్పుడు ఈ పథకం కింద తప్పనిసరిగా బ్యాంకులో ఖాతాదారుడై ఉండాలి. లేనివారికి ఇది వర్తించదు. అయితే, ఖాతాలున్న వారందరికీ ఈ పథకం ముఖ్య ఉద్దేశం తెలియదు. కాబట్టి పథకంపై ఐకేపీ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది.

పత్తాలేని 'అభయహస్తం'

నాలుగేళ్లుగా అభయహస్తం పెన్షన్ స్కీంకు రెన్యువల్ కరువైంది. ఈ పథకం కింద సంవత్సరానికి రూ.365 చెల్లించిన మహిళలకు సాధారణ, ప్రమాద బీమా పథకం వర్తిస్తుంది. ప్రస్తుతం నాలుగేళ్ల క్రితం చెల్లించినవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. కాగా, ఏడాదిగా అభయహస్తం పెన్షన్లు రావడంలేదు. దీంతో వీటిపై ఆధారపడి, 60 ఏళ్లు నిండిన మహిళలు అవస్థలు పడుతున్నా రు.

రూ.1000కి పెంచాలి

ప్రభుత్వం ఆసరా పథకం కింద వృద్ధులకు రూ.1000 ఇస్తున్నట్టుగానే స్వశక్తి సంఘాల్లోని 60 ఏళ్లు దాటిన మహిళలకు కూడా రూ.1000 ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఇచ్చే రూ.500 చాలడం లేదని, పెంచాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవగాహన కరువు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన స్వశక్తి మహిళలకు సమీపంలోని బ్యాంకుల్లో ఖాతాలు లేవు. బ్యాంకుల్లో ఖాతాలున్న మహిళలకు అటల్‌జీ బీమా యోజన పథకం ఉందని, దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ గ్రామాల్లోని ఐకేపీ సీపీలు, గ్రామైక్య సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరు ఖాతా తీసి ఇన్సూరెన్స్‌ను అనుసంధానం చేసుకోవాలని చెప్పాల్సిన బాధ్యత ఉంది. దాదాపు 10 వేల మంది స్వశక్తి సంఘాల మహిళలుండగా.. కనీసం 2 వేల మందికి కూడా బీమా పథకం అనుసంధానం లేకపోవడం గమనార్హం.

అవగాహన కల్పిస్తాం



గతంలో ఉన్న ఆమ్‌ఆద్మీ బీమా యోజన పథకం రద్దు చేశారు.. కేంద్ర ప్రభుత్వం అటల్‌జీ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే చాలామందికి అవగాహన కల్పించాం. మరోసారి వీఓ సంఘాల సమావేశాల్లో సీఏలతో లేక వీఓ సంఘాల అధ్యక్షులతో అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాస్, ఏపీఎం, అక్కన్నపేట

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

భర్త ఇంటి ముందు రెండు రోజులుగా ధర్నా



భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్న రామేశ్వరి

పుల్‌కల్(అందోల్): కాపురానికి తీసుకెళ్లడం లేదంటూ ఓ గృహిణి భర్త ఇంటి ముందు రెండు రోజులుగా ధర్నాకు దిగిన సంఘటన మండల పరిధిలోని గొంగ్లూర్‌లో చోటుచేసుకుంది. వివరాలివి.. నారాయణఖేడ్ మండలం అబ్బెద్ద గ్రామానికి చెందిన రామేశ్వరికి పుల్‌కల్ మండలం గొంగ్లూర్‌కు చెందిన అలూరి అనిల్‌రెడ్డితో గత జూన్ 8న వివాహం జరిగింది. పెళ్లైన 15 రోజుల నుంచి రామేశ్వరి తీవ్ర అస్వస్థతకు గురవుతుండడంతో తనకు వైద్యం చేయించే స్థోమత లేదని భర్త పుట్టింటికి పంపించాడు. మూడు నెలలుగా వివిధ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేయగా దంపతులకు కౌన్సెలింగ్ చేసి పంపించారు. అయినా అనిల్‌రెడ్డి కాపురం చేయడానికి నిరాకరించడంతో గురువారం గొంగ్లూర్‌లోని భర్త ఇంటి ముందు రామేశ్వరి ఆందోళనకు దిగింది. గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించగా, ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకునేవరకు వెళ్లింది. పెద్దలు పుల్‌కల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయినా రాత్రి తన భర్త ఇంటికి రాలేదని, వేరేవారి ఇంట్లో ఉన్నాడంటూ రామేశ్వరి శుక్రవారం మరోసారి ఇంటి ముందే ధర్నాకు దిగింది. తనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, అదనపు కట్నం కోసమే భర్త ఇదంతా చేస్తున్నాడని రామేశ్వరి ఆరోపించింది. కాగా తన భార్యకు వైద్యం చేయించే స్థోమత లేకే కాపురానికి తీసుకెళ్లేందుకు నిరాకరిస్తున్నట్లు అనిల్‌రెడ్డి తెలిపాడు. దంపతులిద్దరికీ మరోసారి కౌన్సెలింగ్ ఇస్తామని అప్పటికీ వినకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ విత్తనాలే రైతును ముంచాయి

తెలంగాణ మంజీర రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

వట్‌పల్లి(అందోల్): నకిలీ విత్తనాలు పత్తి రైతును నిలువునా ముంచాయని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అన్నారు. మండల పరిధిలోని మర్వెల్లి గ్రామానికి శుక్రవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో చాలా వరకు నకిలీ విత్తనాలే మార్కెట్‌లోకి వచ్చాయన్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఫర్టిలైజర్ దుకాణదారులు లాభార్జనే ధ్యేయంగా నకిలీ విత్తనాలు విక్రయించారని ఆరోపించారు. దీంతో రైతులకు ఎకరానికి సుమారు రూ.30 వేల వరకు నష్టం వచ్చిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 2016లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇంతవరకు నష్ట పరిహారం అందించలేదన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువు

టీమాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో దళితులు, సామాజిక శక్తులకు రక్షణ కరువైందని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు బి.ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం చేర్యాలలో ఒగ్గు రాజు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన మూడున్నరేళ్లలో ప్రజలకు రక్షణలేకుండా పోయిందన్నారు. రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, హత్యలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వం నిందితులకు వత్తాసు పలకడం సరికాదన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు ఆముదాల మల్లారెడ్డి, దాసరి కళావతి, నవజీవన్, గుంటిపల్లి నర్సింహులు, కొమురయ్య, బండ్ల సూర్యం, వెంకన్న, వెంకటయ్య, బడే మియా, సలీం, ప్రభాకర్, కనకయ్య, శ్రీనివాస్, వెంకట్‌మావో, శేఖర్, ఎల్లయ్య, నాగరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్‌ఎస్సీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే గొల్లకురుమల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ గొల్లకురుముల నవనిర్మాణ సమితి(జీకేఎన్‌ఎస్) సభ్యులు శుక్రవారం మిరుదొడ్డిలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొల్లకురుమ నవనిర్మాణ సమితి రాష్ట్ర నాయకులు దాసరి నాగేష్‌యాదవ్, సిద్దాల సత్తయ్య, మొగుళ్ల మల్లేశం, గొల్ల రాములు, కాన ప్రకాష్, రాములు, స్వామి, గోపాల్ తదితరులున్నారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తాం

- ఎట్టి పరిస్థితుల్లో స్కూల్ ఫీజులు పెంచుతాం
- లేదంటే పాఠశాలలు మూసివేస్తాం
- ట్రెస్మా రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేఖర్‌రావు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఎట్టి పరిస్థితుల్లో రానున్న విద్యాసంవత్సరంలో ఫీజులు పెంచుతామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని, లేదంటే పాఠశాలలు మూసివేసి ధర్నాలు చేస్తామని తెలంగాణ స్టేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రెస్మా)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖరరావు స్పష్టంచేశారు. తిరుపతిరావు కమిటీ సూచనలపై నిర్ణయం తీసుకోలేదని, వచ్చే విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు పెంచకుండా పాత పద్ధతినే కొనసాగించాలని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం మండిపడుతోంది. ఈమేరకు సిద్దిపేట అంబిటస్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖరరావు మాట్లాడుతూ.. కమిటీ ఎలాంటి విధివిధానాలు లేకుండా 10 శాతం ఫీజులు పెంచుకోమనడం సరికాదన్నారు. 20 శాతం ఫీజులను పెంచితేనే పాఠశాలల నిర్వహణ కొనసాగుతుందన్నారు. తిరుపతిరావు, డీఎఫ్ఆర్సీ కమిటీల సిఫార్సులు గ్రామీణ ప్రాంత ప్రైవేట్ పాఠశాలలకు అవసరం లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 4 వేల ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల పాఠశాలల్లో 32 లక్షల మందికి 3 లక్షల మంది బోధన, బోధనేతర సిబ్బందితో నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో ట్రెస్మా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి సోమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభాష్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాజేందర్‌రెడ్డి, నాయకులు సికిందర్, రావూస్ ప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరరావు

మంత్రిని కలిసిన రవాణా శాఖ అధికారులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావును సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారిలో జిల్లా రవాణా శాఖ అధికారి రమేశ్వర్ రెడ్డి, రమేశ్‌సింగ్, జోసెఫ్ తదితరులున్నారు.

12

మన సంగారెడ్డి
సాక్షి సంగారెడ్డి
శనివారం | జనవరి | 6 | 2018

వెండితెర



ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి: రుక్మిణి 70ఎం.ఎం(సంగారెడ్డి) 11.15, 2.15, 6.15, 9.15
2 కంట్రీస్ నటరాజ్ 70.ఎం.ఎం 11.00,2.00,6.00,9.00
హలో: సితార
ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి: జ్యోతి 70ఎం.ఎం. (సదాశివపేట) 11.15, 2.15, 6.15, 9.15

న్యూస్ బాక్స్

ఎల్ఓసీ పత్రాలు అందజేత



సదాశివపేట(సంగారెడ్డి): వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేద లకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని సం గారెడ్డి, పసల్‌వాది, మల్కాపూర్ గ్రామా లకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ. 10 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలను శుక్రవారం క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యే అందజేశారు. మల్కాపూ ర్‌కి చెందిన ఎక్కలి కావ్యకు 3లక్షలు, పసల్ వాది గ్రామానికి చెందిన కె. మల్లేశం, 4.50 లక్షలు, సంగారెడ్డికి చెందిన అబ్దుల్ సభాన్‌కు రూ.2. 50 లక్షలు వైద్య చికిత్సల గురించి ముందస్తు మంజూరు ప్రతాలను అందజేశారు. కొండాపూర్, సంగారెడ్డి పార్టీ అధ్యక్షుడు శ్రీదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు మల్లాగౌడ్, ప్రేమానందం, రాజునాయక్, రాంచదర్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సులో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆధ్యా త్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్య క్షుడు గౌరిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.శుక్ర వారం మండల పరిధిలోని వెల్టూర్ శివారులో గల ఖలీమొద్దీన్ ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వ హించారు.ఉత్సవాల్లో శ్రీధర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,చాదర్ సమ ర్పించారు.అనంతరం నిర్వహించిన ఖవాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యనారా యణ,సురేష్ తదితరులున్నారు.



వృథాగా నీటిశుద్ధి పరికరాలు

హత్నూర(సంగారెడ్డి):మండల పరిధిలోని చింతల్ చెరువు ప్రభుత్వపాఠశాలలో కొన్నేళ్లుగా నీటి శుద్ధి పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు శుద్ధ జలాలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వినియోగించ కపోవడంతో లక్ష్యం నీరు గారుతోంది. అధికారులు స్పందించాలి.

పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలని లేకుంటే సదరు కాంట్రాక్టర్, అధికారు లపై చర్యలు తప్పవని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల భోజనశాల విస్తీర్ణం పనులకు రూ.85 లక్షలు, దౌల్తాబాద్ షెటిల్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.5 లక్షలతో చేపట్టే నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ గురుకుల కళాశాల, పాఠశాల ప్రహరీల నిర్మాణాలు నాసిరకంగా ఇటుకను వాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం ఏమిటని సంబంధిత ఏఈ , డిప్యూటీలపై ఆయన మండిపడ్డారు. లక్షల రూపా యాలు వెచ్చించి నిర్మిస్తున్న నిర్మాణాల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాదాలు పాటించకుంటే ఎందుకు చర్యలు తీసు కోలేదని ఇంజనీరింగ్ అధికారులను మందలించారు. హత్నూర గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నాలుగు లైన్ల రోడ్డుతో పాటు డివైడర్, హైమాస్ట్ లైట్లను రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేస్తానన్నారు.



ఇండోర్ స్టేడియానికి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సాకి చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

హత్నూరలోని సాకి చెరువు కట్ట నిర్మాణం పనులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరిశీలించారు. చెరువు మరమ్మత్తుల పనులు త్వరితగతిని నిర్మిస్తున్నందున అభినందించారు. టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మురళీ యాదవ్, టీఆర్ ఎస్ జిల్లా నాయకులు అశోక్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పల్లె జయశ్రీ, తహసీల్దార్ ప్రభావతి ఎంపీడీఓ ప్రమీల నాయక్, సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి , నాయకులు నిరుడి అశోక్, శ్రవణ్ కుమార్, ఎల్లాదాసు, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితవాడలను అభివృద్ధి చేయాలి



సర్వేలో పాల్గొన్న టీమాస్ సభ్యులు

సదాశివపేట(సంగా రెడ్డి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ప్రభుత్వం దళిత వాడలను అభివృద్ధి చేయాలని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కు మార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీమాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని దళితవాడ, హనుమాన్ నగర్ కాలనీల్లో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను పరిశీలించి అక్కడ నివాసం ఉంటున్న ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లిస్తున్నారన్నారు.దళితవాడల్లో రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. దళిత వాడలను అభివృద్ధి చేయడంలో పాలకవర్గం దృష్టి పెట్టడం లేదన్నారు. నాయకులు రాందాస్, సుధాకర్, చంద్రయ్య, కృష్ణ, ప్రకాష్, దాసు, అడివయ్య పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సభ్యులు

సదాశివ పేట రూరల్ (సంగా రెడ్డి):హ రిత హారం కార్యక్ర మంలో భాగంగా పని చేసిన కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీ మాస్ ఫోరమ్ మండల కన్వీనర్ అశోక్ డిమాండ్ చేశారు.శుక్రవారం కొల్కూర్ గ్రామంలో టీ మాస్ ఫోరమ్ మండల బృందం పర్యటించి సమస్యలను ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ డబ్బులు మాత్రం రావడం లేదన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కూలీలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

Zone Guide

నేడు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి):మండల పరిధిలోని వెంక టాపూర్ గ్రామంలో గల వేంకటేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రేపు వీరశైవ జంగమ ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి జోన్:తెలంగాణ రాష్ట్ర, జిల్లా, పట్టణ వీరశైవ జంగమ సమాజం ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 7న సంగా రెడ్డిలో నిర్వహిస్తున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం. వీరేశం తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలోని మఠంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్ (4వ తరగతి ఉద్యోగులసంఘం) కార్యాల యంలో రాష్ట్ర అధ్యక్షులు రుమాళ్ల విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



హత్నూర(సంగారె డ్డి): గ్రామ పంచాయితీలో ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలను చేయడంతో పాటు అవసరమైన రోగులకు మందులను పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ

అంశం:ఇంటి పన్ను వసూళ్లు
అధికారి: కవిత
పంచాయతీ కార్యదర్శి




కొండాపూర్(సంగారెడ్డి):

ప్రశ్న: ఎన్ని గ్రామాలకు పంచాయతీ కార్య దర్శిగా విధులు నిర్వహిస్తున్నారు? తెలపగలరు?
జవాబు: మండలంలో గంగారం,మాందాపూర్,మారేపల్లి,తొగ ర్‌పల్లి లకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను.
ప్రశ్న: గంగారం గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి?
జవాబు: గంగారంలో 450 కుటుంబాలు ఉన్నాయి.
ప్రశ్న:గ్రామంలో ఎంతమేర ఇంటి పన్ను వసూళ్ల చేయాలి?
జవాబు:గ్రామంలో ఇంటి పన్నులు రూ 23,350, నల్లా పన్ను లు15,300లు వసూళ్ల చేయాల్సి ఉంది.
ప్రశ్న: ఇంకా వేరే పన్నులు ఏమైనా వసూలు చేస్తారా?
జవాబు: వ్యాపార పన్నులను కూడా వసూళు చేస్తాం.
ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత పన్ను వసూళ్ళు చేశారు?
జవాబు: ఇప్పటి వరకు రూ కేవలం రూ 3 , 250 వసూలు చేశాం. త్వరలో వంద శాతం పన్నులు వసూళ్ళు చేస్తాం.
ప్రశ్న: పన్నులు వసూలు చేసేందుకు చర్యలేం తీసుకుంటారు?
జవాబు: 15 రోజుల ముందుగానే డిమాండ్ నోటీసు పంపి స్తాం. నోటీసు అందిన 15 రోజుల తరువాత వసూళ్ల చేస్తాం.
ప్రశ్న: వసూలు చేసిన పన్నులను దేనికి ఉపయోగిస్తారు?
జవాబు: గ్రామంలో వసూళ్ళు చేసిన పన్నులను గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి గ్రామంలోని వివిధ రకాల అభివృద్ధి పనులకు,మౌలిక వసతుల కోసం ఖర్చు చేస్తాం.
ప్రశ్న: గ్రామ ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?
జవాబు: ప్రతి ఒక్కరు తప్పకుండా ఇంటి పన్నులతో పాటు వ్యాపార.నల్లాబిల్లులు కట్టాల్సిందే. వసూలు చేసిన డబ్బులను కేవలం గ్రామ అభివృద్ధికి మాత్రమే కేటాయిస్తాం.పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

లక్ష్యాల సాధనకు దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం



బొమ్మనబోయిన శ్రీనివాస్,
సీనియర్ ఫ్యాకల్టీ, హన్మకొండ



స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

పరిచయం: రాజ్యం మనుగడకు ప్రధాన ఆధారం.. రాజ్యాంగం. ప్రతి ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అత్యవసరం. ఒక దేశ ప్రభుత్వ యంత్రాంగ రథచక్రాలు సాఫీగా సాగేందుకు రాజ్యాంగ సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. రాజ్యాంగం అంటే.. దేశ పాలనా స్వభావం, లక్ష్యాల సాధన కోసం దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆసక్తులు, ఆదర్శాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తుంది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, రాజ్యాంగ సభ ఉద్దేశాలను, భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలను ఈ పాఠం స్థూలంగా వివరిస్తుంది. ఈ పాఠ్యాంశ అధ్యయనం ద్వారా విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటారు.

- బ్రిటీష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలన నుంచి భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అయితే స్వాతంత్ర్యానికి ముందే స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనా విధానాల రూపకల్పన (రాజ్యాంగం) అవసరాన్ని గుర్తించారు. అందులో భాగంగా రాజ్యాంగ రచనకు 389 మంది మేధావులతో 1946, ఆగస్టులో రాజ్యాంగ సభ (పరిషత్తు) ఏర్పడింది. వీరిలో 292 మంది వివిధ రాష్ట్రాల నుంచి, 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి, 4 గురు చీఫ్ కమిషనర్ (కేంద్రపాలిత) ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో వివిధ వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు చెందినవారు ఉన్నారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో 26 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారితోపాటు 9 మంది మహిళలు కూడా ఉన్నారు. మెజార్టీ సభ్యులు మాత్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, తర్వాత స్థానంలో ముస్లింలీగ్ పార్టీకి చెందినవారు ఉన్నారు. అయితే 1947, ఆగస్టు 14న దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఆవిర్భవించింది. దాంతో పాకిస్తాన్‌కు చెందిన 90 మంది సభ్యులు తగ్గి, రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కు చేరింది. రాజ్యాంగ సభ సభ్యులంతా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికవ్వలేదు. అయినప్పటికీ దేశ ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగాన్ని రచించారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ముఖ్యాంశాలు

- రాజ్యాంగంలో పొందుపరచాల్సిన వివిధ అంశాల అధ్యయనానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ అతి ముఖ్యమైంది. దీన్ని 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. డా.బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలోని 6 గురు సభ్యులు గల ఈ కమిటీ రాజ్యాంగ సభ సమావేశాల చర్చల ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించింది. రాజ్యాంగం 1949, నవంబర్ 26న రాజ్యాంగ సభతో ఆమోదం పొంది 1950, జనవరి 26 నుంచి పూర్తిగా అమల్లోకి వచ్చింది. దీనికి గుర్తుగా ఏటా జనవరి 26న గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.
- ముసాయిదా రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండగా, రాజ్యాంగం ఆమోదం పొందే సమయానికి 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. తర్వాత కాలంలో రాజ్యాంగానికి వివిధ సవరణలు చేయడంతో రాజ్యాంగ అధికరణల సంఖ్య 448కు, షెడ్యూళ్ల సంఖ్య 12కు చేరుకున్నాయి. రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల సమయం పట్టింది.
- ప్రపంచంలో రెండు రకాల ప్రభుత్వాలు ఉన్నాయి. అవి.. పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ, అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థ. ఇండియాలో మొదటి పద్ధతి అమల్లో ఉంది. రెండో తరహా వ్యవస్థకు అమెరికా మంచి ఉదాహరణ.
- ఏకీకృత విధానం (ఏకకేంద్ర), సమాఖ్య విధానమనే రెండు రకాల రాజ్యాంగ రూపాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం.. సమాఖ్య లక్షణాలతోపాటు ఏకీకృత లక్షణాలు కూడా కలిగుంది. భారతదేశ రాజ్యాంగంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాల్లో ఉన్న మంచి సమాఖ్య లక్షణాలు లేవు. అదే సమయంలో బ్రిటన్‌లో ఉన్న పూర్తి ఏకీకృత లక్షణాలు కూడా లేవు.
- భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.
- భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను కల్పించారు.
- పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల ప్రకారం రాజ్యాంగాన్ని సవరించొచ్చు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం, లౌకికత్వం, సమగ్రత' పదాలను చేర్చారు. ఇది రాజ్యాంగ ప్రవేశికకు చేసిన ఏకైక సవరణ.
- కేశవానంద భారతి వర్సెస్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల గురించి ప్రస్తావించింది. వీటిని సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

4 మార్కుల ప్రశ్న

1. రాజ్యాంగంలో మౌలిక సూత్రాలుంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి?

(సమకాలీన అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించడం)

జ: పై వ్యాఖ్యతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఏ దేశ రాజ్యాంగంలోఅయినా కొన్ని మౌలిక సూత్రాలుంటాయి. అవి.. రాజ్యాంగ స్వరూపాన్ని, ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన మౌలిక సూత్రాల లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలో మార్పులు రావాలి. దీంతోపాటు ప్రజల ఆకాంక్షలు నెరవేరాల్సిన అవసరం కూడా ఉంది. ప్రజలు రాజ్యాంగ పద్ధతిలో వ్యవస్థతో తలపడినప్పుడే ఈ సామాజిక మార్పు సాధ్యమవుతుంది. నేను ఈ వాస్తవాలతో ఏకీభవించడానికి కారణాలు..

- దేశ సార్వభౌమాధికారం ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజలే పాలకులు, ప్రజల కోసం ప్రజలే చట్టాలు చేసుకుంటారు. ప్రజలతో కూడిందే వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలో అభివృద్ధి పూర్వక మార్పులకు ప్రజలు సిద్ధపడాలి.
- లౌకిక, సామ్యవాద సూత్రాలు జాతీయ సమైక్యతను, ప్రజల సంక్షేమాన్ని పెంపొందిస్తాయి. పాలనా వ్యవస్థ వీటిని అమలు చేయాలి. ప్రజలు జాగరూకులై అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. పాలనా వ్యవస్థ ప్రజల కోరికలు, ఆకాంక్షలను పట్టించుకోనప్పుడు ప్రజలే ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.
- రాజ్యాంగ సూత్రాల ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అందించాలి. అలాగే పౌరుల్లో సమానత్వం, సౌభ్రాతృత్వాలను పెంపొందించాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజల జీవితాల్లో ఫలప్రదమైన మార్పులు సంభవిస్తాయి. తద్వారా సామాజిక మార్పును ఆశించవచ్చు.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాలనా వ్యవస్థ విస్మరించినప్పుడు ప్రజలు సమూహంగా ఏర్పడి సామాజిక వ్యవస్థలో మార్పు కోసం ప్రజాప్రతినిధులతో కూడిన పాలనా వ్యవస్థతో తలపడాల్సి వస్తుంది. రాజ్యాంగం కూడా దీన్నే కోరుకుంటుంది. పాలనా వ్యవస్థకు సామాజిక వ్యవస్థే ఆధారం.

2 మార్కుల ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు ఎలాంటి స్వయంప్రతిపత్తి కల్పించారో తెలపండి.

(సమాచార సేకరణ నైపుణ్యం)

జ: భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ ప్రకరణ.. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, గ్రామాలకు స్వయం పాలనాధికారాల గురించి ప్రస్తావించింది. దానికి అనుగుణంగా పార్లమెంట్ 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేసింది. ఇది 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. 73వ రాజ్యాంగ సవరణ.. గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించింది. దీంతోపాటు గ్రామ స్వయంపాలనకు అవసరమైన అధికారాలు, విధులు, బాధ్యతలను పంచాయతీ వ్యవస్థలకు కల్పించింది. వాటిలో ముఖ్యమైనవి.. గ్రామసభ ఏర్పాటు, ప్రత్యక్ష ఎన్నికలు, సీట్ల రిజర్వేషన్, మూడంచెల వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, నిర్దేశిత పదవీకాలం తదితరాలు.

2. భారత్, అమెరికా సమాఖ్య వ్యవస్థల మధ్య ముఖ్య భేదాలను పేర్కొనండి. *(విషయావగాహన)*

జ: అమెరికా, ఇండియాల్లో సమాఖ్య వ్యవస్థ అమల్లో ఉంది. ఈ దేశాల్లో అనుసరిస్తున్న సమాఖ్య విధానాల్లో స్పష్టమైన తేడాలున్నాయి. అవి..

భారత సమాఖ్య వ్యవస్థ: 1. ఏక పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ఏక న్యాయ వ్యవస్థ, 2. సివిల్, క్రిమినల్ చట్టాల్లో సారూప్యత, ఏక విధానం, 3. అఖిల భారత సర్వీసులు.

అమెరికా సమాఖ్య వ్యవస్థ:
1. ద్వంద్వ పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ప్రత్యేక న్యాయ వ్యవస్థలు. 2. చట్టాల్లో సారూప్యత, ఏక విధానం లేదు 3. ప్రత్యేకంగా వేర్వేరు సర్వీసులు.

3. అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా వ్యవస్థల మధ్య తేడా ఏమిటి?

జ: అధ్యక్ష తరహా వ్యవస్థ: దేశ పరిపాలనాధికారాలన్నీ అధ్యక్షుడి చేతిలోనే ఉండే ప్రభుత్వ వ్యవస్థ. అధ్యక్షుణ్ని ప్రభుత్వాధినేత, దేశాధినేత అని కూడా పిలుస్తారు. అధ్యక్షుడు ప్రభుత్వ వాస్తవ కార్యనిర్వహణాధికారిగా ఉంటాడు. **ఉదా:** అమెరికా

పార్లమెంటరీ తరహా వ్యవస్థ: పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీ సీట్లు పొందిన పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలను మంత్రిమండలి నిర్వర్తిస్తుంది. ఈ విధంగా శాసననిర్మాణ శాఖ, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంతో కూడిన వ్యవస్థను పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ అంటారు. మంత్రిమండలి నాయకుడిని ప్రధానమంత్రి అంటారు. ఆయనే ప్రభుత్వాధినేతగా ఉంటారు. ఆయన సలహాలు, సూచనల మేరకే దేశాధినేత అయిన అధ్యక్షుడు (రాష్ట్రపతి) నడచుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారి ప్రధానమంత్రి.
ఉదా: బ్రిటన్, ఇండియా

1 మార్కు ప్రశ్నలు

1. రాజ్యాంగ ముసాయిదా సంఘం అంటే ఏమిటి? దాని ఛైర్మన్ ఎవరు?

జ: రాజ్యాంగ సభ నియమించిన వివిధ కమిటీల నివేదికలపై రాజ్యాంగ సభ తీసుకున్న నిర్ణయాల సారాంశం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించే మేధావుల బృందం (కమిటీ). భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ డా.బి.ఆర్. అంబేద్కర్.

2. రాజ్యాంగ ప్రవేశిక అంటే ఏమిటి?

జ: రాజ్యాంగ స్థూల స్వరూపాన్ని క్లుప్తంగా పరిచయ వాక్యాలతో చెప్పే పత్రమే రాజ్యాంగ ప్రవేశిక. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను తెలుపుతోంది. దీన్ని రాజ్యాంగానికి దర్పణంగా, ముందుమాటగా కూడా పేర్కొంటారు.

3. ఏకీకృత విధానం, సమాఖ్య విధానం మధ్య ప్రధానమైన తేడా ఏమిటి?

జ: ఏకీకృత విధానం: దేశ పాలనాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండటం. ఇది ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ముఖ్య లక్షణం. **ఉదా:** బ్రిటన్.
సమాఖ్య విధానం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు స్పష్టంగా విభజితమై ఉండటం.
ఉదా: అమెరికా, ఇండియా మొదలైనవి.

4. ఉమ్మడి జాబితా అంటే ఏమిటో తెలపండి.

జ: ఉమ్మడి జాబితా: కేంద్రానికి, రాష్ట్రాలకు ఉమ్మడిగా గల అధికారాలను తెలిపే అంశాల జాబితాను ఉమ్మడి జాబితా అంటారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాల మధ్య చట్టాలు చేసే అధికారాలు విభజితమై ఉంటాయి. **ఉదా:** భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పేర్కొన్నారు.

5. రాజ్యాంగ సవరణ అంటే ఏమిటి?

జ: రాజ్యాంగబద్ధంగా దేశ మౌలిక రాజ్యాంగంలో చేసే అవసరమైన మార్పునే రాజ్యాంగ సవరణ అంటారు. సవరణ అంటే రాజ్యాంగంలో అప్పటికే ఉన్న అధికరణలను తొలగించవచ్చు లేదా మార్చవచ్చు, కొత్తవాటిని చేర్చవచ్చు. దేశాభివృద్ధికి అవసరమైన రాజ్యాంగ సవరణలను చట్టసభలు ఆమోదిస్తాయి.

సంగారెడ్డి | శనివారం | జనవరి | 6 | 2018 సాక్షి

'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను'



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ
కళాశాల, నల్లగొండ





మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'అక్షరాజ్య కూటమి'లోని దేశాలేవి?
1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
2) ఇటలీ, జర్మనీ, జపాన్
3) అమెరికా, చైనా, స్పెయిన్
4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్

2. 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
1) బీజింగ్ 2) నాన్‌కింగ్
3) షాంఘై 4) పెకింగ్

3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
1) నైస్ 2) టస్కనీ
3) సార్డీనియా 4) వెనిస్

4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన 'కెమాల్' అంటే?
1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
3) రక్షకుడు 4) విమోచకుడు

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) హిట్లర్ ఆత్మహత్య -1945
2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
4) పైవన్నీ సరైనవే

6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషి

7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
1) చైనా – బ్రిటన్
2) జర్మనీ – ఆస్ట్రియా
3) జపాన్ – అమెరికా
4) ఫ్రాన్స్ – ఇటలీ

8. 'చైనా జాతి పిత' అని ఎవరిని పిలిచారు?
1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
3) చూటే 4) మావో సే టుంగ్

9. రెండో విక్టర్ ఇమ్మానుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
1) సార్డీనియా 2) ఫ్లారెన్స్
3) వెనిస్ 4) సెవాయ్

10. 'నల్లచేయి' అనే గుర్తు ఉన్న 'నరోరా ఒబ్రానా సంస్థ' ఏ దేశ విప్లవ సంస్థ?
1) బోస్నియా 2) సెర్బియా
3) ఆస్ట్రియా 4) మొరాకో

11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
1) పీపుల్స్ అబ్జర్వర్
2) ఇల్ రిసార్జిమెంటో
3) ఇస్క్రా 4) అవంతి

12. 'మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది' అని అన్నదెవరు?
1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
3) మొదటి విలియం
4) నెపోలియన్ బోనాపార్టే

13. ఆస్ట్రియా యువరాజు 'ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్'ను ఎక్కడ హత్య చేశారు?
1) సరాజెవో 2) వార్సా
3) బెర్న్ 4) జెనీవా

14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే 'కంకార్డేట్' అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
1) పోప్ 10వ లియో
2) పోప్ 6వ అలెగ్జాండర్
3) పోప్ 7వ ఫయిస్
4) పోప్ 5వ ఫయిస్

15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్

16. 'యుద్ధం ప్రష్యన్ల జాతీయ పరిశ్రమ' అని అన్నదెవరు?
1) డాంటన్ 2) మిరాబూ
3) రాబిస్పియర్ 4) లఫాయితే

17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
1) ఎర్ర చొక్కాల దళం
2) నల్ల చొక్కాల దళం
3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
4) యంగ్ ఇటలీ సంస్థ

18. జపాన్‌లో 'షింటో' ప్రాచీన మతం. 'షింటో' అంటే?
1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
3) దేవతల మార్గం
4) దైవ శాపగ్రస్థ దేశం

19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
1) 1769 ఆగస్టు 15
2) 1779 జనవరి 26
3) 1789 మార్చి 19
4) 1766 అక్టోబర్ 14

20. 'ఆసియా ఆసియావాసులకే' అనే నినాదం ఏ దేశానిది?
1) జపాన్ 2) చైనా
3) భారత్ 4) శ్రీలంక

21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
2) రెండో జస్టీయన్‌గా కీర్తి పొందాడు
3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
4) పైవన్నీ సరైనవే

22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
3) పోర్చుగీస్‌వారు 4) డచ్చివారు

23. నెపోలియన్ బోనాపార్టే 'భూఖండ విధానం' ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
1) ప్రష్యా 2) ఇంగ్లండ్
3) రష్యా 3) ఆస్ట్రియా

24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్‌ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
1) ఇంగ్లండ్ 2) రష్యా
3) ఫ్రాన్స్ 4) చైనా

25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
1) 1932 2) 1934
3) 1936 4) 1938

26. 'బ్లడ్ అండ్ ఐరన్' పాలసీ సృష్టికర్త ఎవరు?
1) జోసెఫ్ మాజినీ
2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
3) ఆటోవాన్ బిస్మార్క్
4) మూడో నెపోలియన్

27. 'స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది' అని అన్నదెవరు?
1) లెనిన్ 2) స్టాలిన్
3) అడాల్ఫ్ హిట్లర్
4) బెనిటో ముస్సోలినీ

28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) జెనీవా 2) న్యూయార్క్
3) బెర్లిన్ 4) మాస్కో

29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన 'రహస్య పోలీస్ దళం' ఏది?
1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
3) గెస్టాపో 4) ఆగ్‌పూ

30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
1) 1918 2) 1920
3) 1922 4) 1924

31. 'ప్రాచ్య విజ్ఞాన కోశం' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
1) శ్రీలంక 2) జపాన్
3) చైనా 4) బర్మా

32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంఫ్
3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
4) దాస్ కాపిటల్

33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
1) వెనిస్ 2) మిలాన్
3) ఫ్లారెన్స్ 4) రోమ్

34. 'కార్బోనరీ' అంటే?
1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
3) బొగ్గును కాల్చేవారు
4) యుద్ధ ఖైదీలు

35. 'టర్కీ టర్కులకే' అనే నినాదం ఇచ్చిందెవరు?
1) ఇస్మత్ ఇనోను
2) ముస్తాఫ కెమాల్ పాషా
3) అలీ ఫతేహి ఒక్యార్
4) జెనిటో జౌరజ్

36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
1) 1815 2) 1817
3) 1819 4) 1821

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
4) పైవన్నీ సరైనవే

38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
1) 1941 డిసెంబర్ 7
2) 1942 డిసెంబర్ 17
3) 1943 ఆగస్టు 16
4) 1944 మార్చి 19

39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
1) సూర్యుడు, నాగలి
2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
4) పుల్లల మోపు, గొడ్డలి

40. 'ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ' అని ఎవరిని పేర్కొంటారు?
1) మాజినీ 2) గారీబాల్డీ
3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ

41. చైనాలో 'బాక్సర్ తిరుగుబాటు' ఎప్పుడు జరిగింది?
1) 1900 2) 1902
3) 1904 4) 1906

42. కింది వాటిలో సరైన జత ఏది?
1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
4) పైవన్నీ సరైనవే

43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
3) షాట్ 4) వాన్‌రూన్

44. 'మెయిజీ' అంటే?
1) విజ్ఞతతో వ్యవహరించడం
2) నియంతృత్వ పాలన
3) పెద్ద భూస్వామ్య వర్గం
4) దైవలోక చక్రవర్తి

45. చౌఎన్‌లై ప్రధానిగా 'ప్రజా రిపబ్లిక్' ఏ దేశంలో ఏర్పడింది?
1) జపాన్ 2) చైనా
3) ఆస్ట్రియా 4) ప్రష్యా

46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్సలర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
1) 1862 2) 1864
3) 1866 4) 1868

47. 'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను' అని అన్నదెవరు?
1) మొదటి విలియం
2) 16వ లూయి 3) ముత్సుహిటో
4) నెపోలియన్ బోనాపార్టే

48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
3) డెన్మార్క్, ఆస్ట్రియా
4) ఫ్రాన్స్, ఆస్ట్రియా

49. 'ఐరోపా జబ్బు మనిషి' అని ఏ దేశానికి పేరు ఉంది?
1) జర్మనీ 2) టర్కీ
3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్

50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
1) పోలాండ్ 2) డెన్మార్క్
3) రష్యా 4) ఆస్ట్రియా

51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
1) 1914-1918 2) 1915-1918
3) 1914-1917 4) 1914-1924

52. 'బ్యాటిల్ ఆఫ్ నేషన్స్' అని ఏ యుద్ధానికి పేరు?
1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం

53. 'పొడెస్టాస్ అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
1) జర్మనీ 2) ఇటలీ
3) ఆస్ట్రియా 4) రష్యా

54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
1) కైరో 2) అంకారా
3) గాల్లిపోలి 4) టోక్యో

55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
1) జెరోమ్ 2) టాలీరాండ్
3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్

56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం

57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
1) శాసనోల్లంఘనోద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం

58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
1) పూయీ 2) షియోవాంగ్టీ
3) యువాన్ 4) ముత్సుహిటో

59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
3) జనరల్ మెకార్థర్
4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	

నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుట్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.


గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్లు సైన్సు డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫైడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సజావుగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు నింపండి








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.




పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



ఫుట్‌బాల్ టోర్నీ షురూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ రవి



ప్రారంభ మ్యాచ్‌కు సిద్ధమైన జట్లు

- విఖార్ మెమోరియల్ టోర్నమెంట్ ప్రారంభం
- తరలివచ్చిన అంతర్రాష్ట్ర క్రీడాకారులు
- సందడిగా మారిన బాగారెడ్డి స్టేడియం

జహీరాబాద్: క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని డీఎస్పీ నల్లమల రవి సూచించారు. స్థానిక బాగారెడ్డి స్టేడియంలో శుక్రవారం విఖార్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విఖార్ స్మారకార్థం ఆయన తండ్రి జమీల్ అహ్మద్ టోర్నీ నిర్వహిస్తూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. టోర్నీలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నాయి. మూడు రోజుల పాటు డే అండ్ నైట్ పోటీలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు హైదరాబాద్‌కు చెందిన జేపీసీ, ముంబైకి చెందిన ఈఎస్‌ఐసీ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, పార్టీ న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు బసంత్‌పూర్ శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు ఎం.డి.జాఫర్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్, మాజీ ఎంపీటీసీ మక్సూద్, మాజీద్, జమీల్ అహ్మద్, కోచ్ ఎజాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు వరించిన అవార్డు



అకున్ సబర్వాల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సుభాష్‌చందర్

జహీరాబాద్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు జహీరాబాద్ ఎక్సైజ్ ఎస్‌ఐ సుభాష్‌చందర్‌రావును గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ ప్రశంసాపత్రం అందించి అభినందించారు. రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా మార్చేందుకు అందించిన సేవలను గుర్తించి ఈ మేరకు అవార్డు ప్రదానం చేశారు. 2017లో జహీరాబాద్ ప్రాంతంలోని గ్రామాలు, తండాలను విస్తృతంగా పర్యటించి ప్రజల్లో చైతన్యం తెచ్చి గుడుంబా రహిత ప్రాంతంగా తీర్చి దిద్దినందుకు ప్రశంసించారు. ఈ సందర్భంగా సుభాష్‌చందర్ మాట్లాడుతూ.. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెంచినట్లయిందన్నారు.

పదోన్నతి కల్పించండి



డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంగారెడ్డి జోన్: పదోన్నతులు కల్పించాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డీపీఓ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కటుకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 71,72,773లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, అహ్మద్ హుస్సేన్, సుభాష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ



సమావేశంలో మాట్లాడుతున్న రమ

సంగారెడ్డి క్రైం: దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ, నేషనల్ హెల్త్ మిషన్, చైల్డ్ లేబర్ ప్రాజెక్టు, కస్తూర్బాగాంధీ, సర్వశిక్ష అభియాన్, స్వచ్ఛ కార్మికులు, ఐకేపీ వీఓఏ తదితర పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఈ స్కీంలలో పని చేసే వర్కర్లు సుమారు కోటిమంది ఉన్నారన్నారు. పలు స్కీంలలో ఎక్కువగా మహిళలే ఉన్నారన్నారు. వీరి శ్రమకు తగ్గ ఫలితం లేదని, కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. కార్మిక చట్టాలు, సౌకర్యాలు అమలు కావడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న తలపెట్టిన స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, హెచ్‌ఎంఎస్ నాయకులు ఈశ్వర్ ప్రసాద్, టీమాస్ జిల్లా చైర్మన్ అనంతయ్య, నాయకులు సాయిలు, మంగ, స్వాతి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ కుటుంబానికి న్యాయం చేయాలి

సంగారెడ్డి క్రైం: నిజాంసాగర్ ప్రాంతంలోని పిట్లం మండలం కారేగా గ్రామంలో బుధవారం మృతి చెందిన వీఆర్‌ఏ సాయిలుకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య ఒక ప్రకటనలో కోరారు. మృతికి కారణమైన ఇసుక మాఫియా నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వ్యవసాయ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాణిక్కరాజ్ కణ్ణన్

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ మాణిక్కరాజ్‌కణ్ణన్ శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సకాలంలో తగిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. నూతన సాంకేతిక ఫలాలు రైతు క్షేత్రాలకు చేరినప్పుడే ఆహార ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శైలజ, వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, చైర్మన్ విద్యాసాగర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రూపొందించిన వాల్ క్యాలెండర్, డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వం వివక్ష

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హన్మంతరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరావు

సంగారెడ్డి టౌన్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం హైటెన్షన్ విద్యుత్ తీగల బాధిత రైతులపై వివక్ష చూపుతోందని, వారికి రావాల్సి పరిహారాన్ని ఇవ్వకుండా మోసగించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు విమర్శించారు. సంగారెడ్డిలోని మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా పెద్ద పెద్ద టవర్లు, హైటెన్షన్ వైర్లు ఏర్పాటు చేయడంతో రైతులకు తీరని నష్టం జరిగిందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ సూచించిన మేరకు బాధితులకు పరిహారం పట్టణాల్లో నాలుగున్నర లక్షలు, పల్లెల్లో రెండున్నర లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ బాధితులకు ఒక్కో చోట ఒక్కో విధంగా ఇచ్చి అన్యాయం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం చెల్లించే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. 24 గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇది కొనుగోలు చేసిన కరెంట్‌తోనే అని గుర్తు చేశారు. సీఎం సొంత ఊరిలో ఇప్పటి వరకు రుణమాఫీ అమలు కాలేదని, ఒకవైపు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని హన్మంతరావు దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం అన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ధర్నాలు చేస్తే అరెస్టులు చేస్తున్నారని, పోరాటాలు చేస్తుంటే జైళ్లలో పెడుతున్నారని.. ఇదేనా ప్రజాస్వామ్యం అని ఆయన నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. పబ్లిసిటీ కోసం పెట్టిన ఖర్చు రైతుల కోసం ఇచ్చుంటే ఆత్మహత్యలు ఆగేవన్నారు. రైతులకు న్యాయం జరిగేలా కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రిని త్వరలోనే కలుస్తానని తెలిపారు. ఇలాంటి అబద్ధాలు మాట్లాడే ముఖ్యమంత్రిని తన జీవితంలో చూడలేదన్నారు. కేసీఆర్‌ను కీర్తించడం పవన్‌కల్యాణ్‌కు సరికాదన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, స్వస్తి పలికే రోజు వస్తుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పీసీసీ కార్యదర్శి గంప మహేందర్ రావు, నాయకులు బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్: టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన నాలుగు నెలల్లో 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తానని హామీ ఇచ్చారని ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మాట ఇచ్చి తప్పిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఫిబ్రవరిలో 40 వేల మంది మైనార్టీలతో సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఫక్రొద్దీన్, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్ అలీకి సమాచారం అందించామని, వారు త్వరలో ఢిల్లీకి వెళ్లి గులాం నబీ ఆజాద్ పర్యటన తేదీలను ఖరారు చేస్తారని పేర్కొన్నారు. – మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

డప్పోళ్ల రమేష్‌కు అవార్డు



సంగారెడ్డి జోన్: దళిత, పీడిత పక్షాన కలం కవాతు నిర్వహిస్తున్న తెలంగాణ యువకవి, విమర్శకుడు డప్పోళ్ల రమేష్ విశ్వజన కళామండలి అందించే ప్రతిష్ఠాత్మక పురస్కారం 'ట్రూ ఇండియాన్ అన్నబ హూసాటే నేషనల్ అవార్డు–2017'కు ఎంపికయ్యారు. సాహిత్య కార్యకర్త, సాహిత్య కృషికి గుర్తింపుగా అవార్డుకు ఎంపిక చేసినట్లుగా వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్జీ తెలిపారు. ఈ నెల 7న (ఆదివారం) హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డు అందుకోనున్నట్లు బహుజనం జిల్లా అధ్యక్షుడు మాతంగి చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు.

హలో సాక్షి..
జహీరాబాద్: 9948499244,
జహీరాబాద్ టౌన్: 9440068278,
కోహీర్: 9705347296,
న్యాల్‌కల్: 9705347298,
ఝరాసంగం: 9505872923,
ఝరాసంగం రూరల్: 9491900444,

సాక్షి సంగారెడ్డి
శనివారం | జనవరి | 6 | 2018





ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని తుమ్మలపల్లి నుంచి జహీరాబాద్‌కు వెళ్తుండగా ఏర్పాటు చేసిన సూచిక బోర్డు పొదలు పెరగడంతో కనిపించడం లేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ మూలమలుపు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9948499244

వసతులు కరువు

జహీరాబాద్ పట్టణంలో కలిసిన గ్రామ పంచాయతీలకు సంబంధించిన కాలనీల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పష్కారానికి అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, తాగునీరు. వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను చేపట్టడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

• శివారు కాలనీల్లో సమస్యల తిష్ట • పట్టించుకోని అధికారులు



కాంతారెడ్డి కాలనీలో పేరుకుపోయిన మురుగు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణం చుట్టూ అల్లీపూర్, పస్తాపూర్, చిన్న హైదరాబాద్ గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలకు సంబంధించిన పలు కాలనీలు పట్టణ శివారులోకి వస్తాయి. వెంకటరమణ, నారాయణ నగర్, ఎన్‌జీఓస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, గాంధీనగర్,రాంనగర్, ఆనందర్‌నగర్, రాయల్ కాలనీ, బసవకాలనీ పట్టణంలో పూర్తిగా కలిసిపోయాయి. ఆయా కాలనీల్లో ఉద్యోగులు, వ్యాపారులు అధికశాతం నివాసముంటున్నారు. రాంనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో వెనుకబడివర్గాల ప్రజలు నివాసమున్నారు. కాలనీల్లో మౌలిక వసతులు అంతంత మాత్రంగా ఉన్నాయి. సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించినా మురుగు కాల్వలు కట్టకుండా వదిలేశారు. మురుగు సీసీ రోడ్డుపై పారుతోంది. ప్రజలు మురుగు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీలకు పుష్కలంగా నిధులు మంజూరవుతున్నా... సర్పంచులు అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొత్త కాలనీలు కూడా..

పట్టణంలోని పలు వార్డుల పరిధిలోకి వచ్చే కొత్త కాలనీలు కూడా ప్రగతికి దూరంగా ఉన్నాయి. 4వ వార్డులోకి వచ్చే దత్తగిరి కాలనీ, చెన్నరెడ్డి నగర్, 13వ వార్డులోని బాగారెడ్డి పల్లి, కాంతరెడ్డి కాలనీ, మాణిక్‌ప్రభు వీధి తదితర ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మురుగు కాల్వలు సరిగ్గా లేవు. మురుగు రోడ్లపై పారుతోంది. కాలనీలో ఖాళీగా ఉన్న ప్లాట్లు ప్రజలకు శాపంగా మారాయి. ఖాళీ ప్లాట్లు మురికి గుంటలుగా మారాయి. మురుగు ఖాళీ స్థలంలో నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రజల అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి దూరంగా..

పట్టణంతో పాటు శివారు కాలనీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. పేదలు నివాసం ఉండే ప్రాంతాల గురించి అడిగేనాథుడే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీస వసుతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

– మహిపాల్, టీమాస్ నాయకుడు

చర్యలు తీసుకుంటున్నాం

పంచాయతీలు వాటి పరిధిలోకి వచ్చే కాలనీల్లో అభివృద్ధి గురించి దృష్టి పెట్టాం. నిధుల విడుదల ప్రకారం పనులను చేపడుతున్నాం. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు వస్తాయి. సమస్య ప్రాధాన్యతను బట్టి పనులు చేపట్టాలి.

– రాములు, ఎంపీడీఓ

న్యూస్ బాక్స్

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: పీఆర్టీయూ క్యాలెండర్‌ను శుక్రవారం డీఎస్పీ నల్లమల రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు తుల సీరాం రాథోడ్, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు మొగులయ్య, ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, చంద్రురాథోడ్, జిల్లా నాయకులు మోజీస్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, నాయకులు దేవిసింగ్, అశోక్, హీరాలాల్, శేఖయ్య, నవాజొద్దీన్ పాల్గొన్నారు.

చేతిరాతపై విద్యార్థులకు పోటీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ఎమ్మార్సీలో శుక్రవారం చేతిరాతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. న్యాల్‌కల్, మెటల్ కంట, హద్నూర్, జెడ్పీహెచ్‌ఎస్‌లకు చెందిన జ్యోతి, నందిని, విజయ, న్యాల్‌కల్ కేజీబీవీకి చెందిన ప్రేమల ప్రతిభ కనబర్చి డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ఝరాసంగం రూరల్(జహీరాబాద్): విద్యతో పాటు సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ హరికుమార్ అన్నారు. శుక్రవారం ఝరాసంగం, సంగం(కె) గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ శీతకాల శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2, యూనిట్–4కు చెందిన 90 మంది మహిళా వలంటీర్లు గ్రామాల్లో మూఢ నమ్మకాలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ అధికారులు వెంకట్‌రెడ్డి, నవీన్, అధ్యపకులు సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

కోహీర్(జహీరాబాద్): విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకులు భానుప్రకాష్ శుక్రవారం మండలంలో పర్యటించారు. మండలంలోని మద్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గురుజువాడ ప్రభుత్వోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో త్రీహార్స్, ఎల్‌ఈపీ కార్యక్రమాల అమలు తీరును తెలుసుకొన్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ శంకర్ ఉన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...

భాష ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు

జహీరాబాద్ టౌన్:

తెలుగు భాష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ఎమార్సీ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలకు చెందిన 6, 7వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాధికారి బస్వరాజ్ ఆధ్వర్యంలో తెలుగు పండిత్ మొగులయ్య పోటీలను నిర్వహించారు. మండలస్థాయి విజేతలకు ఈ నెల 8న డివిజన్ స్థాయి పోటీల్లో నిర్వహిస్తామని ఎంఈఓ బస్వరాజ్ చెప్పారు. డివిజన్‌స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మండల విజేతలు వీరే..

జహీరాబాద్ మండలంలోని పలు పాఠశాల విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. వై.మల్లేశ్, బి.ఆకాష్, బి.అంజలి, జి.అఖి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మొగుడంపల్లి మండలం నుంచి ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నగేష్, శృతి, సాలెమన్‌రాజ్, నర్సమ్మ డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రోడ్డు పనులను పరిశీలించిన పీఆర్‌ఈఈ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్) నుంచి టేకూర్ మీదుగా ఝరాసంగం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి వేసిన బీటీ రోడ్డు పనులను శుక్రవారం సాయంత్రం జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ దామోదర్ పరిశీలించారు. రూ.1.70 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కావడంతో శుక్రవారం జహీరాబాద్ డిప్యూటీ ఈఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ కృష్ణతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతాయుతంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జహీరాబాద్ టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం ఫైర్‌స్టేషన్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిలిండర్‌కు మంటలు అంటుకున్న సమయంలో ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రిన్సిపాల్ శ్రీశైలం, సిబ్బంది వీరన్న, మహేందర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలపై పోరాటం

జహీరాబాద్ టౌన్: ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని ముస్లిం డెవలప్‌మెంట్ అసోసియెషన్(ఎండీఏ) జిల్లా అధ్యక్షుడు అక్తర్ ఆహ్మద్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పలు సమస్యలపై రాజీలేని పోరాటాలను చేసి విజయం సాధించామన్నారు. అందరి సహకారంతో సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. అంతకుముందు మౌలానా అతీక్ ఉర్రహ్మాన్ కాస్మి కార్యాలయంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎండీఏ కార్యదర్శి ఆమెర్, పట్టణ అధ్యక్షుడు షేక్ వహీద్, కౌన్సిలర్ నరేష్, ఎంపీజే అధ్యక్షుడు నూర్ ఉల్హసన్, ఘోరీ, నాయకులు మోహీజ్, అక్బర్, ఖదీర్, గౌస్ పాషా, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి



ఝరాసంగం(జహీరాబాద్): లక్షలాది రూపాయలు వెచ్చించి బస్టాండ్‌ను నిర్మించినా వినియోగంలో లేకపోవడంతో డబ్బులు వృథా అవుతున్నాయి. నిత్యం వందలాది మంది సంగమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు బస్టాండ్ ఎక్కడో తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతనిధులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మనవి.

– సిద్ధయ్యస్వామి, ఝరాసంగం



వెండితెర



హలో: మోహన్
11.30, 2.30, 6.30, 9.30
ఎంసీప: మహేశ్వరీ
(11.30, 2.30, 6.30; 9.30)
టైగర్ జిందాబాద్: సినిమాక్స్
11.30, 2.30, 6.30, 9.30.
ఇది నీ నా మన ప్రేమకథ:
అనురాగ్ (11.30, 2.30, 6.30, 9.30)

పత్తితీతకు కూలీల కొరత



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని పత్తి రైతులు కూలీల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మండలంలో భారీ విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేశారు. పత్తితీతకు కూలీలు దొరకక అవస్థలు పడుతున్నారు. కూలీల కొరత కారణంగా అధిక శాతం పంట పొలాల్లో పాడవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

రైతులను ఆదుకునేందుకే కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్సీ ఎం.డి.ఫరీదొద్దీన్

జహీరాబాద్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఎం.డి.ఫరీదొద్దీన్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలం హోతి(కె) గ్రామ శివారులో గల గోడౌన్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఫరీదొద్దీన్ మాట్లాడుతూ కందులను క్వింటాల్‌కు రూ.5,450 ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎంతో పాటు పడుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ డి.లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ గౌని శివకుమార్, ఎంపీపీ చిరంజీవి ప్రసాద్, జెడ్పీటీసీ కిషన్‌రావు పవార్, టీఆర్‌ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కె.మాణిక్‌రావు, ఇప్పపల్లి సొసైటీ చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ జి.విజయకుమార్, మార్క్‌ఫెడ్ డీఎం ఇద్రసేనారెడ్డి, స్థానిక మార్కెట్ కార్యదర్శి దామోదర్, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ ఎం.డి.ఫరీదొద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముంగి గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఫరీదొద్దీన్ మాట్లాడుతూ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ శారద, ఎంపీపీ కమలాబాయి పాటిల్, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాండురంగారావు పాటిల్, నర్సింహారెడ్డి, రాజ్‌కుమార్, షేక్ షఫీయొద్దీన్, బస్వరాజ్ పాటిల్, మల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విఠల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డిరవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం చాల్కి, ఖలీల్‌పూర్ గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అర్జున్, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధివినాయక జయంతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామ శివారులో వెలసిన శ్రీ సిద్ధివినాయక ఆలయంలో శుక్రవారం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, అభిషేకం, దేవతా ఆహ్వానం, యజ్ఞాలు చేశారు. అన్నదానం చేశారు.

సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంకష్టహార చతుర్థిని పురస్కరించుకొని భక్తులు ఆలయానికి తరలి రావడంతో పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు అన్నదానం చేశారు.

'కుల రాజకీయాలు చేస్తున్న సీఎం'

జహీరాబాద్ టౌన్: రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి సీఎం కేసీఆర్ కుల రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరోత్తం ఆరోపించారు. పస్తాపూర్ సమీపంలోని ఉత్తం గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాటాడారు. టీడీపీ సీనియర్ నాయకుడు దశరథ్‌రెడ్డి, జహీరాబాద్, కోహీర్, పట్టణ అధ్యక్షులు కృష్ణయ్య, నర్సింలు గౌడ్, మసూద్ హుస్సేన్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శౌకత్‌అలీ, మాణయ్య, సూర్యప్రకాష్, శ్రీకాంత్, అమీన్, బానుచందర్, శంకరయ్య, జగన్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై అధ్యయనం

జహీరాబాద్ టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొనేందుకు తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల (టీమాస్) నాయకులు పల్లెబాట పట్టారు. టీమాస్ జిల్లా నాయకుడు రాంచందర్, నాయకులు ఆవినాష్, సాలోమాన్, నర్సింలు, లక్ష్మణ్, ముక్తర్, నవీన్, సయ్యద్, అలావొద్దీన్ శుక్రవారం మండలంలోని హోతి(బి) గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వాడల్లో కలియదిరిగారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల వాడలు మురికి కూపాలను తలపిస్తున్నాయన్నారు.

సబ్సిడీపై టార్పాలిన్లు

కోహీర్(జహీరాబాద్): సబ్సిడీ ధరపై రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్నామని వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. టార్పాలిన్ అసలు ధర రూ.2,500 కాగా రూ.1 250 సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులు యూనియన్ క్వాలిటీ ప్లాస్టిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ పేరిట తీసిన డీడీలు అందజేసి టార్పాలిన్లు పొందాన్నారు. రెండు టార్పాలిన్లు అవసరమైనవారు రెండు డీడీలు తీయాలన్నారు.

'స్వచ్ఛభారత్' పరిశీలన

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం పని తీరును ఢిల్లీకి చెందిన ప్రతినిధి పరిశీలించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ప్రశాంత్‌కుమార్ పట్టణంలోని ఇళ్ల ప్రాంతాలు, మురికి వాడలు, రోడ్లను పరిశీలించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా బహిరంగ మల విసర్జన ఇంకా ఏ మేరకు ఉందనేది పరిశీలించారు. ప్రజల నుంచి సమాచారం సేకరించారు. ఆయన వెంట మెప్మా ప్రతినిధి స్వర్ణకుమారి ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర కీలకం

జహీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర కీలకమైందని డీఎస్పీ నల్లమల రవి అన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మన తెలంగాణ దినపత్రిక నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి పత్రికలు వారధిగా పని చేయాలన్నారు. జర్నలిస్టులు షకీల్ అహ్మద్, కరీం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): పిట్లం వీఆర్‌ఏపై దాడి చేసిన ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండల వీఆర్‌ఏలు తమసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ వీఆర్‌ఏ సంఘం మండల అధ్యక్షుడు దశరథ్, వీఆర్‌ఏలు సుదర్శన్, కిష్టన్న, విజయ్, రమేష్ తహసీల్దార్ దశరథ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

Zone Guide

7న స్పర్ష్ పరీక్షలు

జహీరాబాద్: ఈ నెల 7వ తేదీన జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ పాఠశాలలో ఇండియన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో స్పర్ష్ పరీక్షలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీన్ దయాళ్ యోజన పథకంలో భాగంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు రైతులకు అవగాహన సమావేశం

జహీరాబాద్: కూరగాయలు, పండ్ల తోటల పెంపకంపై ఈ నెల 6వ తేదీన అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు హార్టికల్చర్ విస్తరణ అధికారి బి.విఠల్ తెలిపారు. మండలంలోని హోతి(బి) గ్రామంలో నిర్వహించే సమావేశానికి హార్టికల్చర్ జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి రైతులు హాజరు కావాలని కోరారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ కమలాబాయి పాటిల్, తహసీల్దార్ దశరథ్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి) పీహెచ్‌సీలో సర్పంచ్ జాహేదాబీ అధ్యక్షతన (ఎన్‌సీడీ) నాన్ కమ్యూబల్ డిసీజస్, అసంక్రమిత వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధులపై ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ సూపర్ వైజరు శ్యామల మాట్లాడుతూ వ్యాధులను గుర్తించేందుకు సిబ్బంది అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీపీ కమలాబాయి పాటిల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు సామెల్, నాయకులు పాండురంగారావు పాటిల్, రాజ్‌కుమార్, షేక్‌షఫీయొద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

సంగమేశ్వర్
అంశం: భూ ప్రక్షాళన
వీఆర్‌ఓ, చాల్కి



న్యాల్‌కల్(జహీరాబాద్):

ప్రశ్న: చాల్కి గ్రామం పరిధిలో ఎన్ని ఎకరాల భూమి ఉంది?
జవాబు: చాల్కి గ్రామ పరిధిలో మొత్తం 2034.02 ఎకరాల భూమి ఉంది.
ప్రశ్న: అందులో ప్రభుత్వ భూమి ఎంత?
జవాబు: ప్రభుత్వ భూమి 150 ఎకరాలు, 1,800 ఎకరాల పట్టా భూమి ఉంది.
ప్రశ్న: సాగులో ఉన్న భూమి ఎంత?
జవాబు: 1,600 ఎకరాలు సాగులో ఉంది.
ప్రశ్న: వ్యవసాయానికి యోగ్యత లేని భూమి ఎంత?
జవాబు: గ్రామంలో వ్యవసాయానికి యోగ్యత లేని భూమి 55 ఎకరాల వరకు ఉంటుంది.
ప్రశ్న: ఎన్ని సర్వే నంబర్లున్నాయి?
జవాబు: 216 సర్వే నంబర్లున్నాయి.
ప్రశ్న: ఎంత మంది రైతులున్నారు?
జవాబు: గ్రామంలో మొత్తం 650 మంది రైతులున్నారు.
ప్రశ్న: భూ ప్రక్షాళన కార్యక్రమం ఎలా కొనసాగుతోంది?
జవాబు: భూ ప్రక్షాళన కార్యక్రమం పూర్తయింది. కార్యక్రమంలో 50 దరఖాస్తులుచ్చాయి. వాటిని పరిష్కరించాం.
ప్రశ్న: చెరువులు, కుంటలు ఏమైనా ఉన్నాయా?
జవాబు: గ్రామ పరిధిలో చెరువులు, అటవీ భూములు లేవు. ఒక కుంట మాత్రం ఉంది.





వటపల్లి(అందోల్): మర్వెల్లి నుంచి నాగులపల్లి వరకు దాదాపు 4 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. కంకర పైనుంచి వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము, ధూళి లేచి పక్కనే పంట లపై పడుతోంది. ఆ పత్తి తీసేందుకు కూలీలు రావడం లేదు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 84650 19333

న్యూస్ బాక్స్

పశువులకు టీకాలు



పశువుకు టీకా ఇస్తున్న డాక్టర్ సాకేత్

జోగిపేట(అందోల్): అందోలు మండలం నేరడిగుంట గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. అందోలు మండల పశువైద్య అధికారి డాక్టర్ సాకేత్, సర్పంచ్ కిష్టయ్య శిబిరాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో దళితులపై దాడులు



జోగిపేటలో మాట్లాడుతున్న నర్సింలు

జోగిపేట(అందోల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలోనే దళితులపై దాడులు జరుగుతున్నాయని అందోలు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి ఏ.నర్సింలు అన్నారు. శుక్రవారం ఆయన జోగిపేటలో విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 200 వార్షికోత్సవాలు జరుపుకున్నా ఏనాడూ దళితులపై దాడులు జరుగలేదన్నారు. మందకృష్ణ మాదిగను ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి అణగదొక్కేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోవాలన్న దళితులను అరెస్టు చేసిన చరిత్ర కేసీఆర్‌దన్నారు.

చెత్తకంపు



చెత్తకుండీలో మంటలు



మంటలను ఆర్పుతున్న విద్యార్థినులు

- పాఠశాల ఎదుట చెత్తను తగలబెడుతున్న సిబ్బంది
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న టీచర్లు, విద్యార్థినులు
- పట్టించుకోని జోగిపేట నగర పంచాయతీ

జోగిపేట(అందోల్): చెత్తను కాల్చొద్దనే నిబంధనలున్నా... జోగిపేట నగర పంచాయతీలో మాత్రం యథేచ్ఛగా రోజూ ఎక్కడో ఓ చోట చెత్తను తగలబెడుతూనే ఉన్నారు. జోగిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదుట చెత్త కుండీ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి చెందిన వారంతా ఇళ్లల్లోని చెత్తనంతా తీసుకొచ్చి ఆ కుండీలో వేస్తారు. ఉదయం వరకు నిండిపోవడంతో దాన్ని తగలబెడుతున్నారు. దీంతో దుర్గంధంతో కూడిన పొగ పాఠశాలలోకి ప్రవేశించడంతో టీచర్లు, విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల గేట్ పక్కనే గల పాఠశాల గదిలో పాఠాలు బోధిస్తున్న టీచర్, ఇద్దరు విద్యార్థినులు వాంతులు చేసుకున్నారు. రోజూ ఉదయం పూట వచ్చే ఆ పొగతో శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఎదుట చెత్తకుండీని ఏర్పాటు చేయడంతో పాటు నీటి కుళాయి పక్కనే చెత్తను వేస్తున్నారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి.

కమిషనర్‌కు చెప్పినా..

ఇటీవల నగర పంచాయతీ కమిషనర్ అంబదాస్ రాజేశ్వర్ పాఠశాలను సందర్శించారు. చెత్తకుండీ కారణంగా ఏర్పడే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అయినా యథావిధిగా చెత్తకుండీలోని చెత్తను తగలబెడుతూనే ఉన్నారు. పెద్దగా మంటలు వ్యాపిస్తుండటంతో విద్యార్థినులే పలుమార్లు నీటిని తీసుకెళ్లి మంటలను ఆర్పిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త కుండీని తొలగించాలి



పాఠశాలకు దగ్గరలోని చెత్త కుండీని వెంటనే నగర పంచాయతీ అధికారులు తొలగించాలి. నీటి కుళాయి పక్కనే చెత్త వేస్తున్నా పట్టించుకోవడం లేదు. కమిషనర్‌కు చెప్పినా ఎలాంటి స్పందన లేదు. – రాధాబాయి, హెచ్‌ఎం

దుర్వాసన..



చెత్తను తగలబెట్టగా వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం. లంచ్ సమయంలో వాసన కారణంగా తినాలని అనిపించడం లేదు. చెత్త కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. – మానస, పదో తరగతి

ఎన్నోసార్లు..



చెత్తకుండీలోని చెత్తను తగలబెడితే మంటలు లేవడంతో నీటిని తీసుకొచ్చి ఆర్పివేసాం. ఈ విషయాన్ని హెచ్‌ఎంకు కూడా తెలియజేశాం. చెత్తకుండీని తొలగించడంతోనే సమస్య పరిష్కారమవుతుంది. – ఫాతిమా, విద్యార్థిని

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించాలి



సింగూర్ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

పుల్‌కల్(అందోల్): ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ అంజయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సింగూర్ గురుకులం, మోడల్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మండల పరిధిలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పర్యవేక్షణ బృందం అధికారులు పరిశీలించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఆర్‌ఆర్‌ఆర్ విధానం, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మునిపల్లి(అందోల్): విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం మండలంలోని పెద్దచల్మెడ పాఠశాలలో విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ దశరథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల సౌకర్యం కోసం టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. బాలికలు, బాలురకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. టాయిలెట్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్లు ఏర్పాటు చేయాలి.

– దర్జి సంగమేశ్వర్, విద్యాకమిటీ చైర్మన్(తాటిపల్లి)



మన అందోల్
సాక్షి సంగారెడ్డి
శనివారం | జనవరి | 6 | 2018

వెండితెర



ఎంసీఏ
వెంకటేశ్వర 70 ఎంఎం
11.15, 2.15, 6.15, 9.15

అధ్వానంగా రోడ్డు



రాయికోడ్(అందోల్) : మండల కేంద్రమైన రాయికోడ్ నుంచి పీపడ్పల్లి వరకు గల బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. 9 కిలోమీటర్ల మేర రోడ్డుపై తారు ధ్వంసమై అక్కడక్కడా పెచ్చులూడిపోయింది. రోడ్డుపై పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి కంకరమయంగా దర్శనమిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కరువై కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా రోడ్లు నిర్మించడంతో త్వరగా రోడ్లు పాడవుతున్నాయనే వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

Zone Guide

7న మల్లికార్జునస్వామి జాతర

మునిపల్లి(అందోల్): ఈ నెల 7వ తేదీన సదాశివపేట మండలం పెద్దాపూరంలోని శ్రీభ్రమరాంభ మల్లికార్జునస్వామి జాతర నిర్వహించనున్నట్లు పూజారులు ఒగ్గు మల్లయ్య, ఒగ్గు కొమురయ్య శుక్రవారం చెప్పారు. శుక్రవారం వారు మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, కంకోల్, మక్తక్యాసారం, చీలపల్లి, మునిపల్లి గ్రామాల్లో భక్తులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 7వ తేదీన శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామికి అభిషేకం, దేవుని కొట్నం, మధ్యాహ్నం 1 గంటకు స్వామి, అమ్మవారికి కల్యాణం, సాయంత్రం అగ్నిగుండం తొక్కుట, గొలుసు తెంపుట, బోనాలు, రాత్రి బాగవతం ప్రదర్శన ఉంటుందన్నారు. రాజయోగి వెంకటస్వామి, శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి హాజరవుతారని తెలిపారు.

వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయికోడ్(అందోల్) : మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికులకు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ చేవెళ్ల విఠల్ ప్రారంభించారు. గ్రామస్తులకు వైద్యురాలు ఉష ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సీహెచ్ఓ రషీద్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు విధిగా మందులు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అధికారులు, ఎన్ఎంలు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

26లోగా నిర్మించుకోకుంటే పథకాలు కట్

జోగిపేట(అందోల్): ఈ నెల 26వ తేదీలోగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోకుంటే ఆర్థికపరమైన లాభాలను నిలిపివేయాల్సి వస్తుందని ఈజీఎస్ ఏపీడీ విశ్వప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం అందోల్ మండలం డాకూరు గ్రామంలో ఐహెచ్‌హెచ్ఎల్‌కు సంబంధించి మాస్ మార్కింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సకాలంలో కట్టుకోకుంటే విద్యుత్ సరఫరా, పెన్షన్లను నిలిపివేసే అవకాశం ఉందన్నారు. డాకూరు, అక్సాన్‌పల్లి, పోసానిపేట గ్రామాల్లో లక్ష్యం పూర్తి కాలేదన్నారు. పోసానిపేట గ్రామంలో పనులు జరుగుతున్నాయన్నారు. అక్సాన్‌పల్లి చాలా వెనకబడి ఉందన్నారు. ఈ రోజు 120 వరకు ఐహెచ్‌హెచ్ఎల్‌లకు మార్కింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అక్సాన్‌పల్లి మదిర గ్రామం బ్రాహ్మణపల్లిలో 100 శాతం పూర్తయ్యిందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీఓ అర్చన, సర్పంచ్ శంకరయ్య, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.



డాకూరులో మార్కింగ్ ఇప్పిస్తున్న ఏపీడీ విశ్వప్రసాద్

అంధ ఉపాధ్యాయుడికి సన్మానం



రాయికోడ్(అందోల్): మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అంధ ఉపాధ్యాయుడు రమేష్‌ను జిల్లా యువజన సంఘాల ఉపాధ్యక్షుడు ఇందూరి కృష్ణ సన్మానించారు. లూయిస్ బ్రేయిల్ జన్మదిన వేడుకల్లో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఏ మాత్రం చూపు లేకున్నా నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న రమేష్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఉపాధ్యాయులు రవీందర్, పరమేశ్, జైరాజ్, వసతి గృహం సిబ్బంది ఉన్నారు.

ఇంటర్వ్యూ

ఎన్.లక్ష్మణ్
అంశం: విద్యాభివృద్ధి
హెచ్ఎం, జమ్గి ప్రాథమికోన్నత పాఠశాల



రాయికోడ్(అందోల్):

సాక్షి: మీ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నారు?
హెచ్ఎం: 1 నుంచి 7వ తరగతి వరకు 35 మంది ఉన్నారు.
సాక్షి: విద్యార్థులకు కనీస సౌకర్యాలున్నాయా?
హెచ్ఎం: తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలున్నాయి. ఆహ్లాదం కోసం పాఠశాల ఆవరణలో 100 మొక్కలు పెంచాం.
సాక్షి: ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాలేంటి?
హెచ్ఎం: అన్ని తరగతుల విద్యార్థులకు రోజూ 5 తెలుగు, 5 ఆంగ్లం పదాలను నేర్పుతున్నాం. ఏదైనా ఒక పాఠం పూర్తిగా చేతితో నోటుబుక్‌లలో రాయడానికి హోం వర్క్ ఇస్తున్నాం. రాసిన హోంవర్క్‌ను నిత్యం పరిశీలిస్తాం. ఈ క్రియతో పిల్లల చేతిరాత మెరుగుపడుతుంది. అక్షర ధోషాలు లేకుండా రాయగలుగుతారు. చదవడంలో తడబాటు ఉండదు.
సాక్షి: పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులసహకారం ఎలా ఉంది?
హెచ్ఎం: ఎస్ఎంసీ కమిటీ, పిల్లల తల్లితండ్రుల పూర్తి సహకారం ఉంది. నిర్ణీత సమయాల్లో వారితో సమావేశమవుతాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాం. హాజరు శాతం తగ్గకుండా, విద్యార్థులు చదువును ఇష్టపడేలా పాఠశాల గోడలపై పలు అంశాలను రాయించాం. మొక్కల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నాం.
సాక్షి: మధ్యాహ్నం పాఠశాలలోనే భోజనం చేస్తున్నారా?
హెచ్ఎం: అక్షయపాత్ర ద్వారా భోజనం సరఫరా చేస్తున్నారు. విద్యార్థులందరూ పాఠశాలలోనే భోజనం చేస్తారు. నాణ్యతను పరిశీలించి, రుచిచూశాకే భోజనం పిల్లలకు అందజేస్తాం. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాం.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జిగా పవన్



పవన్‌కు పార్టీ కండువా కప్పుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అందోల్‌కు చెందిన పవన్‌ను నియమిస్తున్నట్లు వైఎ స్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గౌరిరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. ఆర్.పవన్‌కు పార్టీ కండువా కప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజా సమస్యలను సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు సంజీవరావు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మండల శాఖ అధ్యక్షుడు జి.శంకర్, నాయకులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ జయమ్మ

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో జాగతి హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. శుక్రవారం స్థానిక తూర్పు ముదిరాజ్ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జోగిపేట సీడీపీఓ జయమ్మ మాట్లాడుతూ ధ్యాన్యంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. శిక్షణలో నేర్చుకున్నన్న అంశాలను రోజూ విద్యార్థులకు, స్థానికులకు తెలియజేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్నవి రెగ్యులర్‌గా చేస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. ధ్యాన శిక్షకులు డి.లక్ష్మి, పద్మ, సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ వి.మధుసూదన్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అక్తర్‌ఖాతూన్ పాల్గొన్నారు.



వృథాగా చేతి పంపు



నారాయణఖేడ్: మండలంలోని బాణాపూర్ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట ఉన్న చేతి పంపుకు మరమ్మతులు చేయకపోవడంతో వృథాగా మారింది. దీంతో స్థానికులు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చేతి పంపుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 90101 44464

ఈ 'పాస్' అయ్యేనా?

- ఇక నుంచి ఈ పాస్ ద్వారా ఎరువుల విక్రయాలు
- సిగ్నల్ రాక పోయినా, వేలి ముద్ర స్కాన్ కాకపోయినా కష్టమే
- ఇప్పటికే ఈ పాస్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో సమస్యలు
- ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్న రైతులు

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈ పాస్ యంత్రాల సందడి నెలకొంది. ఏ ఎరువుల దుకాణంలో చూసిన యంత్రాల వినియోగంపై తెలుసుకుంటున్న రైతులు, వివరిస్తున్న నిర్వాహకులే కల్పిస్తున్నారు. దుకాణాల నిర్వాహకులు సైతం ఖాళీ దొరికితే మిషన్ల పనితీరును గమనిస్తున్నారు. ఎరువుల విక్రయాలను తప్పని సరిగా ఈ పాస్ మిషన్ల ద్వారానే చేపట్టాలని అధికారులు సూచిస్తుండడంతో నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది. మనూరు మండలంలోని 9 ఎరువుల దుకాణాలకు అధికారులు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. నాగల్‌గిద్ద మండలంలోని నాలుగు దుకాణాలకు గాను మూడింటికి మిషన్లు అందించారు.

ఆధార్ తప్పనిసరి..

ఇక నుంచి ఎరువులు కావాల్సిన రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆధార్ నంబర్ లేకపోతే రైతులు ఎరువుల కొనుగోలు చేయడం కుదరదని అధికారులు, ఎరువుల దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో ఇప్పటి నుంచే రైతులకు అధికారులు ఈ పాస్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.



ఈ పాస్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

స్కాన్ కాకపోతే..?

ఆధార్ కార్డు ఉన్న రైతు ఎరువులను పొందాలంటే మొదట రైతు ఆధార్ నంబర్‌ను నిర్వాహకుడు ఆధార్ మిషన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం రైతు వేలి ముద్రను స్కాన్ చేస్తారు. ఆధార్ నంబర్, వేలి ముద్ర సరిపోతే రైతుకు ఎరువులు అందిస్తారు. ఒక వేళ సాంకేతిక సమస్యతో రైతు వేలు ముద్ర సరిపోక పోతే ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది?

సిగ్నల్ సమస్య..?

ఈ పాస్ యంత్రాలల ద్వారా ఎరువులు విక్రయించాలంటే తప్పని సరిగా ఇంటర్‌నెట్ సిగ్నల్ అవసరం. మారు మూల ప్రాంతాల్లో అన్ని సమయాల్లో సిగ్నల్ ఉంటుందా అనే ప్రశ్న రైతులను వేధిస్తోంది. ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ఈ పాస్ ద్వారా సరుకులు అందించడం సిగ్నల్ సమస్యతో కష్టమవుతోంది. ఇన్ని సమస్యల నడుమ ఈ పాస్ యంత్రాల ద్వారా ఎరువుల విక్రయం సక్సెస్ అవుతుందో లేదో తెలుసుకోవాలంటే కొద్ది కాలం ఆగాల్సిందే.

దుకాణాల సంఖ్య	పంపిణీ చేసిన యంత్రాలు
నారాయణఖేడ్ –27	21
సిర్గాపూర్ –04	04
కల్హేర్ –09	09
నాగల్‌గిద్ద –04	03
కంగ్టి–17	11
మనూరు –09	09

అవగాహన పెంచుకుంటున్నాం..



ఈ పాస్ ఎంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకుంటున్నాం. ఏమైనా సందేహాలు వస్తే వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకుంటున్నాం.

–రవిందర్‌రెడ్డి, ఎరువుల దుకాణం యజమాని,మనూరు

సాంకేతిక సమస్యలు వస్తే ఎలా?



ఈ పాస్ యంత్రాలు సిగ్నల్ ఉంటేనే పనిచేస్తాయని చెబుతున్నారు. గ్రామాల్లో సిగ్నల్ లేకపోతే ఎలా ఇస్తారో చెప్పాలి. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి.

–రాజు, మాయికోడ్

అవగాహన కల్పిస్తున్నాం..



యంత్రాల వినియోగంపై ఎరువుల దుకాణాల యజమానులకు అవగాహన కల్పించాం. సిగ్నల్ సమస్య అక్కడక్కడ వస్తుందని మా దృష్టికి వస్తోంది. యంత్రాల వినియోగం తప్పనిసరి.

–కె.శ్రీనివాస్‌రెడ్డి,ఏఓ

న్యూస్ బాక్స్

శ్రీసాయి వైన్స్‌పై కేసు నమోదు



శ్రీసాయి వైన్స్ దుకాణం

నారాయణఖేడ్ : చిన్నపిల్లలకు మద్యం విక్రయిస్తున్న శ్రీసాయి వైన్స్‌పై కేసునమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ మహేష్, ఎస్ఐ సూర్యప్రకాష్‌లు శుక్రవారం తెలిపారు. 21 ఏండ్లలోపు పిల్లలకు మద్యం విక్రయించకూడని పరిమితులు ఉన్నా పట్టించుకోకుండా 15ఏండ్లలోపు వారికి మద్యం విక్రయించినట్టు వారు తెలిపారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి షాపు యాజమాన్యానికి రూ.1లక్ష వరకు జరిమానా విధించినట్టు తెలిపారు.

పాముకాటుతో ఎద్దు మృతి



మనూరు(నారాయణఖేడ్):పాముకాటుతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అతిమ్యాల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..రెండు రోజుల కిందట మర్రి రాజు అను నేను చెరుకు నరికేందుకు మనూరు మండలం అతిమ్యాల్ గ్రామానికి తన ఎడ్ల జోడుతో వచ్చాను. గురువారం రాత్రి పాము కాటుకు గురై ఎద్దు చనిపోయినట్టు తెలిపాడు. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపుగా రూ.50వేల వరకు ఉంటుందని తెలిపాడు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నారాయణఖేడ్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ సూచించారు. నారాయణఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టెన్త్ చదువుతున్న విద్యార్థినిలకు సాలరే మిల్లత్ విద్యాభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్, మోడల్ పేపర్ల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళుగా ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అబ్దుల్ జలీల్, సయ్యద్‌యూనుస్, మొయిజ్, పాల్గొన్నారు.

వక్ఫ్‌భూములను పరిరక్షించాలి

నారాయణఖేడ్ పట్టణంతోపాటు ప్రాంతంలోని వక్ఫ్ భూములను పరిరక్షించాలని హైదరాబాద్‌లోని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ నారాయణఖేడ్ ఆర్డీఓ శ్రీనివాస్‌రావును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పట్టణంలోని మహబూబ్ సుబానీ దర్గా, మజీదుల వద్ద వక్ఫ్ భూములను చేపల మార్కెట్ కోసం కేటాయించాలని చూస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మర్చుకోవాలన్నారు ఇతర చోట్ల ఉన్న వక్ఫ్ భూములు సైతం ఆక్రమరణలకు గురికాకుండా పరిక్షించాలని కోరారు. ఆర్డీఓ శ్రీనివాస్‌రావు స్పందిస్తూ వక్ఫ్ భూములను గుర్తించి పరిరక్షించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అబ్దుల్ జలీల్, సయ్యద్‌యూనుస్, మొయిజ్ తదితరులు ఉన్నారు.



పుస్తకాలు అందిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే మొహియొద్దీన్

లోకల్ వాయిస్

పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలి



నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో పీజీ, బీఈడీ కళాశాలలను ఏర్పాటు చేయాలి. స్థానికంగా కేవలం డిగ్రీ వరకే విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక మంది పేదలు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి ఖేడ్‌లో పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలి.

నాయికోటి అమేర్, నారాయణఖేడ్

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..



వెండితెర



నారాయణఖేడ్:
షెట్కార్ సువర్ణ: ఖాకీ
11.30, 2.30,6.15, 9.15,
వెంకటేశ్వర : కేరాఫ్ సూర్య
11.30, 2.30,6.15, 9.15,
జోగిపేట :
వెంకటేశ్వర 70 ఎంఎం:
ఖాకీ
11.15, 2.15, 6.15, 9.15

న్యూస్ బాక్స్

లింగాయత్‌లను ఓబీసీలుగా గుర్తించాలి

నారాయణఖేడ్: లింగాయత్‌లను ఓబీసీలుగా గుర్తించాలని లింగాయత్ సమాజ్ రాష్ట్ర నాయకుడు మధుశేఖర్, జిల్లా అధ్యక్షుడు నులుగంటి సిద్దేశ్వర్‌లు మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.సురేష్ షెట్కార్ మాట్లాడుతూ లింగాయత్‌లు వెనుకబడి ఉన్నారని ఓబీసీలుగా గుర్తించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు.

గ్రామజ్యోతి కమిటీలకు శిక్షణ

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామజ్యోతి కమిటీ సభ్యులు క్రియశీలకంగా పనిచేయాలని కల్హేర్ ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిర్గాపూర్ మండలంలోని బోక్కస్‌గాం పంచాయతీ పరిధిలోని కమిటీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లడుతూ.. 2017–18వ సంవత్సరంలో చేపట్టనున్న వివిధ అభివద్ధి పనులకు ప్రణాళిక రుపొందించాలన్నారు. సంక్షేమ పథకాల అమలుపై సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య పాల్గొన్నారు.

రాజీవ్‌చౌక్ వరకు బస్సులు నడపాలి

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని రాజీవ్ చౌక్ వరకు బస్సులు నడపాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్ శుక్రవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంగ్టి, ర్యాకల్, మనూరు, రాయిపల్లి నుంచి రాజీవ్ చౌక్ వరకు బస్సులు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు . కార్యక్రమంలో ఎంపీటీసీ పండరిరెడ్డి, శంకర్‌సేట్, పండరిపటేల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి తెలుగు క్వీజ్ పోటీలు నిర్వహించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, రాంరెడ్డిపేట, తదితర పాఠశాలల విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహారెడ్డి, టీచర్లు సంజీవరెడ్డి, మోహన్, మశ్చేందర్, రవి, శ్యామ్, అశోక్‌రెడ్డి, కవిత పాల్గొన్నారు.



విద్యార్థులే.. ఉపాధ్యాయులు..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం నర్సింహారెడ్డి అభినందించారు.

బడి నిర్వహణలో భయమేది?

- ఇష్టారీతిగా ప్రైవేటు పాఠశాలల నిర్వహణ
- నిబంధనలకు నీళ్లు వదులుతున్న యాజమాన్యాలు
- పట్టించుకోని అధికారులు



డాన్‌బాస్కో పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కల్హేర్(నారాయణఖేడ్): అడ్డగోలుగా పాఠశాల నిర్వహిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటంలేదు. శుక్రవారంమండలంలోని బాచేపల్లి డాన్‌బాస్కో ప్రయివేట్ పాఠశాల బస్సు ప్రమాదంలో 15 మంది విద్యార్థులు గాయపడి ప్రణాలతో బయటపడ్డారు. 2016లో ప్రారంభమైన డాన్‌బాస్కో పాఠశాల ప్రారంభమైంది. పాఠశాల నిర్వహణలో యాజమాన్యం అడుగడుగున నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి. కేరళకు చెందిన ఉపాధ్యాయులతో పాఠశాల నడుపుతామని ప్రచారం చేయడంతో చుట్టూ పక్క గ్రామాల నుంచి పిల్లలను భారీగా పాఠశాలలో చేర్పించారు. సంగారెడ్డి –నాందేడ్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డాన్‌బాస్కో పాఠశాల 'డేంజర్ జోన్'లో ఉంది. రహదారిపై నుంచి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పాఠశాల నిర్వాహకులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహారించాల్సిన అవసరం ఉంది.

బస్సు ఉన్నా సమచారం లేదు..

డాన్‌బాస్కో పాఠశాలకు చుట్టూ పక్క గ్రామాల నుంచి విద్యార్థులను తరలించేందుకు బస్సు ఉన్నా అధికారులకు సమచారం లేదు. పాఠశాల యాజమాన్యం ఎన్ని బస్సులు నడుపుతోంది.. డ్రైవర్ వివరాలు విద్యాశాఖ అధికారులకు అందజేయాల్సి ఉంది. కానీ..ఇందుకు సంబంధించి అధికారుల వద్ద సమచారం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యం ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. బస్సు ప్రమాదానికి గురికావాడంతో అధికారుల్లో చలనం వచ్చింది. ఎట్టకేలకు పాఠశాల యాజమాన్యనికి ఎంఈఓ శంకర్ నోటీస్ జారీ చేశారు. తదుపరి చర్యలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. డాన్‌బాస్కో పాఠశాలకు నోటీస్ జారీ చేసి తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంఈఓ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ



విద్యార్థులకు ఆట వస్తువులు అందిస్తున్న సాధన సంస్థ బాధ్యులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని పోతన్‌పల్లి పాఠశాలలో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆట వస్తువులను విద్యార్థులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌నాయక్ మాట్లాడుతూ..ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు ఆటలు ముఖ్యమన్నారు. ఆటలు ఆడడంతో మానసిక, శారీరక దృఢత్వంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. సాధన సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. సాధన కోఆర్డినేటర్ డీ. లింగం మాట్లాడుతూ..10 పాఠశాలల విద్యార్థులకు ఆట వస్తువులు అందించనున్నట్లు చెప్పారు. సంస్థ ద్వారా బడి బయటి పిల్లలను బడుల్లో చేర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ఉప సర్పంచ్ పండరి, గ్రామస్థులు శంకర్, నర్సింహులు, పండరి, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీశైలం, సాధన సభ్యులు రాజు, నాందేవ్, బాగ్యమ్మ పాల్గొన్నారు.

Zone Guide

8 నుంచి క్రికెట్ టోర్నీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలో ఈనెల 8వ తేదీ నుంచి 13వ తేదీవరకు శివరావుషెట్కార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఖేడ్ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బి.హన్మంతు తెలిపారు. ఆసక్తిగల జట్లు ఈనెల 6వ తేదీ సాయంత్రం 5గంటల లోగా లక్ష్మి ఫోటో స్టూడియోలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్లకు 13వ తేదీన బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 9440880850, 9491448250, 9440498217 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దళితులపై నిరంతరం దాడులు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెంకటి కుమార్

నారాయణఖేడ్: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత దళితులు, అభ్యుదయ వాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెంకటి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణఖేడ్‌లో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ఆటవిక చర్యలను తిప్పికొట్టేందుకు లౌకిక వాదులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళిత హక్కులపై చైతన్యం తీసుకువస్తున్న ప్రొఫేసర్ సూరేపల్లి సుజాతపై దాడులకు తెగబడుతూ, ఆమెను విద్రోహశక్తిగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 6, 7వ తేదీల్లో వరంగల్‌లో జరగనున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాజు, రవి, నరేష్, మహేష్, జగదీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

హన్మాండ్లు
అంశం : పాఠశాలల నిర్వహణ
రిసోర్స్ పర్సన్



నారాయణఖేడ్:

ప్రశ్న: హన్మంత్‌రావుపేట కాంప్లెక్స్‌లో ఎన్ని పాఠశాలల ఉన్నాయి?

జవాబు: హన్మంత్‌రావుపేట కాంప్లెక్స్ పరిధిలో మొత్తం 18 పాఠశాలల ఉన్నాయి.

ప్రశ్న: మధ్యాహ్న భోజనం అమలు, మూత్రశాలల పరిస్థితి?

జవాబు: మధ్యాహ్న భోజన పథకం సక్రమంగానే అమలవుతోంది. 2 పాఠశాలల్లో మూత్రశాలలు లేవు. వీటినిర్మాణం కోసం డీఈఓకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: విద్యార్థులకు తాగునీటి వసతి ఉందా?

జవాబు: 13 పాఠశాలల్లో బోర్లు ఉండగా మిగతా పాఠశాలలకు పంచాయతీ ద్వారా నల్లా కనెక్షన్లు ఇచ్చాం. నీటి ఇబ్బందులు ఏమీ లేవు.

ప్రశ్న: ఎస్కార్ట్ అలవెన్స్ ఏమైనా చెల్లిస్తున్నారా?

జవాబు: హన్మంత్‌రావుపేట పాఠశాలకు గునుకుల కుంట నుండి 15 మంది విద్యార్థులు కాలినడకన వస్తున్నారు. వీరికి ఎస్కార్ట్ అలవెన్సులు చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుండి బిల్లులు విడుదల కాలేదు. అందుకే చెల్లించడంలేదు.

ప్రశ్న: ఎన్ని నెలలుగా రావాల్సి ఉంది?

జవాబు: ఒక్కో విద్యార్థికి రూ.250 చొప్పున 10 నెలలకు సంబందించి రావాల్సి ఉంది. మూడేళ్లుగా రావడంలేదు. డీఈఓకు ఈవిషయంపై నివేదిస్తున్నాం.

ప్రశ్న: వంట గదుల పరిస్థితి?

జవాబు: వంట గదులు నూతనంగా మంజూరు అయ్యాయి. త్వరలో నిర్మాణం జరగనుంది.



పాత వంతెనలకు మోక్షం

- రూ. కోటితో కొత్త వంతెనల నిర్మాణ పనులు
- సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

వందేళ్ల నాటి బ్రిడ్జిలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. శిథిలావస్థలో బ్రిడ్జిలు ఉండటంతో అవి ఎప్పుడు కూలిపోయి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఈ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమైంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కృషితో గ్రామాలను కలిపే ప్రధాన రహదారులపై ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. మరి కొన్ని బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని అక్కమ్మ చెరువు అలుగు పారే ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి ఏళ్ల కాలం నాటిది. చెరువు అలుగు పారితే రహదారిపై నుంచి నీళ్ల ప్రవహించేవి. దీంతో వారం రోజుల పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. ప్రతి ఏటా వానాకాలంలో ఈ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నీటి ప్రవాహానికి ఓ వ్యక్తి కూడా కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రసుతం ఈ డ్రిబ్జి నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. రూ.80లక్షల నిధులతో ఈబ్రిడ్జి పనులను పూర్తి చేశారు. దీంతో పాటు బొంతపల్లి దేవాలయం నుంచి బొంతపల్లి కమాన్ మద్యలో ఉన్న బ్రిడ్జి వందేళ్ల నాటిది. ఈ బ్రిడ్జి పూర్తిగా శిధిలావస్తకు చేరింది. చాలా ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. వానాకాలంలో ఈ బ్రిడ్జిపై నుంచి నీరు వెళ్తుండటంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడేవారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ.1.50కోట్ల నిధులను ప్రభుత్వం విడుదలచేసింది. ఇందుకు సంబంధించిన పనులు పూర్తి అయ్యాయి. దీంతో ప్రజలు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిన్నారం– బొంతపల్లిదేవాలయ గ్రామాలను కలిపే ప్రదాన రహదిరిలో ఉన్న బ్రిడ్జి కూడా శిధిలావస్థకు చేరింది. ఇందుకు సంబంధించిన రూ.80లక్షల నిధులతో ప్రస్తుతం నూతన బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. సోలక్‌పల్లి నుంచి వడ్డేపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి కూడా ఇరుకుగా ఉండటంతో ప్రజలుతీవ్ర అవస్థలుపడ్డారు. వానాకాలంలో బ్రిడ్జిపై నుంచి నీళ్లు ప్రవహించేవి. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను రూ.1.80కోట్లతో చేపట్టారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాలను కలిపే ప్రధాన బ్రిడ్జిలను తిరిగినిర్మించేందుకు గాను ఎమ్మెల్యే మ హిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కోట్ల రూపాయల నిధులతో బ్రిడ్జి పనులు చేపట్టినందుకు గాను ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



జిన్నారం- బొంతపల్లి మధ్య పూర్తి అయిన బ్రిడ్జి

రూ.కోట్లతో బ్రిడ్జిల నిర్మాణాలు



జిన్నారం, గుమ్మడిదల మండలాలలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అసరమైన చోట బ్రిడ్జిల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు కేటా యిస్తోంది.

–మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

సంతోషంగా ఉంది



గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని గ్రామాలను కలుపుతూ డబుల్ రోడ్లు అయ్యాయి. వీటితో పాటు అత్యాధునికంగా బ్రిడ్జిలను నిర్మిచంటం సంతోషంగా ఉంది. జిన్నారం మండల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించే విధంగా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పల్నాటి భాస్కర్, జిన్నారం



జిన్నారం(పటాన్‌చెరు):మండల కేంద్రంలోని వీధిలైట్లు పగలు కూడా వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. ఈసమస్యను పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9550408956

న్యూస్ బాక్స్

క్రీడా ఉత్సవాలు ప్రారంభం



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మైత్రీ గ్రౌండ్‌లో క్రీడా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సందర్భంగా విద్యార్థిని,విద్యార్థులకు 100, 200, 400 మీటర్ల పరుగు పందాలు, లాంగ్ జంప్, షాట్‌పుట్, కబడ్డీ పోటీలు నిర్వహించామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల క్రీడల కన్వీనర్ కృష్ణయ్య,అధ్యాపకులు యోగిబాబు,శ్రీనివాస్,శ్రవణ్ కుమార్,ప్రవీణ,ప్రణీత పాల్గొన్నారు.

ఘనంగా పతంజలి ఆవిష్కరణ దినోత్సవం



హోమంలో పాల్గొన్న శ్రీధర్‌రావు తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు):ప్రతి ఒక్కరు యోగాను నేర్చుకోవాలని, యోగాతో మంచి ఆరోగ్యం లభిస్తోందని భారత్ స్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. పతంజలి ఆవిష్కణ దినోత్సవం సందర్భంగా అన్నారం గ్రామంలోని ప్రకృతి నివాస్‌లో యోగా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జెండాను ఎగురువేశారు. ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని చేపట్టారు. ర్యాలీ కూడా నిర్వహించారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ పతంజలిభారత్ స్వాభిమాన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా శిక్షణలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగా శిక్షణకులు, యోగా గురువులు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

రామచంద్రపురం(పటాన్‌చెరు):వెల్మెల గ్రామంలోని సరోజనమ్మ గుట్టపై మల్లన్న ఆలయంలో జరుగుతున్న జాతరలో శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ఠతను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనేక ఏళ్లుగా గుట్టపై మల్లన్న దేవుడు ఉన్నాడని ఇక్కడ నిత్యం పూజలందుకుంటున్నారని స్థానికులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని. ఆలయ నిర్మాణానికి కావల్సిన నిధులను అందిస్తానని తెలిపారు. గుట్టకింద డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను కట్టేలా తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. పలువురు పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వద్దు

పటాన్‌చెరు:అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పటాన్‌చెరులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, విద్యా శాఖ, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. పట్టణంలో చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణాల్లో మధ్యాహ్నం వరకు చెత్త తొలగించడంలేదని ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులను తప్పుపట్టారు. ఈ నెల 10 నుంచి 13 వరకు అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆర్సీపురంలోని కొల్లూరులోని సమష్టి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖాధికారులకు సూచించారు. జలమండలి అధికారులపై ఎమ్మెల్యే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.



పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

పద్మశాలి భవనానికి శంకుస్థాపన

పట్టణంలో పద్మశాలి భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పద్మశాలి సంఘం అధ్యోక్షుడు రాజమల్లయ్య, ఉపాధ్యక్షుడు రఘురాములు, ప్రధాన కార్యదర్శి కంకర శ్రీనివాస్, నాయకులు ప్రకాశ్, ప్రసాద్, నాచగిరి తదితరులు పాల్గొన్నారు. సీఎం సహాయ నిధి నుంచి పట్టణానికి చెందిన ఎన్.రమాదేవికి రూ.15వేలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్యంతో బాధపడిన ఆమెకు ఆ నిధులు వైద్యఖర్చుల కోసం మంజూరు చేయించినట్లు తెలిపారు.

లోకల్ వాయిస్

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి



రామచంద్రపురం(పటాన్‌చెరు):భెల్ టౌన్‌షిప్‌లోని బుధవారం సంత నుంచి ఎంఐజీకి వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రిళ్లు ఆ మార్గం గుండా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. దగ్గరకు పోయే వరకు అవి కనిపించడం లేదు. అధికారులు స్పందించాలి.

–రాము, లింగంపల్లి



వెండితెర



ఒక్క క్షణం:
రుక్మిణి 70ఎం.ఎం
(పటాన్‌చెరు)
11.15, 2.15, 6.15, 9.15

ఎంసీఏ మిడిల్ క్లాస్అబ్బాయి:
ఎస్‌వీ సినీ స్క్వేర్
11.00,2.00,6.00,9.00

ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
సంగీత(రామచంద్రాపురం)

హలో:
జ్యోతి 70ఎం.ఎం.

ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి :
జ్యోతి(బొల్లారం)
11.00,2.00,6.00,9.00

న్యూస్ బాక్స్

ఆహ్వానపత్రం అందజేత



పటాన్‌చెరు టౌన్:హైదరబాద్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో ఆదివారం జరిగే టీపీయూఎస్ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు ఉపేందర్ చారి,నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో పాల్గొనాలి

కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి



రామచంద్రపురం(పటాన్‌చెరు):భారతినగర్ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్న మంత్రి హరీశ్‌రావు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతు భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ, ఎల్ఐజీ, మాక్‌సొసైటీ, అన్నమయ్య ఎక్లీవ్ కాలనీతో పాటు బొంబయికాలనీ, ఇక్రిశాట్‌పెన్సింగ్ కాలనీలలో శనివారం రూ.10కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, శంఖుస్థాపనలు ఉన్నాయని ఇందులో నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్వ పాల్గొంటారని తెలిపారు. శనివారం సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 4.30గంటలకు ఎల్ఐజీ కాలనీలోని వాటర్‌ట్యాంక్ వద్ద బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు కొత్తప్రభాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, ఆర్‌కెపూడి గాంధీ పాల్గొంటారని ఆమె తెలిపారు.



విద్యార్థినుల యోగాసనాలు

జిన్నారం(పటాన్‌చెరు):గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని ప్రకృతి నివాస్‌లో వారం రోజుల నుంచి పతంజలి ట్రస్టు ఆధ్వర్యంలో యోగా ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యోగా నేర్చుకుంటున్న వారు ప్రత్యేక ఆసనాలను వేస్తున్నారు. వీటితో ఆరోగ్య సమస్యలు దూరమావుతాయని అంటున్నారు.

రైతుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రపురం(పటాన్‌చెరు):వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్మెల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు గతంలో గ్రామాలన్ని వ్యవసాయంతో కిటకిటలాడేవన్నారు. కాని నేడు 20శాతానికి వ్యవసాయం వచ్చిందని వివరించారు. రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎం తో కృషిచేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విదంగా వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే చెందుతుందన్నారు. సీఎం రైతుల సంక్షేమానికి పెద్దపీత వేశారన్నారు. రైతులకు మూడు దఫాలుగా రుణమాఫీ చేశారని తెలిపారు. మూడేళ్ల కాలంలో వ్యవసాయ సాగు పదింతలు పెరిగిందని తెలిపారు. రైతులు పండించిన పంటకు దళారులు మద్దతు ధర ఇవ్వడం లేదని దీన్ని దృష్టిలో పెట్టుకొని స్వయాన ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు మద్దతు ధర ఇస్తుందని తెలిపారు. కందులు క్వింటాలు బయట రూ.3500 ఉండగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో రూ.5, 450 రూపాయలు ఇస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఏవిధంగా కృషిచేస్తుందో తెలుస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు టీఆర్ఎస్ పాలనలో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎంపీపీ యాదగిరియాదవ్, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి, పటాన్‌చెరువు మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుష్పానగేష్‌యాదవ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మల్లెపల్లి సోమిరెడ్డి, ఆత్మకమిటీ అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఎం పీటీసీ సభ్యులు యాదగిరి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, తెల్లాపూర్ ఉపసర్పంచ్ దేవేందర్‌యాదవ్, నాయకులున్నారు.

పాఠశాలల సందర్శన



పటాన్‌చెరు టౌన్:మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం స్టేట్ టీమ్ సందర్శించింది. ముత్తంగి ప్రాథమిక పాఠశాల,ఇంద్రేశంలోని బాలికల ఉన్నత పాఠశాల, శాంతినగర్ ప్రాథమిక పాఠశాలను స్టేట్ టీం సభ్యులు విజయ రాజు,గోవర్ధన్ సందర్శించారు.ముందుగా పాఠశాలలోని ఎల్ఈపి త్రీఆర్స్,విద్యార్థుల ప్రగతి రిజిష్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్,మల్లేషం, చారి,కిషన్,రమేష్, మంజులత,సీఆర్పీలు శేషాద్రి,రామకృష్ణ,భాస్కర్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



రామచంద్రపురం(పటాన్‌చెరు):మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని భారత్‌వికాస్ పరిషత్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం భారత్‌వికాస్ పరిషత్, రాణిరుద్రమదేవి టెంపుల్ ఆఫ్ ఆర్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడిపై శిక్షణ ఇచ్చి వారికి కిట్లను అందజేశారు. టెంపుల్‌ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు సతీష్‌గౌడ్ , భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులున్నారు.

ఈత చెట్లు దగ్ధం

జిన్నారం(పటాన్‌చెరు):జిన్నారంలోని గురుకుల పాఠశాల వెనక ఉన్న ఈత చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి దగ్ధం చేశారు. దీంతో పాటు ఈత చెట్ల మధ్య ఉన్న పైపులు, కరెంటు వస్తువులను అపహరించుకు వెళ్లారు. గౌడ సంఘం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

Zone Guide

ఆస్పత్రి సమాచారం

పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం డాక్టర్ రాజేష్ విధులు నిర్వర్తించనున్నారు.ఉదయం 9 నుండి ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటారు.రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

పేదలకు అండగా ఉంటాం



కాంగ్రెస్‌లో చేరిన వారితో అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు:పేదలందరికీ అండగా ఉంటామని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ మండలం పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో వివిధ పార్టీలకు చెందిన యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభ, ర్యాలీ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌రెడ్డి కూడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తొలినుంచి పేదలకు అండగా ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడ వచ్చి స్థిరపడిన కార్మికులకు తాను అండగా ఉంటానని చెప్పారు. సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించి రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అనిల్‌రెడ్డిలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. సుల్తాన్‌పూర్ వార్డు సభ్యుడు దేవానంద్, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, శ్రీను, ప్రభాకర్, కుమార్, అశోక్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన గ్రామ పెద్దల్లో ఎట్టయ్య, యాదయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూ

అంశంపాఠశాలల సమస్యలు
అధికారి: వెంకటేశ్వర్లు
విద్యాధికారి



రామచంద్రపురం(పటాన్‌చెరు):

ప్రశ్న: పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వివరించగలరు?

జవాబు: ఎంఈఓగా కొన్నిరోజుల క్రితమే ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టాను, త్వరలో మండలంలో పూర్తిస్థాయిలో పర్యటిస్తా. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తా

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: అలాంటిది ఇప్పటివరకు ఏమి నా దృష్టికి రాలేదు. అలాంటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తాం.

ప్రశ్న:గుర్తింపులేని స్కూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: నిబంధనలకు విరుద్దంగా నడిచే స్కూళ్లపై చర్యలు తప్పవు. ఆయా పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న:ఈ సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?

జవాబు: గతేడాది మండలంలో మంచి ఫలితాలే వచ్చాయి. ఈ ఏడాది కూడా మంచి ఫలితాలు వచ్చేందుకు తన వంతు కృషిచేస్తాను. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. గత ఏడాది కన్న ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

హలో సాక్షి..
సంగారెడ్డి టౌన్: 9985489901,
సంగారెడ్డి రూరల్ 7702108156
సంగారెడ్డి అర్బన్: 9573701997
సంగారెడ్డి జోన్: 8501925249
సదాశిపేట:9705347294
సదాశిపేట రూరల్: 9346469540
కొండాపూర్: 9989326068
హత్నూర: 9966910336
సంగారెడ్డి క్రైం 9493537021



‘ఇండోర్’ ఏర్పాటు చేయరూ..

- స్టేడియం నిర్మిస్తే దశ తిరగనున్న పాత పట్టణం

సంగారెడ్డి టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న ట్లు ప్రకటించింది. దీంతో పట్టణవాసులు పాత పట్టణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరు తున్నారు. ఇండోర్ ఏర్పాటు చేస్తే పాత పట్టణం అభివృద్ధి చెందుతుందంటున్నారు.జిల్లా కేంద్రంలోని పాత పట్టణం ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఓల్డ్‌టౌన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు కొత్త బస్టాండ్ వైపే ఏర్పాటు అవుతున్నారు. దీంతో ఇటు వైపు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా సంగారెడ్డి పట్టణం పాత బస్టాండ్ పరిధిలోని పాత జైలు క్వార్టర్స్ స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉంది. దీంతో జిల్లా కేంద్రంలోని నూతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వెనుక గల స్థలంతో పాటు జిల్లా జైలు క్వార్టర్స్ స్థలం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్థానిక



ఖాళీగా ఉన్న జైలు క్వార్టర్స్ ఆవరణ

ప్రజలు పాత బస్టాండ్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే పాత పట్టణం అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఇండోర్ స్టేడియం పోతిరెడ్డిపల్లి పరిధిలోకి వెళ్లితే పాత పట్టణం అభివృద్ధి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందంటున్నారు. ప్రభుత్వ భవనాలు తదితర అభివృద్ధి కారకాలైన భవనాల నిర్మాణం పాత బస్టాండ్‌లో జరగవని దీంతో ప్రస్తుతం జరిగిన అభివృద్ధి స్థిరంగా నిలిచిపోయే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం పాత పట్టణం పరిధిలోనే ఉండటంతో క్రీడకారులు సైతం పాతబస్టాండ్ పరిధిలోనే ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే బాగుంటుందంటున్నారు. మార్కెట్ రోజు తప్ప పాత బస్టాండ్ వైభవం కనిపించడం లేదు. పాత పట్టణం పూర్వ వైభవం కోసం పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సంస్థల ఏర్పాటుతో పట్టణం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగించుకొని పట్టణాభివృద్ధికి దోహదపడాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ స్థలంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలచే వ్యవసాయం చేయించే వారు. మిగతా భూమిలో స్టాఫ్ క్వార్టర్స్ ఉండేవి. కంది గ్రామ పరిధిలోకి జైలును తరలించడంతో ఈ స్థలం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పట్టణాభివృద్ధికి దోహదపడే నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంతో అభివృద్ధి



పాత పట్టణం అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి. ఇండోర్ స్టేడియం ఏర్పాటు పాత పట్టణ పరిధిలో గల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుంది. అంబేడ్కర్ స్టేడియం దగ్గరగా ఉండటం వల్ల క్రీడాకారులు మరింత నైపుణ్యం పెంచుకునే అవకాశాలు ఉంటాయి. దీంతోపాటు పాత పట్టణం అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– బుస్స భాస్కర్, క్రీడాకారుడు



కొండాపూర్(సంగారెడ్డి):మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాలువల నుంచి తీసిన మురుగును రోడ్డుపైనే ఉంచారు. దీంతో సాయంత్రం వేళ దోమల బెడద ఎక్కువ కావడంతో పాటు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది.అధికారులు స్పందించి కాలువల నుంచి తీసిన మురుగును రోడ్ల పై నుండి తొలగించాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 8501925249

న్యూస్ బాక్స్

బస్సు సౌకర్యం కల్పించాలి

సంగారెడ్డి క్రైం :కంది మండలంలోని చిమ్నాపూర్ మదిర గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ సంగారెడ్డి డిపో మేనేజర్ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కంది బస్టాండ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉన్నందున విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామస్తులు దుర్గయ్య, భిక్షపతి, నవీన్, శశికళ, సుశీల , నర్సమ్మ, కనుకమ్మ, శమంత, సింధూరెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

కొండాపూర్(సంగారెడ్డి): మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం వివిధ పాఠశాలలకు చెందిన 6, 7వ తరగతి విద్యార్థులకు తెలుగులో చేతిరాత పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మారేపల్లి పాఠశాలకు చెందిన ప్రణతి,తొగర్‌పల్లికి చెందిన సాయిప్రియ, గంగారం విద్యార్థి వకీల్, కొండాపూర్ విద్యార్థి నేహ ఎంపికైనట్లు మండల ఇన్‌చార్జి భీంసింగ్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 8న సంగారెడ్డిలో జరిగే డివిజన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆయుత ధర్మదీక్షకు మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి):సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 7న గజ్వేల్‌లో నిర్వహించనున్న అయుత ధర్మదీక్షకు టీఎస్‌టీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని రాష్ట్ర్ల అధ్యక్షుడు మాణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.టీఎస్‌టీఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గజ్వేల్‌కు తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని, పట్టణ ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 7 వార్డుల్లోని మహిళా సంఘాల స్లమ్ సమాఖ్య ప్రతినిధులకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2018 లక్ష్య సాధనకు ప్రజలందరు పూర్తిగా సహకరించాలన్నారు. స్లమ్ సమాఖ్య ప్రతినిధులందరూ వార్డుల్లోని సమాఖ్య మహిళలకు స్వచ్ఛ సర్వేక్షన్ గురించి వివరించి ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి మహిళలకు తెలియజేసి చైతన్యపరచాలన్నారు. చెత్తను ఎక్కడపడిత అక్కడ పడవేయకుండ మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు. ఇంటి ముందుకు వచ్చే ఆటోలకు తడిపొడి–చెత్తను వేరు చేసి సహకరించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి జోన్: పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ పాలకవర్గం పూర్తిగా విఫలమైందని టీమాస్ పట్టణ చైర్మెన్ మల్లయ్య, కన్వీనర్ మహబూబ్ ఖాన్ ఆరోపించారు. శుక్రవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, 23వ వార్డు బాలాజీ నగర్ , కల్వకుంటలో సర్వే నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన సమస్యలు క్రోడీకరించి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మినారాయణకు వినతిపత్రం అందజేశారు. పర్యటించిన వారిలో టీ మాస్ సభ్యులు మల్లేశ్వరీ, యాదవరెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

కులబ్‌గూర్‌లో..

మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామంలో టీమాస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్వీమ్ వర్కర్లు, కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచకపోయిన సీఎం తన వేతనాన్ని నెలకు నాలుగున్నర లక్షలకు పెంచుకున్నారని ఆయన ఆరోపించారు. కులబ్‌గూర్ మదిర గ్రామమైన సదాశివనగర్‌లో దళిత బస్తీలో నేటికి సీసీ రోడ్లు, అర్హులకు ఆసరా పెన్షన్‌లు, వీధి లైట్లు లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు శ్రీనివాస్, కృష్ణ, సత్యనందం, వెంకయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న టీ మాస్ సభ్యులు

లోకల్ వాయిస్

సదుపాయాలు కల్పించాలి



సంగారెడ్డి జోన్ :కులబ్‌గూర్ గ్రామ పరిధిలోని సదాశివనగర్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తి అయినా మౌలిక సదుపాయాలు లేవు. అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేయాలి. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సదుపాయాలు కల్పించడంలో పాలకులు దృష్టి సారించడం లేదు.

–సుధాకర్, స్థానికుడు

12
మన సంగారెడ్డి
సాక్షి సంగారెడ్డి
శనివారం | జనవరి | 6 | 2018



వెండితెర



ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
రుక్మిణి 70ఎం.ఎం(సంగారెడ్డి)
11.15, 2.15, 6.15, 9.15
2 కంట్రీస్
నటరాజ్ 70.ఎం.ఎం
11.00,2.00,6.00,9.00
హలో: సితార
ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
జ్యోతి 70ఎం.ఎం.
(సదాశివపేట) 11.15, 2.15,
6.15, 9.15

న్యూస్ బాక్స్

ఎల్‌ఓసీ పత్రాలు అందజేత



సదాశివపేట(సంగారెడ్డి): వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని సంగారెడ్డి, పసల్‌వాది, మల్కాపూర్ గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ. 10 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. మల్కాపూర్‌కి చెందిన ఎక్కలి కావ్యకు 3లక్షలు, పసల్‌వాది గ్రామానికి చెందిన కె. మల్లేశం, 4.50 లక్షలు, సంగారెడ్డికి చెందిన అబ్దుల్ సభాన్‌కు రూ.2. 50 లక్షలు వైద్య చికిత్సల గురించి ముందస్తు మంజూరు ప్రతాలను అందజేశారు. కొండాపూర్, సంగారెడ్డి పార్టీ అధ్యక్షుడు శ్రీదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు మల్లాగౌడ్, ప్రేమానందం, రాజునాయక్, రాంచదర్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సులో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గౌరిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని వెల్‌ట్టుర్ శివారులో గల ఖలీమొద్దీన్ ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఉత్సవాల్లో శ్రీధర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,చాదర్ సమర్పించారు.అనంతరం నిర్వహించిన ఖవాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యనారాయణ,సురేష్ తదితరులున్నారు.



వృథాగా నీటిశుద్ధి పరికరాలు

హత్నూర(సంగారెడ్డి):మండల పరిధిలోని చింతల్ చెరువు ప్రభుత్వపాఠశాలలో కొన్నేళ్లుగా నీటి శుద్ధి పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు శుద్ధ జలాలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వినియోగించకపోవడంతో లక్ష్యం నీరు గారుతోంది. అధికారులు స్పందించాలి.

పనుల్లో నాణ్యత లేకపోతేచర్యలు తప్పవు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలని లేకుంటే సదరు కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తప్పవని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల భోజనశాల విస్తీర్ణం పనులకు రూ.85 లక్షలు, దౌల్తాబాద్ షెటిల్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.5 లక్షలతో చేపట్టే నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల కళాశాల, పాఠశాల ప్రహరీల నిర్మాణాలు నాసిరకంగా ఇటుకను వాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం ఏమిటని సంబంధిత ఏఈ , డిప్యూటీలపై ఆయన మండిపడ్డారు. లక్షల రూపాయాలు వెచ్చించి నిర్మిస్తున్న నిర్మాణాల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాదాలు పాటించకుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఇంజనీరింగ్ అధికారులను మందలించారు. హత్నూర గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నాలుగు లైన్ల రోడ్డుతో పాటు డివైడర్, హైమాస్ట్ లైట్లను రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేస్తానన్నారు.



ఇండోర్ స్టేడియానికి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సాకి చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

హత్నూరలోని సాకి చెరువు కట్ట నిర్మాణం పనులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరిశీలించారు. చెరువు మరమ్మత్తుల పనులు త్వరితగతిని నిర్మిస్తున్నందున అభినందించారు. టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మురళీ యాదవ్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు అశోక్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పల్లె జయశ్రీ, తహసీల్దార్ ప్రభావతి ఎంపీడీఓ ప్రమీల నాయక్, సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి , నాయకులు నిరుడి అశోక్, శ్రవణ్ కుమార్, ఎల్లాదాసు, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితవాడలను అభివృద్ధి చేయాలి



సర్వేలో పాల్గొన్న టీమాస్ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ప్రభుత్వం దళితవాడలను అభివృద్ధి చేయాలని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీమాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని దళితవాడ, హనుమాన్ నగర్ కాలనీల్లో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను పరిశీలించి అక్కడ నివాసం ఉంటున్న ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లిస్తున్నారన్నారు.దళితవాడల్లో రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. దళితవాడలను అభివృద్ధి చేయడంలో పాలకవర్గం దృష్టి పెట్టడం లేదన్నారు. నాయకులు రాందాస్, సుధాకర్, చంద్రయ్య, కృష్ణ, ప్రకాష్, దాసు, అడివయ్య పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సభ్యులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): హరితహారం కార్యక్రమంలో భాగంగా పని చేసిన కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీ మాస్ ఫోరమ్ మండల కన్వీనర్ అశోక్ డిమాండ్ చేశారు.శుక్రవారం కోల్కూర్ గ్రామంలో టీ మాస్ ఫోరమ్ మండల బృందం పర్యటించి సమస్యలను ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ డబ్బులు మాత్రం రావడం లేదన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కూలీలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

Zone Guide

నేడు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి):మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గల వేంకటేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రేపు వీరశైవ జంగమ ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి జోన్:తెలంగాణ రాష్ట్ర, జిల్లా, పట్టణ వీరశైవ జంగమ సమాజం ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 7న సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం. వీరేశం తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలోని మఠంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్ (4వ తరగతి ఉద్యోగులసంఘం) కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు రుమాళ్ల విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



హత్నూర(సంగారెడ్డి): గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలను చేయడంతో పాటు అవసరమైన రోగులకు మందులను పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ



అంశం:ఇంటి పన్ను వసూళ్లు

అధికారి: కవిత
పంచాయతీ కార్యదర్శి



కొండాపూర్(సంగారెడ్డి):

ప్రశ్న: ఎన్ని గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు? తెలపగలరు?
జవాబు: మండలంలో గంగారం,మాందాపూర్,మారెపల్లి,తొగర్‌పల్లి లకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను.
ప్రశ్న: గంగారం గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి?
జవాబు: గంగారంలో 450 కుటుంబాలు ఉన్నాయి.
ప్రశ్న:గ్రామంలో ఎంతమేర ఇంటి పన్ను వసూళ్లు చేయాలి?
జవాబు:గ్రామంలో ఇంటి పన్నులు రూ 23,350, నల్లా పన్నులు15,300లు వసూళ్లు చేయాల్సి ఉంది.
ప్రశ్న: ఇంకా వేరే పన్నులు ఏమైనా వసూలు చేస్తారా?
జవాబు: వ్యాపార పన్నులను కూడా వసూళు చేస్తాం.
ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత పన్ను వసూళ్ళు చేశారు?
జవాబు: ఇప్పటి వరకు రూ కేవలం రూ 3 , 250 వసూలు చేశాం. త్వరలో వంద శాతం పన్నులు వసూళ్ళు చేస్తాం.
ప్రశ్న: పన్నులు వసూలు చేసేందుకు చర్యలేం తీసుకుంటారు?
జవాబు: 15 రోజుల ముందుగానే డిమాండ్ నోటీసు పంపిస్తాం. నోటీసు అందిన 15 రోజుల తరువాత వసూళ్లు చేస్తాం.
ప్రశ్న: వసూలు చేసిన పన్నులను దేనికి ఉపయోగిస్తారు?
జవాబు: గ్రామంలో వసూళ్ళు చేసిన పన్నులను గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి గ్రామంలోని వివిధ రకాల అభివృద్ధి పనులకు,మౌలిక వసతుల కోసం ఖర్చు చేస్తాం.
ప్రశ్న: గ్రామ ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?
జవాబు: ప్రతి ఒక్కరు తప్పకుండా ఇంటి పన్నులతో పాటు వ్యాపార.నల్లాబిల్లులు కట్టాల్సిందే. వసూలు చేసిన డబ్బులను కేవలం గ్రామ అభివృద్ధికి మాత్రమే కేటాయిస్తాం.పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలి.